19-1Pg1exHMNWJQE.qxd:19-1Pg1exHMNWJQE.qxd 01/01/01 8:04 AM Page 1


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు, fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-1-2025 ఆదివారం సంపుటి: 30 సంచిక: 351 పేజీలు: 12 వెల: 8.00


**తొలిరోజునే ట్రంప్ 10 ఉత్తర్వులు!**

రేపు ప్రమాణ స్వీకారానికి భారీ ఏర్పాట్లు 9లో


**కేజ్రీవాల్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి**

# ప్రతిష్టాత్మకంగా 'స్వచ్ఛాంధ్ర'

- ప్రతి మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదే కార్యక్రమం
- సీమరైతు మీసం తిప్పేరోజొస్తుంది
- రెండేళ్లలో పోలవరం పూర్తి
- పేదరికం లేని సమాజమే ఎన్టీఆర్ లక్ష్యం: సిఎం చంద్రబాబు



**కడప, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని, నెలలో ప్రతి మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి శనివారం మైదుకూరులో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మాజీ సిఎం దివంగత ఎన్టీఆర్ 29వ వర్థంతిని పురస్కరించుకుని ఘనంగా వర్థంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో చంద్రబాబు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర విజయవంతానికి ఐదు సూత్రాలు అమలు చేస్తామని, తద్వారా రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని అభిప్రాయపడ్డారు. 12 నెలల్లో ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని, ప్రతి ఇంటి వద్ద నూరు శాతం చెత్త సేకరణ ద్వారా విద్యుదుత్పత్తితోపాటు మరికొన్ని లాభాలు కూడా ఉంటాయని తెలిపారు. అక్టోబర్ 2వ తేదినాటికి ఎక్కడ కూడా చెత్త లేకుండా చూస్తామని పూర్తి స్థాయిలో అక్టోబరు 26 నాటికి ఈ కార్యక్రమం అమలు చేస్తామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర ద్వారా స్వచ్ఛభారత్‌లో ఎపిని అగ్రగామిగా నిలబెడతానని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సభలకు బయట నుంచి జనాలను తరలించి ఆర్భాటం చేశారని, ఇక నుంచి దీనికి చెక్ పెట్టినట్లు సిఎం పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలో పోలవరం పూర్తి చేసి రాయలసీమ ప్రాంతంలోని ప్రాజెక్టులకు ఎన్టీఆర్ జలయజ్ఞంలో భాగంగా నీరందిస్తామని హామీ ఇచ్చారు. తద్వారా కరవుసీమలో రైతు మీసం తిప్పే రోజు దగ్గరలోనే వస్తుందని అన్నారు. ఎన్టీఆర్ వల్లే సీమలో ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు. గోదావరి పెన్నా పోలవరం పెరకచర్ల వరకు అనుసంధానం చేస్తే గేమ్ చేంజర్‌గా తయరవుతుందని ఎట్టి పరిస్థితుల్లో పెరకచర్లకు నీరు తీసుకురావడం తన జీవిత ఆశయమన్నారు. రాజకీయాలకు కొత్త నిర్వచనం చెప్పి పేదల జీవితాలను మార్చిన ఘనత ఆయనదేనన్నారు. ఆనాడే రూ.35 పింఛన్ పథకాన్ని ఎన్టీఆర్ ప్రవేశపెట్టగా ఆయన స్ఫూర్తితో ఇప్పుడు రూ.4వేలు పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కడప జిల్లాను >>2



శనివారం రాత్రి విజయవాడ వచ్చిన అమిత్‌షాతో భేటీ అయిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్

# ఎపికి పూర్తి సాయం

**హామీలన్నీ అమలు..**

**ఎన్డీయె సర్కార్లకు ఢోకాలేదు..**

**సిఎం చంద్రబాబు నివాసంలో విందుకు హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా**

**నేడు గన్నవరంలో ఎన్డీఆర్‌ఎఫ్ వేడుకకు హాజరు**

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఎన్డీఏ కూటమి అభ్యున్నతి బాటలో సంఘటితంగా ముందుకు సాగుతుందని కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. కేంద్రంలోను, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండటం బహుళ ప్రయోజనాలున్నాయని వ్యాఖ్యానించారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ ఆయనను టిడిపి, జనసేన, బిజెపికి చెందిన 14మంది కీలక రాష్ట్ర నాయకులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో నేరుగా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేరుకున్నారు. ఆయనకు అక్కడ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. ఆ వెంటనే అమిత్‌షా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో మాట్లాడారు. >>2

# నేడు దావోస్ పర్యటనకు సిఎం

## డబ్ల్యుఇఎఫ్‌లో బిజినెస్ దిగ్గజాలతో భేటీలు

**విజయవాడ, జనవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** బ్రాండ్ ఎపి ప్రమోషన్ నినాదంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు ఈ నెల 19వ తేది అర్ధరాత్రి దాటి తరువాత వెళుతున్నారు. ప్రపంచ బిజినెస్ దిగ్గజాలు వచ్చే ఈ సదస్సులో భాగస్వాములు అవ్వడం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు సిఎం చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. దేశానికి సంబంధించి పలు దిగ్గజ సంస్థలతో పాటు గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు కూడా ఇప్పటికే ఎపిలో పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, పారిశ్రామిక దిగ్గజాలతో ఉన్న పరిచయాలు, గతంలో సాధించిన విజయాలు కారణంగా 7 నెలల కాలంలోనే పెద్ద సంఖ్యలో పెట్టుబడులవచ్చాయి. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తల్లో నమ్మకాన్ని కల్గించిన చంద్రబాబు... పెట్టుబడుల విషయంలో ఒక పాజిటివ్ వాతారణాన్ని తీసుకురాగలిగారు. దీంతో దేశంలోని ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటి వరకు రూ. 4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. వీటిలో కొన్ని ప్రాజెక్టులకు ఇప్పటికే శంకుస్థాపనలు కూడా జరిగాయి. రానున్న రోజుల్లో అర్సెల్లార్ మిత్తల్ స్టీల్ పరిశ్రమ, బిపిసిఎల్ వంటి ప్రాజెక్టుల పనులు కూడా ప్రారంభం కానున్నాయి.

**జాబ్ ఫస్ట్ విధానం**

ఎన్నికల్లో ప్రకటించినట్లు 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల సాధన లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 20 లక్షల ఉద్యోగ, ఉపాధి >>2

**ఆర్జీకర్ కేసులో సంజయ్‌రాయ్ దోషి**

**పట్టుబడిన సైఫ్ కేసు నిందితుడు**

**అద్దె ఇళ్లలోని వారికి సైతం ఉచిత విద్యుత్: కేజ్రీవాల్ హామీ** 9లో



శనివారం పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభించిన దృశ్యం

## పోలవరం డయాఫ్రంవాల్
# నిర్మాణం ఆరంభం

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు వద్ద నూతన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్సీ హయాంలో ప్రాజెక్టు పనులు నిలిచిపోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను మళ్లీ పట్టాలెక్కించారు. ఈ నేపథ్యంలోనే కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన పనులను ఇవాళ కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది.

ఇందులో భాగంగా ఉదయం 10:19 గంటలకు కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణ పనులను జలవనరుల శాఖ అధికారులు ప్రారంభించారు. ముందుగా ప్రాజెక్టు ప్రాంతంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. అనంతరం భారీ యంత్రాలకు పూజలు చేశారు. పనులను బావర్ కంపెనీ ప్రతినిధులు ప్రారంభించగా ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించారు. ఈ నిర్మాణం కోసం ప్లాస్టిక్ కాంక్రీట్‌టీ5 మిశ్రమాన్ని వినియోగించనున్నారు. మొత్తం ప్రాజెక్టు పూర్తయితే 194 టిఎంసిల మేర నీటిని నిల్వ చేయవచ్చు. గతంలో టిడిపి హయాంలోనే డయాఫ్రం వాల్ నిర్మించినా వైఎస్సార్సీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 2020 గోదావరి వరదలకు అది మూడు చోట్ల దెబ్బతింది. >>2

## తొక్కిసలాట ఘటనపై
# కేంద్రహోంశాఖ విచారణ

**తిరుమల, జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** పది రోజుల వైకుంఠద్వారదర్శనాలకు ఆఫ్‌లైన్‌లో ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్ల జారీకి ముందే తిరుపతిలో తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతిపై కేంద్ర హోంశాఖ కూడా విచారణ చేపట్టనుంది. ఇప్పటికే ఈ ఘటనపై పలువురు జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం, హైకోర్టులో న్యాయవాది పిల్ దాఖలు చేయడం వంటి వాటితో కేంద్రహోంశాఖ స్పందించింది. ఈనెల 8వతేదీ తిరుపతిలో ఏం జరిగింది, తొక్కిసలాటకు కారణాలు, తిరుమల లడ్డూవితరణ శాలలో అగ్ని ప్రమాదం ఘటనపై విచారణ చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. దీనికోసం అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ సోమ >>2

# స్వచ్ఛాంధ్రకు అంకితం కావాలి

**35 మంది పారిశుధ్య కార్మికులను సత్కరించిన డి. సిఎం పవన్**



శనివారం చెత్తవాహనం ప్రారంభించి, స్వయంగా నడుపుతున్న పవన్ కళ్యాణ్

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నంబూరు గ్రామంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సేకరణ, నిర్వహణ, సంపద సృష్టి తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ప్రతి నెల మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. నంబూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. నంబూరులోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద మొక్కను నాటి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ స్థాయిలో సేకరించిన చెత్త వివిధ నిర్వహణా క్రమాన్ని పరిశీలించారు. మొదట పళ్లు, కూరగాయల వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీ సైక్లింగ్, శానిటరీ వేస్ట్ మేనేజ్ మెంట్ పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాలతో వర్మికంపోస్ట్ తయారీ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ఉపయోగిస్తున్న మూడు రకాల బుట్టలను అధికారులు పవన్ కళ్యాణ్‌కు చూపారు. తడి చెత్త, పొడి చెత్తతో పాటు విష పూరిత వ్యర్థాలను వేరు చేసేందుకు ఇంటికి మూడు చెత్త బుట్టలు ఇస్తున్నట్టు తెలిపారు. చెత్త నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల యంత్ర పరికరాల పనితీరుని పవన్ కళ్యాణ్ అడిగి తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్న గ్రామాల >>2

# వెంకన్న సాక్షిగా.. పుష్ప'విలాపం'!



భక్తుడు సమర్పించిన విగ్రహాలు

**కోటి రూపాయల పుష్పాలంకరణ తొలగింపుపై ఓ దాత ఆగ్రహం**

**భక్తుల ఎదుటే తీవ్రస్థాయిలో ఆవేదన**

**తిరుమల,జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలు పురస్కరించుకుని దాతల సహకారంతో ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్న పుష్పాలంకరణలు, దేవుని దశావతారాల విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈ అలంకరణల్లో భాగంగా బెంగుళూరుకు చెందిన దాత సుమారు కోటిరూపాయలు విలువైన విగ్రహాలు, పలురకాల సువాసనల పుష్పాలను విదేశాల నుండి ప్రత్యేకంగా తీసుకువచ్చి >>2




19-1pg2exHMNWJQE.qxd:19-1pg2exHMNWJQE.qxd 01/01/01 8:00 AM Page 1





శనివారం ప్రయాగరాజ్‌లో కుంభమేళా ఉత్సవాల సందర్భంగా సంగమంవద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాధ్ తదితరులు

# డయాఫ్రంవాల్ నిర్మాణం ఆరంభం

>> ఇసుక కోతకు గురై అగాథాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వాటిని పూడ్చి, ఇసుకను వైబ్రో కాంపక్షన్ విధానంలో గట్టిపరిచి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో భాగంగా మొత్తం 383 ప్యానెల్స్‌తో లక్ష క్యూబిక్ మీటర్లకు పైగా ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగించనున్నారు. కనిష్ఠంగా 20 మీటర్లు, గరిష్ఠంగా 94 మీటర్ల లోతు నుంచి నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం 3 ట్రెంచ్ కట్టర్లు, 3 భారీ గ్రాబర్లు, 3 డిశాండింగ్ యూనిట్లు వంటి భారీ యంత్రాలను జర్మనీ నుంచి తెప్పించారు. 1.396 కిలోమీటర్ల పొడవైన డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందించారు. 1.5 మీటర్ల మందంతో నది ప్రవాహ మార్గంలో భూమి లోపల దీని నిర్మాణం చేపట్టనున్నారు. సగం నిర్మాణం పూర్తి కాగానే సమాంతరంగా దాని పైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ షెడ్యూల్ జారీ చేసింది. కొత్త డయాఫ్రం వాల్ కోసం రూ.990 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనుంది. నిర్దేశించిన లక్ష్యానికి ముందుగానే దీని నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. డయాఫ్రంవాల్‌పైనే ప్రాజెక్ట్‌లో అత్యంత కీలకమైన ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాం నిర్మించనున్నారు. దాదాపు 2 కిలోమీటర్ల పొడవైన ఇసిఆర్‌ఎఫ్ డ్యాం పూర్తయితే గోదావరి నీటిని రిజర్వాయర్‌లో ఒడిసిపట్టేందుకు వీలవుతుంది. మొత్తం ప్రాజెక్టు పూర్తయితే 194 టిఎంసిల మేర నీటిని నిల్వ చేయవచ్చు. గతంలో తెలుగుదేశం హయాంలోనే డయాఫ్రంవాల్ నిర్మించినా వైఎస్సార్సీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 2020 గోదావరి వరదలకు డయాఫ్రమ్ వాల్ మూడు చోట్ల దెబ్బతింది. ఇసుక కోతకు గురై అగాధాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వాటిని పూడ్చి, ఇసుకను వైబ్రో కాంపక్షన్ విధానంలో గట్టిపరిచి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపడుతున్నారు.కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో భాగంగా మొత్తం 383 ప్యానెల్స్‌తో లక్ష క్యూబిక్ మీటర్లకు పైగా ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగించనున్నారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి 998 కోట్ల రూపాయల వ్యయం కానుంది. ప్రస్తుతం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు డయాఫ్రమ్ వాల్ సగం నిర్మాణం పూర్తయ్యాక సమాంతరంగా ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం పనులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదిన్నరలోగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలు ఖరారు చేసింది.

# ఎపికి పూర్తి సాయం

>> ఈ సందర్భంగానే సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించేందుకు ముందస్తు కార్యచరణ ప్రారంభమైనట్లు సిఎం చంద్రబాబు అమిత్‌షాకు వివరించారు. అమరావతి నిర్మాణానికి ప్రపంచబ్యాంకు,ఆసియా అభివృద్ధి బ్యాంకుల ద్వారా భారీగా రుణాల మంజూరుకు కేంద్రం అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. పోలవరం కోసం ప్రత్యేక నిధుల కేటాయించడమేకాకుండా,నేటి నుంచి నూతన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ. 11 వేల 440 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం తమకు అధికారికంగా ఈ ప్యాకేజీని ప్రకటించడం పట్లచంద్రబాబు,పవన్ కళ్యాణ్‌లు అమిత్‌షాకు ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్ని అనుసంధానించేందుకు కొత్త జాతీయ రహదారులు, రైలు మార్గాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు పనులను ముమ్మరం చేసి,వెంటనే పూర్తి చేయాలని, పారిశ్రామిక కారిడార్ల వేగవంతంగా ఏర్పాటు చేసేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. దక్షిణాదిలో తలసరి ఆదాయం ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యల్పమనే విషయాన్ని గమనంలోకి తీసుకొని రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి కల్పనకు అనువైన పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందించాలని సిఎం విన్నవించారు. విజన్ 2047లో పేదరిక నిర్మూలన కీలకంగా తీసుకున్న పలు నిర్ణయాలను సిఎం చంద్రబాబు కేంద్రమంత్రి అమిత్‌షాకు వివరించారు.గత ఐదేళ్లలో విపరీతంగా పెరిగిన అప్పుల భారంతో రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు వేయి దాటిన విషయాన్ని వివరించానని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గ్రామీణాభివృద్ధి కేంద్ర సహకారాన్ని పవన్ కళ్యాణ్ అమిత్‌షాను కోరారు.ఎన్డీఏ ప్రభుత్వ పక్షాలన్ని నిర్మాణాత్మక వైఖరిలో ముందుకు అడుగులు వేయాలని అమిత్‌షా సిఎం, డిప్యూటీ సిఎంలకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సమగ్ర ప్రణాళిక రూపొందించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను తిరిగి పట్టాలెక్కిస్తామని సిఎం పేర్కొన్నారు. అంతకు ముందు చంద్రబాబు నివాసంలో జరిగిన విందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. అంతకు తెలుగుదేశం పార్టీ నుంచి మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, సత్య కుమార్, కూటమి నేతలు అమిత్‌షాకు విజయవాడ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. చంద్రబాబు నివాసంలో అమిత్ షాకు విందు ఏర్పాటు చేశారు. అమిత్‌షా ఆదివారం గన్నవరంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ వేడుకల్లో పాల్గొనున్నారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం గన్నవరం నుంచి ఢిల్లీ వెళ్లనున్నారు.

**విమానాశ్రయంలో ఘనస్వాగతం**

రెండురోజుల పర్యటన నిమిత్తం అమరావతికి వచ్చిన కేంద్రహోంశాఖామంత్రి అమిత్‌షాకు గన్నవరం విమానాశ్రయంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అమిత్‌షా న్యూఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో శనివారం సాయంత్రం గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్రమంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్, అచ్చెంనాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారధి, ప్రభుత్వ విప్‌లు యార్లగడ్డ వెంకట్రావ్, తంగిరాల సౌమ్య, పంచుమర్తి అనురాధ, యంపిలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్, సియం.రమేష్, బిజెపి రాష్ట్రఅధ్యక్షులు దగ్గుపాటి పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, శ్రీరాం తాతయ్య, బోడె ప్రసాద్, సుజనాచౌదరి, నక్కా ఆనందబాబు, బిజెపి నాయకులు చిగురుపాటి కుమారస్వామి, జిల్లాకలెక్టర్ డికె.బాలాజీ, ఎస్పీ గంగాధర్, తదితరులు విమనాశ్రయంలో హోంమంత్రికి పుష్పగుచ్చాలు అందించి ఘనస్వాగతం పలికారు.

# స్వచ్ఛాంధ్రకు అంకితం కావాలి

>> వివరాలు, సంపద సృష్టి కేంద్రాల సహకారంతో పండించిన పళ్లు, కూరగాయల ప్రదర్శనను తిలకించారు రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పొన్నూరు శాసన సభ్యులు దూళిపాళ్ల నరేంద్ర పాలుపంచుకున్నారు.ఇక ఇటీవల విజయవాడ వరదల్లో అహర్నిశలు పని చేసి పారిశుద్ధ్య మెరుగుదలకు కృషి చేసిన 35 మంది స్వచ్ఛ కార్మికులను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సత్కరించారు. ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పలుకరిస్తూ, శాలువా కప్పి నూతన వస్త్రాలు, పళ్లు బహూకరించారు. గ్రామ స్థాయిలో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన వాహనాలను పవన్ కళ్యాణ్ ప్రారంభించి స్వయంగా నడిపారు.




శనివారం కడపజిల్లాలో చేపట్టిన స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

# ప్రతిష్టాత్మకంగా 'స్వచ్ఛాంధ్ర'

>> అగ్రికల్చర్ హబ్‌గా మారుస్తామన్నారు. మైక్రో ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇస్తే, దాన్ని గత ప్రభుత్వం తీసేసిందని, మళ్లీ ఆ సబ్సిడీ డ్రిప్‌కు 90 శాతం సబ్సిడీ ఇస్తామని భరోసా ఇచ్చారు. సీమలో ఫ్యాక్షనిజాన్ని తమ ప్రభుత్వ హయాంలోనే రూపుమాపినట్లు పునరుద్ఘాటించారు. ప్రపంచంలోనే సుందరమైన ప్రదేశాలలో ఒక్కటైన గండికోట టూరిజాన్ని అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా రాజోలి బండ ఆనకట్టను అభివృద్ధి చేసి 90 వేల ఎకరాలకు సాగునీరందిస్తామని సిఎం హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో ఎపి అభివృద్ధి పరుగులు పెట్టనున్నట్లు తెలిపారు. పోలవరం పనులు పట్టాలెక్కించడంతోపాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజి వచ్చిందని రూ.50వేల కోట్లతో జాతీయ రహదారి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.70వేల కోట్లతో రైల్వే లైన్లు వేస్తున్నామని, ప్రస్తుతం 12.94శాతం వృద్ధిరేటు సాధించామని, దీన్ని 16 శాతానికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీఠ వేస్తున్నామని, అందులో భాగంగానే రూ.130 కోట్లతో కార్యకర్తల భీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి సవిత, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్‌యాదవ్, వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, మాధవిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ శ్రీధర్, డిఐజి కోయ ప్రవీణ్, జెసి అదితిసింగ్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## డి.సిఎం పవన్ క్యాంప్ ఆఫీస్‌పై ఎగిరిన
# గుర్తు తెలియని డ్రోన్
## తీవ్ర ఆందోళనలో జెఎస్పీ కార్యకర్తలు, డిజిపికి ఫిర్యాదు

**విజయవాడ.జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంపై గుర్తుతెలియని డ్రోన్ ఎగరడం తీవ్ర కలకలం రేపుతోంది. శనివారం మధ్యాహ్నం 1:30 నుంచి 1:50 గంటల వరకూ దాదాపు 20 నిమిషాలపాటు డ్రోన్ ఎగిరినట్లు జనసేన నేతలు గుర్తించారు. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందికి పార్టీ నేతలు తెలియజేశారు. దీంతో భద్రతా పరమైన కారణాల దృష్ట్యా డిజిపి కార్యాలయానికి డిప్యూటీ సిఎం కార్యాలయ సిబ్బంది సమాచారం అందించారు. అలాగే గుంటూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సైతం విషయాన్ని తెలియజేశారు నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయం భవనంపై డ్రోన్ ఎగరడం పలు అనుమానాలను తావిస్తోంది. ఇటీవల అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పర్యటనకు పవన్ కల్యాణ్ వెళ్లగా అక్కడ నకిలీ ఐపిఎస్ హడావుడి చేశారు. అనంతరం అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు విజయవాడలో ఇటీవల ప్రారంభమైన బుక్ ఫెస్టివల్‌లో స్టాల్స్‌ను పవన్ పరిశీలిస్తుండగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. తాజాగా జనసేన కార్యాలయంపై గుర్తుతెలియని డ్రోన్ ఎగిరింది. ఇలాంటి వరస ఘటనలతో జనసేన శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ అభిమాన నేతపై ఎవరైనా కుట్రలు పన్నుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు ఆత్మహత్య

**పలమనేరు,జనవరి 18,ప్రభాతవార్త:** పాఠశాల ఆవరణలో ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు జిల్లా, పలమనేరు పట్టణంలో శనివారం చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు...పట్టణానికి చెందిన శ్రీనివాస శర్మ(50) స్థానిక గండికోట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.పాఠశాలలు సెలవు రోజులు కావడంతో పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం ఆయన ఓ స్థంబానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.డిఎస్పీ దేగల ప్రభాకర్,సిఐ నరసింహరాజు,ఎస్ఐ స్వర్ణతేజా సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను ధర్యాప్తు చేస్తున్నారు.

# నేడు దావోస్ పర్యటనకు సిఎం

కల్పన టాస్క్ ఫోర్స్‌కు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో పెట్టు బడుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల పోటీని తట్టుకుని నిలబడేందుకు ప్రభుత్వం దాదాపు 15కు పైగా కొత్త పాలసీలను ప్రకటించింది. జాబ్‌ఫస్ట్ విధానంతో తెచ్చిన ఈ కొత్త పాలసీలతో పెట్టుబడుదారులను ఆకర్షిస్తోంది. ఇండస్ట్రియల్ డవల్మెంట్ పాలసీ, ఎంఎస్‌ఎంఇ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎలక్ట్రానిక్ పాలసీ, ప్రైవేటు పార్క్ పాలసీ, క్లీన్ ఎనర్జీ పాలసీ, సెమికండ్టర్ పాలసీ, డ్రోన్ పాలసీ, డాటా సెంటర్ పాలసీ,స్పోర్ట్స్ పాలసీలు, టూరిజంకు పరిశ్రమ హోదా వంటి నిర్ణయాల ద్వారా పెట్టుబడుల కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ అంశాలను దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ప్రముఖంగా ప్రస్తావించి పెట్టుబ బడులకోసం నెట్వర్క్ చేయాలనేది ముఖ్యమంత్రి ఆలోచనగా ఉంది. రాష్ట్రంలో ఉన్న మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ రాయితీలు, సమర్థవంతమైన నాయకత్వం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను వివరించడం ద్వారా జాతీయ అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించేందుకు సిఎం దావోస్ పర్యటనను వేదికగా చేసుకోబోతున్నారు.

**నేటి రాత్రి ఢిల్లీ నుంచి జ్యూరిచ్‌కు సిఎం బృందం**

కొత్త పాలసీలు, రాష్ట్ర అనుకూలతలు వివరించి పెట్టుబడిదారులకు ఆహ్వానించే క్రమంలో ఆదివారం సాయంత్రం అమరావతి నుంచి దావోస్ ప్రర్యటనకు వెళ్లనున్నారు. సాయంత్రం 4 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి బయలు దేరి ముందుగా ఢిల్లీ చేరుకుంటారు. డిల్లీ నుంచి అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో తన బృందంతో జ్యూరిచ్‌కు చేరుకుంటారు. ముందుగా జ్యూరిచ్‌లో ఉన్న ఇండియన్ అంబాసిడర్‌తో భేటీ అవుతారు. అనంతరం హిల్టన్ హోటల్ లో 10 మంది పారిశ్రామిక వేత్తలతో సమావేశం అవుతారు. తరువాత అక్కడి నుంచి హోటల్ హయత్‌లో తెలుగు పారిశ్రామిక వేత్తలతో సమావేశంలో పాల్గొంటారు. మీట్ అండ్ గ్రీట్ విత్ తెలుగు డయాస్పోరా పేరుతో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులపై వారితో చర్చిస్తారు. ఎపిని ప్రమోట్ చేయడం, పెట్టుబడులకు వారిని ఆహ్వానించడంపై సమావేశంలో చర్చిస్తారు. అక్కడ నుంచి 4 గంటల పాటు రోడ్డు మార్గంలో ప్రయాణించి దావోస్ చేరుకుంటారు. తొలి రోజు రాత్రి పలువురు పారిశ్రామిక వేత్తలతో డిన్నర్ మీటింగ్‌లో సిఎం పాల్గొంటారు. తరువాత అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్‌తో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు. తొలి రోజు సమావేశాలు ముగించుకుని హోటల్ కు చేరుకుంటారు. రెండవ రోజు సిఐఐ సెషన్ లో గ్రీన్ హైడ్రోజన్ అంశంపై చర్చలో పాల్గొంటారు. తరువాత సోలార్ ఇంపల్స్, కోకకోలా, వెల్ స్పన్, ఎల్ జి, కార్ల్స బర్గ్, సిస్కో, వాల్ మార్ట్ ఇంటర్ నేషనల్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ వంటి సంస్థల సీఈవోలతో, చైర్మన్‌లతో రెండో రోజు ముఖ్యమంత్రి సమావేశంఅవుతారు. యుఎఈ ఎకానిమీ మినిస్టర్ అబ్దుల్లా బిన్‌తో సిఎం సమావేశం అవుతారు. అనంతరం వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహిస్తున్న ఎనర్జీ ట్రాన్సిషన్ : వేర్ పబ్లిక్ పాలసీ మీట్స్ ప్రైవేట్ గోల్స్ అనే అంశంపై జరిగే చర్చలో పాల్గొంటారు. అనంతరం ది నెక్స్ట్ వేవ్ ఫైనీరింగ్ ది బ్లూ ఎకానమీ ఆఫ్ టుమోరో అనే చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు. రెండో రోజు ఈ భేటీలతో పాటు వివిధ జాతీయ అంతర్జాతీయ మీడియా సంస్థలు నిర్వహించే చర్చా కార్యక్రమాల్లో సిఎం పాల్గొంటారు. బ్లూమ్ బర్గ్ వంటి మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇవ్వడం ద్వారా ఎపి పాలసీల గురించి వివరిస్తారు. మూడవ రోజు కూడా పలు బిజనెస్ టైకూన్‌లతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రోజుకు కనీసం పదికిపైగా భేటీలు, సమావేశాల్లో చంద్రబాబు పాల్గొనబోతున్నారు. నాలుగవ రోజు ఉదయం దావోస్ నుంచి జ్యూరిచ్‌కు చేరుకుని అక్కడి నుంచి స్వదేశానికి రానున్నారు. షెడ్యూల్ మీటింగ్స్‌తో పాటు...నాలుగు రోజుల సమయంలో పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో ప్రత్యేక సమావేశాల్లో ముఖ్యమంత్రి బృందం పాల్గొంటుంది. సిఎం బృందంలో పరిశ్రమల శాఖా మంత్రి టిజి భరత్, ఐటి మంత్రి నారా లోకేష్‌తో పాటు ఇండస్ట్రీశాఖ అధికారులు, ఇడిబి అధికారులు ఉన్నారు. 4 రోజుల దావోస్ పర్యటనలో బ్రాండ్ ఎపి ప్రమోషన్‌తో పెద్దఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేసేందుకు సిఎం ఆలోచనలు చేస్తున్నారు. దెబ్బతిన్న బ్రాండ్ పునరుద్దరణతో మళ్లీరాష్ట్రానికి దేశ, విదేశీ పెట్టుబడులు తెచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్రం ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. దీనికి ఈ పర్యటన దోహదం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# విచారణ

>> వారం తిరుమలకు వస్తున్నారు. ఆయన స్వయంగా ఇక్కడ పరిశీలన చేసి వివరాలు తెలుసుకోనున్నారు. కాగా ఈ ఘటనలో ఇప్పటికే టిటిడి జెఇఒ గౌతమి, సివిఎస్ఒ శ్రీదర్‌తోబాటు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి టౌన్ డిఎస్పీ వెంకటనారాయణను బదిలీ చేశారు. మరో ఇద్దరు అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. మరీ కేంద్రహోంశాఖ విచారణ తరువాత ఇంకెవరిపై చర్యలు ఉంటాయో అందరిలో ఉత్కంఠగా మారింది.



శనివారం సూళ్లేరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

# అట్టహాసంగా ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం
## మంత్రి దుర్గేష్ చేతులు మీదుగా ఎగ్జిబిషన్ స్టాల్ ఆవిష్కరణ

**సూళ్లూరుపేట, జనవరి 18 ప్రభాతవార్త:** సూళ్లూరుపేట కేంద్రంగా నేలపట్టు, పులికాట్ పక్షుల కేంద్రాల విశిష్టతను చాటుతూ ఫ్లెమింగో ఫెస్టివల్ 2025ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతులు మీదుగా శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని హోలీక్రాస్ జంక్షన్ నుంచి జూనియర్ కాలేజి మైదానం వరకు ఫ్లెమింగో ఫెస్టివల్ శోభాయాత్రను నిర్వహించారు. కళారూపాల విన్యాసాలు, డప్పు నృత్యాలు, కేరళ వాయిద్యాలు, టాల్‌మెన్ షో వంటి వినూత్న కార్యక్రమాలకు ఆద్యంతం శోభాయాత్ర కొనసాగింది. అనంతరం స్థానిక కళాశాల మైదానంలోని ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వేదిక కానున్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను మంత్రి ప్రారంభించారు. ఫ్లెమింగో ఫెస్టివల్ బెలూన్ ఎగురవేసి పండుగకు శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన పశు సంవర్ధకశాఖ, ఉద్యానవన, డిఆర్‌డిఎ, ఆఫ్కో, శ్రీసిటీ, షార్, వన్యప్రాణి విభాగం, ఐసిడిఎస్ ప్రాజెక్టు, వ్యవసాయ శాఖ ప్రదర్శన స్టాల్స్‌ను మంత్రిసందర్శించి వాటిని ఆవిష్కరించారు. అనంతరం అడ్వెంచర్ ఆక్టివిటీస్‌లో భాగంగా నిర్వహించిన డ్రోన్ వినియోగం, దాని విన్యాసాలను మంత్రి ప్రారంభించారు. స్టాల్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన మంత్రి దుర్గేష్ కొత్తదనంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలను చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. అనతికాలంలోనే సమయం తక్కువగా ఉన్నప్పటికీ ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన తిరుపతి జిల్లా యంత్రాంగానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఇతర నేతలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్, టూరిజం ఆర్‌డి రమణప్రసాద్, డిఎఫ్ఓ హారిక, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీమంత్రి పరసా రత్నం, ఆర్డీఓ కిరణ్మయి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# దాత తీరుపై టిటిడి స్పందన
## రంగనాయకుల మండపంలో నమూనా విగ్రహాలకు పూజలు చేయడం సరికాదు

**తిరుమల,జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠద్వార దర్శనాల సందర్భంగా ఆలయంలో పుష్పాలంకరణ, నమూనా విగ్రహాలుకు పూజలు చేయడం దాత చేపట్టవచ్చని, ఆలయ నిబంధనల ప్రకారం ఆలయం వెలుపల నమూనావిగ్రహాలను ఉంచుకోవచ్చని టిటిడి ఆలయ అర్చకవర్గాలు తెలిపాయి. అయితే ఆలయంలో పుష్పాలంకరణ మరుగన నమూనా విగ్రహాలను దాత కుటుంబం రంగనాయకుల మండపంలో ఉంచి పూజలు చేసేందుకు ప్రయత్నించడం, ఆది ఆగమశాస్త్ర విరుద్ధమని వాటిని బయటకు పంపడం జరిగిందని టిటిడిపేర్కొంది. దాతలకు అన్నివిధాలా సహకారం ఉంటుందని, దాతకూడా తప్పిదం జరిగిందని వివరణ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

# వెంకన్న సాక్షిగా.. పుష్ప 'విలాపం'!



సిబ్బందితో వాగ్వాదానికి దిగిన భక్తుడు

>> టిటిడికి అందజేశారు. వైకుంఠద్వారదర్శనంలో ఏడవరోజు శుక్రవారం ఉదయం ఏడుకొండల వెంకన్న ఆలయం ముందు, ఆలయంలోపల మహాద్వారం, ధ్వజస్తంభం ప్రాంతాల్లో పుష్పాలతో అద్భుతంగా అలంకరించారు. అయితే ఈ అలంకరణలను దాతలకు తెలియకుండానే టిటిడి ఆలయ సిబ్బంది, ఉద్యానవన విభాగం సిబ్బంది శనివారం ఉదయం ఉన్నపళంగా తీసేసి చెత్తట్రాక్టర్‌లో పడేశారు. ఈ విషయాన్ని దాత బెంగుళూరుకు చెందిన సునీతగౌడ్ తెలుసుకుని కుటుంబంతో కలసి ఆలయం ముందుకు వచ్చారు. అక్కడ తాము ఎంతో భక్తివిశ్వాసాలతో దేవునికి సమర్పించుకున్న విదేశీ పుష్పాలు,విగ్రహాలను తీసేయడంతో ఆవేదన చెందారు. అంతేగాక తమకు తెలియకుండా ఇలా చేయడం మంచిదికాదని ఆలయం ముందే కన్నీటిపర్యంతమయ్యారు. తమ కష్టాలు తీర్చి అన్నీ శుభాలు కలుగుతాయని, తమ ఇష్టదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో తాము స్వచ్ఛంద విరాళంగా ఇచ్చిన పుష్పాలను, విగ్రహాలను ఇలా చెత్తలో పడేయడం ఎంతవరకు సమంజసమని అసహనం చెందారు. అప్పటికే ఆలయం ముందు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న తిరుమల 1టౌన్ సిఐ విజయకుమార్, ఏఎస్ఐ మోహన్‌నాయుడు, సిబ్బంది, టిటిడి ఉద్యానవనవిభాగం డిప్యూటీడైరెక్టర్ శ్రీనివాసులు అక్కడకు చేరుకున్నారు. దాతలతో మాట్లాడి సర్దిచెప్పారు. అయినా దాతలు మనసు అంగీకరించకపోవడంతో కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు పోలీసులు దాతలను ఆలయం ముందు నుండి పక్కకు తీసుకెళ్లడంతో పరిస్థితి సద్దుమణిగింది.అయితే ఆలయంలోపల ఏర్పాటుచేసిన విగ్రహాలను ఆలయం ముందు గొల్లమండపం సమీపంలో దాతలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ విషయం కూడా వివాదాస్పదంగా మారింది. అయితే దాతలు ఎంతో భక్తితో, విశ్వాసంతో స్వామివారికి అలంకరణలకు ఇచ్చే పుష్పాలు, విగ్రహాలను ఇలా చేయడం టిటిడి అధికారుల నిర్లక్ష్యం, వింతవైఖరిని తెలియజేస్తుంది. దాతలను సగౌరవంగా ఆహ్వానించి ఇలా చేయడం పట్ల మాత్రం భక్తుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. మరీ దీనిపై టిటిడి అధికారులు రాత్రి 8గంటల వరకు స్పందించకపోగా మీడియాప్రతినిధులు సంప్రదించినా తగిన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. సాధారణంగా రెండురోజుల వైకుంఠద్వారాలు తెరచి వుంచే రోజుల్లో దాతలు మైసూరు, బెంగుళూరు,కోయంబత్తూరు, చెన్నై ,తెలుగురాష్ట్రాలకు చెందిన వాళ్లు పుష్పాలు, ప్రత్యేక విగ్రహాలను ఇలా అందజేస్తారు. ప్రస్తుతం పదిరోజుల వైకుంఠద్వారాలు తెరచి భక్తులకు దర్శనం చేయిస్తుండటంతో తొలిరోజు, నాల్గవరోజు, ఏడవరోజు ,ఎనిమిదవరోజు ఇలా వరుసగా పుష్పాలంకరణలు దాతల సహకారంతోనే ఎప్పటికప్పుడు మార్పుచేస్తుంటారు. ఈ ఏడాది ఈ ఏడవరోజు ఆలంకరణలో దాతలకు తీవ్ర నిరాశ,ఆగ్రహం కలిగించారు.

## వారం - వర్జ్యం

తేది : 19-01-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
పంచమి ఉ.7.31
ఉత్తర సా.5.29
వర్జ్యం : రా.2.56-4.44
దు.సా.4.29-5.14
శుభసమయం: ఉ.7.00-8.00
మ.6.15-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** మీ శత్రువర్గం మీపై చేయు దుష్ప్రచారాలను సమర్థవంతంగా త్రిప్పికొట్టగలుగుతారు.

**వృషభం:** బదిలీ యత్నాలను ముమ్మరం చేస్తారు. మీలోని ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి.

**మిథునం:** ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. కుటుంబసమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

**కర్కాటకం :** గృహ నిర్మాణాలోచనలు కలిసి వస్తాయి. ఆకస్మిక ప్రయాణాలు చేసి తద్వారా లాభపడతారు.

**సింహం:** విద్యార్థినీ, విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. వాహనయోగం పొందుతారు.

**కన్య :** ఇన్నాళ్లుగా మీ మనస్సులో దాగివున్న భయము, భ్రాంతి నిష్కారణమైనవేనని తేలిపోతుంది.

**తుల :** మనస్సు తేలిక పడుతుంది. మీ అలవాట్లలో మార్పులను సూచిస్తోంది. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**వృశ్చికం:** అడిగిన వారికి కాదనకుండా మీ పరిధులను అనుసరించి తగు సహాయ సహకారాలను అందిస్తారు.

**ధనుస్సు:** ప్రజా సంబంధాలు అధికంగా కలిగిన వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది.

**మకరం:** సాఫ్ట్‌వేర్ రంగంలోని వారికి నూతన అవకాశాలు కలిసి వస్తాయి. కీలక నిర్ణయాలు తీసుకొంటారు.

**కుంభం:**సంతాన విద్యా విషయంలో ప్రత్యేకశ్రద్ధను కనబరుస్తారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**మీనం :** మదుపు చేసిన ధనాన్ని కొత్తపెట్టుబడులకు గాను పెట్టుబడిగా పెట్టే అవకాశాలున్నాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

19-1Pg3exHMNWJQE.qxd:19-1Pg3exHMNWJQE.qxd 01/01/01 7:35 AM Page 1



## సిఎం చంద్రబాబు నేతృత్వంలోనే రాష్ట్రంలో అభివృద్ధి

### - మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే ఏపీ అభివృద్ధి చెందుతుందని తాము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీకి రూ.11, 440కోట్లు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నిర్మలా సీతారామన్, కుమారస్వామిలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది కూటమి ప్రభుత్వం సాధించిన ఘనత అని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని చెప్పారు. అమృతరావు, తెన్నేటి విశ్వనాథం కృషి, వేలాదిమంది తెలుగువారి పోరాటం ఫలితంగా 32మంది ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో విశాఖలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరిగిందని గుర్తుచేశారు. ఆనాడు 64 గ్రామాల ప్రజలు స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి సహకారం అందించిన చరిత్ర ఉందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అప్పుల ఊబిలో కూరుకుపోవడం, క్యాపిటల్ మైన్స్ లేని పరిస్థితి ఉందన్నారు. అక్కడ పని చేసే ఉద్యోగులు, కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి వచ్చిందని చెప్పారు. ఒక నెల 30శాతం, మరో నెల 60శాతం మాత్రమే జీతాలు ఇచ్చారని గుర్తుచేశారు. కార్మిక సంఘాల ప్రతినిధులను కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కుమారస్వామి వద్దకు సీఎం చంద్రబాబు నాయుడు తీసుకెళ్లి పరిస్థితిని వివరించారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు.. ఆర్థిక సాయం అందజేసే ఆలోచన ఉన్నట్లు తమకు కేంద్ర మంత్రి కుమార స్వామి చాలా సందర్భాల్లో ధైర్యం చెప్పారని అన్నారు. ఎంతోమంది కృషి ఫలించి నేడు కేంద్ర ప్రభుత్వం రూ.11,440కోట్లు ఆర్థిక ప్యాకేజీ అందించడం ఆనందంగా ఉందని అన్నారు. గతంలో ఆనాటి ప్రధాని వాజ్ పేయ్ హయాంలో కూడా ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్యాకేజీ ప్రకటించి స్టీల్ ప్లాంట్‌ను ఆదుకున్నారని చెప్పారు. ఇప్పుడు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ విషయంలో మరోసారి రుజువైందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.



**కడప ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరు పట్టణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు ఇతర మంత్రులతో కలిసి కార్యక్రమాన్ని జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ....

## స్వచ్ఛాంధ్రలో అంతా భాగస్వాములు కావాలి: సిఎం చంద్రబాబు

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లా, మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, బహిరంగ ప్రదేశాలు, చెరువులు, కాలువలు, కుంటలు తదితర ప్రదేశాలలో చెత్తాచెదారాలను తొలగించే విధంగా నేడు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడమైనది. పరిశుభ్రత ప్రతి ఒక్కరికి అత్యంత ముఖ్యంమని ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో పరిశుభ్రతను పాటించే విధంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మన సంస్కృతిలో కూడా పరిశుభ్రతకు అత్యంత ప్రాముఖ్యత ఉందని ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన తరం, మన పిల్లలకు అలాగే భావితరాలకు కూడా పరిశుభ్రతకు అంతే ప్రాముఖ్యత ఇచ్చేలా మనందరిలో ఒక చైతన్యం రావాలన్నారు. మన గ్రామంలోని చెత్తను, మురికి కాలువలను, పరిసరాలను ప్రజల భాగస్వామ్యంతో అటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ సమిష్టిగా పరిశుభ్రతలో భాగస్తులు కావాలన్నారు.

రాబోయే రోజులలో ఆంధ్రప్రదేశ్ ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి నుండి, జిల్లా స్థాయి వరకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా పనిచేయాలన్నారు.

## చరిత్ర మరువలేని మహానేత ఎన్టీఆర్

### - టిడిపి కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్‌కు ఘన నివాళి అర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్త ప్రతినిధి:** చరిత్ర మరువలేని మహానేత దివంగత నందమూరి తారక రామారావు అని,ఆయన పేద ప్రజల పెన్నిదని పలువురు రాష్ట్ర మంత్రులు,ప్రజాప్రతినిధులు,టీడీపీ నాయకులు అన్నారు.తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత , మంత్రులు అచ్చెన్నాయుడు , పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. బ్లడ్ డొనేషన్ క్యాంపును మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ సామాన్య కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగారన్నారు. ఎన్టీఆర్ సినీ రాజకీయ రంగంలో మకుటం లేని మహారాజుల ఎదిగారని తెలిపారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో ఎన్టీఆర్ అధికారంలోకి తీసుకు రాగలిగారని.. బీసీలకు రాజకీయ అవకాశం కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. దేశంలో సంక్షేమం అనే పదం పుట్టింది ఎన్టీఆర్ నోటి నుంచే అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పటేల్ పట్వారి వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించింది ఎన్టీఆర్ అని తెలిపారు. ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఒక ప్రాంతీయ పార్టీకి అధ్యక్షుడైన ఎన్టీఆర్ ఆనాడు దేశంలో ఉన్న పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చారని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను పునికి పుచ్చుకొని చంద్రబాబు పార్టీని నడిపిస్తున్నారన్నారు. నాకు ప్రాణం తెలుగుదేశం పార్టీ. నా జీవితం తెలుగుదేశం పార్టీకి చంద్రబాబుకి అంకితం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సినిమా రంగంలో రాముడైనా.. రావణాసురుడైనా ఎన్టీఆర్ అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మహిళలు అన్నగా పిలిచిన... ఆరాధ్య దైవంగా పిలిచిన అన్న ఎన్టీఆర్ అని తెలిపారు. సినిమా రంగంలో నటన ఎన్టీఆర్‌కు తెలుసుగాని... రాజకీయరంగంలో నటన అనేదే ఎన్టీఆర్‌కు తెలియదన్నారు. కోటి దాటినా పార్టీ సభ్యత్వ నమోదుతో తాత ఎన్టీఆర్‌కు లోకేష్ నిజమైన నివాళులర్పించారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ పేరు ఎత్తకుండా ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాధించలేదన్నారు. ఎన్టీఆర్ పెట్టిన పార్టీకి ఒడిదుడుకులు ఎదురవుతున్న చంద్రబాబు నడిపిస్తూనే వస్తున్నారన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం చంద్రబాబు, లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారని హోంమంత్రి అనిత వెల్లడించారు. ఇక ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి మంత్రి నిమ్మల రామానాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధుల భేటీ

**విజయవాడ.జనవరి18,ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యావరణహిత రీత్యా ఎలక్ట్రిక్ వాహనాలు విరివిగా అందుబాటులోకి రావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ ఏర్పాటు పర్యావరణహితమైన వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సంస్థ ఓర్వకల్లు దగ్గర 12వందల ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ నెలకొల్పేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంతో ఎం.ఓ.యూ. చేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలను పీపుల్ టెక్ గ్రూప్ సి.ఈ.ఓ. టి.జి.విశ్వప్రసాద్ తెలియచేశారు. వాహన తయారీ, ఆర్. అండ్ డి. కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్స్, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ప్రాంతాలాంటివి ఇందులో ఉంటాయి. దేశంలో ఇదే తొలి ప్రైవేట్ ఈ.వి. పార్క్. దీని ద్వారా రూ. 13 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయనీ, 25 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనీ వివరించారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ కర్నూలు జిల్లా ఓర్వకల్లు దగ్గర ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ ఏర్పాటు కానుండటం ఆహ్వానించదగ్గ పరిణామం. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇదొక మైలు రాయి అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకి అనువైన విధానాలు తీసుకొచ్చింది అన్నారు. సమావేశమైన వారిలో భాస్కర రెడ్డి, రవికిరణ్ ఆకెళ్ళ, బాబ్ డఫ్ఫీ, స్టీవ్ గెర్బర్, హెరాల్డ్ రక్రిజెల్ ఉన్నారు.



## విధుల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించండి

**- భక్తులకు నిషేధిత వస్తువుల రవాణాపై అవగాహన కల్పించండి**

**- అలిపిరి తనిఖీకేంద్రంలో ఇన్‌ఛార్జి సివిఎస్ఒ చందోలు**

**తిరుమల,జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం నలుమూలల నుండి ప్రతిరోజూ పలు రకాల మనస్తత్వాలు కలిగిన భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తుంటారని, ప్రధాన ప్రవేశ ద్వారం అలిపిరి తనిఖీ కేంద్రంలో సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని టిటిడి ఇన్ ఛార్జి సివిఎస్ఒ వివిఎస్ మణికంఠ చందోలు సూచించారు. భక్తులకు నిషేధిత వస్తువులు తీసుకురాకుండా అవగాహన కల్పించాలని, వారిలో చైతన్యం కలిగించాలన్నారు. నిషేధిత వస్తువులు తనిఖీ చేసే సమయంలో భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా వ్యవహరించాలని సుతిమెత్తగా హెచ్చరించారు. తిరుమలకొండపై శనివారం మధ్యాహ్నం కోడిగ్రుడ్లుకూర, ఫలావ్‌అన్నం భక్తులు తీసుకెళ్ళడంతో అలిపిరి తనిఖీ కేంద్రంలో భద్రత, సిబ్బంది పనితీరుపై ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలిపిరిలో దాదాపు అర్ధగంటపైగా ఉండి తనిఖీ కేంద్రంలో భక్తులను ఎలా పరీక్షిస్తున్నారు, వాహనాలను ఎలా తనిఖీ చేసి పంపుతున్నారనే విషయాలను గమనిచారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి, పనితీరుపై కొన్ని సూచనలు చేశారు. సిసి కెమెరాల పనితీరును ఆయన స్వయంగా పరిశీలించారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో భక్తులను మరింత నిశితంగా తనిఖీ చేయాలని, భక్తుల వాహనాలను, అనుమానాస్పద కార్యకలాపాలను, వస్తువులను పసిగట్టి బయటకు తీయాలన్నారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, భక్తుల రద్దీ సమయంలో ఎటు వంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆయన విజిలెన్స్, ఎస్‌పిఎఫ్, టిటిడి సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేశారు.

## తమిళభక్తుల మహాపచారం !

### - కోడిగుడ్లు, పలావ్ పాత్రతో తిరుమలకు

### - అలిపిరిలో విజిలెన్స్ సిబ్బంది తనిఖీల లోపం



**తిరుమల,జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల ఆలయ పవిత్రతకు భంగం కలిగించేలా తమిళనాడుకు చెందిన భక్తులు ఏకంగా కోడిగ్రుడ్లతో తయారుచేసిన కూర, ఫలావ్‌అన్నం ఉన్న పెద్దపాత్రతో కొండపైకి చేరుకుని భోంచేయడం మహాపచారంగా మారింది. ఈ విషయం శనివారం మధ్యాహ్నం తిరుమలలో రాంభగీచా బస్టాండ్ సమీపంలోని పార్కింగ్‌స్థలంలో చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూరుసమీపంలోని గుమ్మడిపూండికి చెందిన 28మంది భక్తబృందం శనివారం మధ్యాహ్నం ఓ వాహనంలో తిరుమలకు చేరుకున్నారు. వీళ్ళు ముందుగానే వండి తయారుచేసిన కోడిగ్రుడ్ల కూర, ఫలావ్‌అన్నం పెద్దపాత్రతో తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రం దాటుకుని తిరుమలకు వచ్చారు. కొండపై నిత్యం భక్తుల రద్దీతో కిటకిటలాడే రాంభగీచా బస్టాండు ప్రాంతంలోని పార్కింగ్ స్థలంలో అందరూ కూర్చుని భోజనం చేసే సమయంలో యాత్రికులు గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తిరుమల 2టౌన్ పోలీసులు, ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ అక్కడకు చేరుకున్నారు. ఆ నాన్‌వెజ్ భోజనాలను,పాత్రను సీజ్ చేశారు. భక్తులు ఎక్కడా ఇలాంటి భోజనం తినడం నిషేధమని తెలిసినా ఎలా వచ్చారు అని ప్రశ్నించారు. అయితే ఆ భక్తబృందం తిరుమలలో నిబంధనలు గురించి మాకు తెలియదని, తెలియక తప్పుచేశామని చింతించారు.

### తిరుమలలో అపచారాలకు విజిలెన్స్ నిఘా వైఫల్యమే : వైఎస్సార్సీనేత భూమన

**తిరుపతి,జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబునాయుడు చెప్పేమాటలకు, జరుగుతున్న విషయాలకు పొంతనలేకుండా పోయిందని, తిరుమలలో ఏకంగా నిషేధిత పదార్థాలతో, మాంసాహారంతో భక్తులు రావడం విజిలెన్స్ పూర్తిగా నిఘా వైఫల్యమేనని టిటిడి మాజీ ఛైర్మన్,వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. గత ఏడునెలల కాలంలో తిరుమలలో ఎర్రచందనం స్మగ్లర్లు విజృంభించారని, దుంగలను పట్టుకోవడం, దొంగలను అరెస్టుచేయడం నామమాత్రంగామారిందని దుయ్యబట్టారు. తిరుమలలో మాంసాహారం, మద్యం పట్టుబడుతుండటం దేనికి సంకేతమనిప్రశ్నించారు. శనివారం రోజు తమిళనాడు భక్తులు మాంసాహార భోజనంతో తిరుమలకు రావడం విజిలెన్స్ వైఫల్యమేనని మండిపడ్డారు. టిడిపి నాయకుల సేవలో ఛైర్మన్ తరిస్తున్నారని, భక్తులను పట్టించుకోవడంలేదని విమర్శించారు.

## కేన్సర్ బాధితులకు ఉచిత చికిత్స

### 50వేల మంది గుర్తింపు, చికిత్సలకు రూ.624 కోట్ల వ్యయం

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఏటా దాదాపు 40 వేల మందికి పైగా ప్రాణాలను బలి తీసుకుంటున్న క్యాన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. గతేడాది నవంబర్ 14 నుండి ప్రారంభమైన స్క్రీనింగ్ పది నెలల పాటు కొనసాగుతుంది. డాక్టర్ ఎన్ టిఆర్ వైద్యసేవ ద్వారా క్యాన్సర్ చికిత్సలకు 201920లో రు.217 కోట్లు ఖర్చు పెట్టగా, 202324 నాటికి అది రూ.624 కోట్లకు పెరిగిందని వైద్య ఆరోగ్యశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ వ్యాధిని కట్టడి చేసేందుకు వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 18 సంవత్సరాల పైబడిన వారికి నోటి, రొమ్ము క్యాన్సర్, 30 సంవత్సరాలు పైబడిన మహిళలకు గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ జరుగుతోంది. విస్తృత స్థాయిలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో 155 మంది స్పెషలిస్టు డాక్టర్లు, 238 జిల్లా ఆస్పత్రుల నిపుణులు, 3,944 మంది వైద్యాధికారులు, 10,032 మంది సామాజిక ఆరోగ్యాధికారు (సిహెచ్‌ఓ)లు, 3,944 మంది ఎఎన్ఎంలు, 42 వేల మందికి పైగా సామాజిక ఆరోగ్య కార్యకర్తలు భాగస్వాములయ్యారు. ముందు సామాజిక స్థాయి స్క్రీనింగ్లో భాగంగా ఆశా కార్యకర్తలు క్యాన్సర్ వ్యాధి దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తారు. ఎఎన్ఎం, సిహెచ్‌ఓలు అ సాంక్రమిక వ్యాధుల (ఎన్సిడి) సర్వేలు నిర్వ హించి మహిళలు సర్వైకల్ పరీక్షలు చేసుకునేలా ప్రోత్సహిస్తారు. ప్రాథమిక రోగ నిర్ధారణ కోసం బిపి, ఆర్ బిఎస్, హిమొగ్లోబిన్, నోటి, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారు. గ్రామీణ ఆరోగ్యకేంద్రం స్థాయిలో జరిపే స్క్రీనింగ్లో వైద్యా ధికారులు అనుమానిత కేసులను పరిశీలించ నున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను నిర్ధారించి చికిత్స అంద చేస్తారు. అనుమానిత క్యాన్సర్ కేసులను ఉన్నత స్థాయి వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తారు. రోగ నిర్ధారణ కోసం బిపి, ఆర్ బిఎస్, సర్వైకల్ క్యాన్సర్ వంటి వ్యాధుల నిర్ధారణ కోసం జుతి పరీక్షతో పాటు హెచ్ఐవి, హెచ్ సివి, హెచ్బిఎస్ఎజి వంటి వాటి కోసం వైరల్ మార్కర్ల పరీక్షలు నిర్వహించి నివారణ కోసం ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ కు రిఫర్ చేస్తారు. అంకాలజీ యూనిట్ (పిఓయు) స్థాయిలో సూపర్ స్పెషలిస్ట్ సమక్షంలో రోగ నిర్ధారణ, చికిత్స అందిస్తారు. దీనికోసం రాష్ట్రంలో 17 పిఓయులను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో బయాప్సీ, రేడియాలజీ పద్ధతుల ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కీమో థెరపీ, రేడియేషన్ శస్త్రచికిత్సల వంటి వాటిని ప్రభుత్వ, అనుబంధ ఆస్పత్రులలో ఉచితంగా అందజేస్తారు. ఇప్పటి వరకూ దాదాపు 53,07,448 మందికి పరీక్షలు నిర్వహించగా, అందులో 19,447 మంది నోటి క్యాన్సర్, 15,401 మంది రొమ్ము క్యాన్సర్, 17,373 మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనుమానితులను గుర్తించారు.

# తిరుమల సమాచారం

## నేటి అర్ధరాత్రికి మూతపడనున్న వైకుంఠద్వారాలు

### - పదిరోజులు 7.20లక్షలమందికి దర్శన అవకాశం



**తిరుమల,జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన ధనుర్మాసంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు ఆదివారం (నేటి)అర్ధరాత్రితో మూతబడ నున్నాయి. వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 10వతేదీ వేకువజామున 2గంటలకు తెరచుకున్న తిరుమల ఆలయంలోని వైకుంఠ ద్వారం నిరవధికంగా పదిరోజులపాటు తెరచిఉంచి భక్తులకు మోక్షమార్గం దర్శనం చేయిస్తున్నారు. 10వతేదీ వైకుంఠఏకాదశి,11నద్వాదశి ఘడియలతో బాటు అదనంగా ఎనిమిదిరోజులు జనవరి 19వతేదీ ఆదివారం అర్ధరాత్రి 12గంటల వరకు వైకుంఠద్వారాలు తెరచి భక్తులను అనుమతిస్తున్నారు. రోజుకు సరాసరి 65వేలమంది భక్తులకు ప్రశాంతంగా మూలవిరాట్టు ఆనందనిలయుడి దర్శనంతోబాటు వైకుంఠద్వార దర్శనాలు చేయిస్తున్నారు. గత తొమ్మిదిరోజుల వైకుంఠద్వారదర్శనాలు 6,60,547మంది భక్తులు శనివారం రాత్రివరకు దర్శనం చేసుకోగలిగారు. హుండీ ఆదాయం 27.50కోట్ల రూపాయలు వరకు చేకూరింది. నేడు ఆదివారంతో కలుపుకుని పదిరోజులపాటు సరాసరి 7.20లక్షలమంది భక్తులు స్వామివారిని వైకుంఠద్వారంలో దర్శనం చేసుకునేలా టిటిడి అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. జనవరి 10నుండి మొదలైన ఈ దర్శనాలు తొమ్మిదిరోజులు పాటు 6.60లక్షలమందికి దర్శనం చేయించారంటే మాటల్లోచెప్పలేనిది. ఆఫ్‌లైన్‌లో 4.35లక్షల టోకెన్లు,ఆన్‌లైన్‌లో ఎస్ఇడి టిక్కెట్లు 1.40లక్షలు, శ్రీవాణి బ్రేక్ 19,500, దాతలు 8వేలవరకు ,ఇకప్రోటోకాల్ ప్రముఖులు ఇలా వరుసగా 65వేలమంది వరకు దర్శనాలు చేసుకోగలుగుతున్నారు. దేశవిదేశాల నుండి భక్తులు తిరుమలకు చేరుకుని వైకుంఠద్వారంలో వెంకన్నను దర్శనం చేసుకుని ఆధ్యాత్మికతతో పులకించారు.

## స్వామివారి ఆశీస్సులతోనే అంతా మంచి జరుగుతోంది

### - తిరుమలలో ప్రముఖులు



**తిరుమల,జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతోనే రాష్ట్రానికి మంచి జరుగుతోందని, త్వరలో ప్రభుత్వం మరిన్ని మంచికార్యక్రమాలు కూడా చేపట్టనుందని ప్రముఖులు తెలిపారు. గతంలో శ్రీవారిని దర్శించుకుని రాష్ట్రం అన్ని విధాలా పురోగతి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. వైకుంఠద్వార దర్శనాల సమయంలో శనివారం రోజు తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం రాజస్థాన్ గవర్నర్ హరిబాకీసన్రావ్‌బగాడే, ఎంపి సిఎం రమేశ్, తెలంగాణా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎంఎల్‌సి దువ్వాడశ్రీనివాసులు, సినీనిర్మాత ఏక్తాకపూర్, పుష్పాలంకరణ దాత సునీతతిమ్మగౌడ కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు.వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. అందరూ సాంప్రదాయదుస్తులు ధరించి నుదుటిన తిరునామంతో గోవింద నామస్మరణ చేసుకుంటూ ఆలయంలో భక్తిని చాటుకున్నారు. వైకుంఠద్వారంలో శ్రీవారిని దర్శించుకుని ప్రముఖులంతా భక్తిపారవశ్యంతో ఆనందం వ్యక్తం చేశారు.

## మహా కుంభమేళాలో శ్రీనివాసకల్యాణం

### - గోవిందనామస్మరణలతో ప్రతిధ్వనించిన ప్రయాగ్‌రాజ్



**తిరుమల,జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్య కల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లే కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆలయంలో నిర్వహించే రీతిలోనే ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో శనివారం శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు. ప్రయాగ్ రాజ్‌లోని శ్రీవారి నమూనా ఆలయం ప్రాంగణంలో తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవర్లను కల్యాణవేదికవద్దకు వేంచేపు చేశారు. అక్కడ ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు వేదపండితులు వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణ ధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మాంగళ్యపూజ, మంగళసూత్ర ధారణ మొదలైన ఘట్టాలతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. చివరగా స్వామి అమ్మవార్లకు నక్షత్రహారతి ,మంగళహారతి సమర్పించడంతో కల్యాణం విజయవంతంగా ముగిసింది. అక్కడ తిలకించిన భక్తులు పులకించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు గోపీనాథ్‌దీక్షితులు, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామ్‌రఘునాథ్, డిప్యూటీ ఇఒ గుణభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ధార్మికక్షేత్రంలో ముంతాజ్‌హోటల్ నిర్మాణాలను ఆపాలి

### - ప్రభుత్వం తక్షణమే అనుమతులు రద్దుచేయాలి:తిరుక్షేత్రాల రక్షణ సమితి



**తిరుమల,జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికనగరం తిరుపతికి సమీపంలోని అలిపిరి ప్రాంతంలో ముంతాజ్‌హోటల్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలని, గత ప్రభుత్వం ,గత పాలకమండలి ఇచ్చిన అనుమతులు తక్షణం రద్దుచేయాలని తిరుక్షేత్రాల రక్షణసమితి స్వామీజీలు, ప్రతినిధులు డిమాండ్ చేశారు. తిరుమల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హిందూ పుణ్యక్షేత్రమని, అలాంటిది అలిపిరిలో ముంతాజ్ హోటల్ ఎలా నిర్మిస్తారని ,అనుమతులను టిటిడి ఛైర్మన్, కూటమి ప్రభుత్వం రద్దుచేయాలన్నారు. ముంతాజ్ హోటల్ నిర్మాణాన్ని ఆపేయాలని డిమాండ్ చేస్తూ తిరుక్షేత్రాల రక్షణ సమితి తుమ్మ ఓంకార్ ఆధ్వర్యంలో శనివారం హిందూ సంఘాలు, స్వామీజీలు, టిటిడి ఇఒ శ్యామలరావును కలసి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం రద్దుచేస్తున్నట్లు ప్రకటించినా నిర్మాణాలు సాగుతుండటం దేనికి నిదర్శనమన్నారు. దేవునితో చెలగాటమాడితే ఎవరినైనా శిక్షిస్తాడని అన్నారు. గత ప్రస్తుత జిఒలను వెంటనే రద్దుచేయాలని సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందసరస్వతిస్వామి, ఓంకార్, శివానందస్వామి, గణేష్‌స్వామి, నీలకంఠ, కిరణ్‌కుమార్, మహేశ్‌దేగల పాల్గొన్నారు.

### కాజీపేట-గుంటూరు రూట్‌లో రైలు మార్గం పనులు! - ఫిబ్రవరి వరకు పలు రైళ్ల రద్దు

**గుంతకల్లు రైల్వే,జనవరి 18,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే కాజీపేట-డోర్నకల్-విజయవాడ-గుంటూరు గ్రాండ్ ట్రంక్ ప్రధాన రైలు మార్గంలో జరుగుతున్న రైలు మార్గం నిర్వహణ పనుల కారణంగా ఈ మార్గంలో తిరిగే పలు రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాజీపేట-డోర్నకల్-కాజీపేట మధ్య తిరిగే నెంబర్ 67765/66మెమో పాసింజర్ రైలుతో పాటు డోర్నకల్-విజయవాడ-డోర్నకల్ మధ్య తిరిగే నెంబర్ 67767/68మెమో పాసింజర్,విజయవాడ-గుంటూరు-విజయవాడ మధ్య తిరిగే నెంబర్ 67769/70మెమో పాసింజర్ రైలు సర్వీసులను ఈ నెల 20(సోమవారం) నుంచి ఫిబ్రవరి 28వరకు రద్దు.

# నీరే నిప్పుగా మారితే?

**భాగ్యనగర్ భాస్కర్‌కుమార్**

గుండెలో సుడిగుండాలున్నా నిండుగ నవ్వును ఏరు"-సినారె కితాబు ఇచ్చిన గోదావరి కూడా ఇప్పుడు కృష్ణానదికి తోడైంది. కృష్ణాజలాల కోసం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడమే కాదు ఆనకట్టలపై ఇరురాష్ట్రాల పోలీసులను దింపి బాహాబాహి పోరాటంకు ఉసిగొల్పుకుంటున్న సంఘటనలు, ఆర్‌డిఎస్ వద్ద గలాటలు తెలుగు ప్రజల మనసుపొరల్లో ముల్లులా గుచ్చుకొని తొలుస్తున్నది. కర్ణాటక, తమిళనాడు మధ్య చిచ్చురేపిన కావేరి జలవివాదం వలే తెలుగు రాష్ట్రాలలో కృష్ణా గోదావరి జలాల వివాదం నానాటికీ పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నదీ జలాల పంపిణీకి జాతీయ, అంతర్జాతీయ న్యాయసూత్రాలు ప్రామాణికంగా తీసుకొని బెసిన్‌దాటి తరలించకుండా బేసిన్ లోని ప్రతి ఎకరాకు తడుపుకొనేందుకు ఉభయ రాష్ట్రాలు చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదు. హెల్సింకి రూల్ నుంచి మొదలుకొని ప్రస్తుతం అమలులోఉన్న యునైటెడ్ నేషనన్స్ వాటర్ కోర్సెస్ కన్వెన్షన్ (యుఎన్‌డబ్ల్యుసి- 1997) వరకు నీటి వినియోగాల్లో నది బెసిన్ ప్రాంతాలకు సమన్యాయం, సహేతుకతపై ఆధారపడి నీటి కేటాయింపులు చేయాల్సి ఉన్నప్పటికి కేంద్రప్రభుత్వం కూడా "చేటలో తౌడు పోసి కుక్కలు ఎగదోసినట్లు" ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. ఫలితంగా తెలుగు రాష్ట్రాలలో జలవివాదం. కృష్ణానీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తే గోదావరి నదిలో మా వాటాతేల్చాలని ఆంధ్రప్రదేశ్ పట్టుబడుతోన్నది. తెలంగాణ కోరిన విధంగా కృష్ణాజలాల పంపిణీ వ్యవహారంలో బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్యనీటి విభజన వ్యవహారంలో కేంద్రప్రభుత్వం సమర్పించిన అదనపు టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట విచారణ చేపట్టాలని ట్రైబ్యునల్ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89ప్రకారం కాకుండా తొలుత ఐఎస్ఆర్‌డబ్ల్యు డిఎ- 1956 చట్టంలోని మూడో సెక్షన్ ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీ అంశంపై మొదట వాదనలు వింటామని తెలిపింది. ముందుగా 811 టీఎంసీల్లో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలవాటాను ముందే తేల్చాల్సిన అవసరం ఉందని ట్రైబ్యునల్ పేర్కొంది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు ఇరు రాష్ట్రాల వాదనలు వింటామని తెలిపింది. ఆ తర్వాతే 89వ సెక్షన్ ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు తెలుస్తామని బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పోతిరెడ్డిపాడు సామర్థ్యంను 80వేల క్యూసెక్కులకు పెంచిన నాటి నుంచి తెలంగాణలో వ్యతిరేకత వ్యక్తమైంది. దీనికి తోడు రాష్ట్ర విభజన తరువాత



ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాలలో512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు నీటిని పంపిణీ చేయడంతో తెలంగాణకు మరింత అన్యాయం జరుగుతోందనే భావన మొదలైంది. శ్రీశైలం ప్రాజెక్టులో 881అడుగులకుమించి నీటిమట్టాలు ఉన్నప్పుడే హెడ్ రెగ్యులేటర్ పూర్తిగా నీటినితోడే అవకాశం సంవత్సరానికి 10,15రోజులు ఉందని పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ కెనాల్ వ్యవస్థ విస్తరణనుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థించుకొంది. అంతేకాదు శ్రీశైలం నుంచి డెడ్ స్టోరేజిలో నీటిని తోడుకొనేందుకు మౌలిక వసతులను ఆంధ్రప్రదేశ్ వైఎస్ జగన్‌హయాంలో నిర్మించుకొంది. రోజుకు 8 టిఎంసిలను శ్రీశైలం నుంచి తీసుకొంటూ కృష్ణాబేసిన్ ఆవలకు నీటిని పంపుతుందని తెలంగాణ నుంచి విమర్శలు వెలువడుతున్నాయి. దీనికి ప్రతిగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు అనుమతులు లేకుండా అనేక నీటిపారుదల ప్రాజెక్టులను చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిడబ్ల్యుసికి ఫిర్యాదు చేస్తూ వచ్చింది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత 150.53 టీఎంసీల కృష్ణా నది నీటిని వినియోగించుకోవడం కోసం తెలంగాణ ఐదు కొత్త ప్రాజెక్టులను చేపట్టింది. దీనివల్ల 16.87లక్షల ఎకరాల ఆయకట్టు కొత్తగా సృష్టించబడుతుంది. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని కరువు పీడిత ప్రాంతాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేయనుందనికేఆర్ఎంబీ, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ),అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తీసుకోకుండానే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్89కి భిన్నంగా ప్రాజెక్టులు చేపట్టారని ఆనాటి ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ గతంలో పలుమార్లు నిరసనలు తెలిపిందని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి (ఎల్ఐఎస్) లిఫ్ట్‌ఇరిగేషన్ స్కీమ్, డిండి లిఫ్ట్, భక్త రామదాస్ లిఫ్ట్, మిషన్ భగీరథ కింద వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్, తుమ్మిళ్ల లిఫ్ట్‌వంటి ఐదు ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాజెక్టుల ఉనికికి ప్రమాదంకలిగించే అవకాశం ఉందని ఫిర్యాదుల చేశారు. ప్రస్తుతంఉన్న కల్వకుర్తి ఎల్ఐఎస్,నెట్టంపాడు ఎల్ఐఎస్, శ్రీశైలం ఎడమ గట్టుకాలువల పరిధిని 77 టీఎంసీల నుంచి 105.4 టీఎంసీలకు పెంచారని,ఆయకట్టు 7.2లక్షల ఎకరాల నుంచి 9.93లక్షల ఎకరాలకు పెరిగిందని ఆంధ్రప్రదేశ్ లేఖలో ఆందోళనపడుతు ఆవేదన వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో ఎలాంటి ఒప్పందాలు చేసుకోకుండానే డిపిఆర్ వివరాలు అందించకుండానే గోదావరి నదిపై కొత్త ప్రాజెక్టులు అనేకం చేపట్టారని గోదావరినది యాజమాన్య బోర్డుకు ఆంధ్రప్రదేశ్ ఫిర్యాదు చేసింది. గోదావరి పరివాహక ప్రాంతంలోని జలాలలో ఆంధ్రప్రదేశ్ నీటివాటా తేల్చాలని ట్రిబ్యునల్‌ను ఆంధ్రప్రదేశ్ కోరింది. గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులను కూడా గోదావరి నది యాజమాన్య బోర్డులు ఆధీనంలోకి తీసుకోవాలనికోరుతోన్నది. ఇప్పటికే కృష్ణానది యాజమాన్యబోర్డు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ తమ పరిధిలోకి తీసుకొన్నాయి. దానిని తెలంగాణ పూర్తిగా వ్యతిరేకిస్తున్నది. జిఆర్ఎంబికి గోదావరి ప్రాజెక్టులను కూడా స్వాధీనం చేసుకోవడానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదనే పట్టుదలతో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై అనేక వేదికలపై ఫిర్యాదు చేస్తున్నది. పోలవరం ప్రాజెక్టును ఆదినుంచి తెలంగాణ చత్తీస్‌ఘడ్ ఒరిస్సా ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. మరోవైపు ఇటీవల భూకంపం ములుగుజిల్లా అడువుల్లో కేంద్రంగా రావడంతో కూడాగోదావరి నదిపైకట్టే ప్రాజెక్టులవల్ల భవిష్యత్‌లో సంభవించబోయే ప్రమాదాలపైకూడా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నుంచి సముద్రంలో కలిసే వరద జలాలను పోలవరంనుంచి బనకచర్ల మీదుగా పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా అంతరాష్ట్ర రివర్ లింక్ ప్రాజెక్టుకు ప్రణాళికలు రూపొందిస్తుండటంతో తెలంగాణఅభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. ఈప్రాజెక్టు కోసం నిధులు మంజూరు చేయాలని ఇటీవలే కేంద్రాన్ని చంద్రబాబు సర్కార్‌కోరింది. ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా గోదావరి నీళ్ల తరలించుకొనిపోవడానికి చేస్తున్న కుట్రగా తెలంగాణ సాగు నీటి రంగనిపుణుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇదిపూర్తిగా గోదావరినదినే చెరబట్టేందుకు ఎపి పన్నుతున్న పన్నాగమన్న వాదనలు వినిపిస్తున్నాయి. పోతిరెడ్డిపాటు హెడ్‌రెగ్యులటరీ విస్తరణతో కృష్ణాజలాలను కొల్లగొట్టేందుకు నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుట్రలు చేస్తే,నేడు జీబీలింక్‌తో గోదావరి జలాలను చెరబట్టేందుకు చంద్రబాబు కుతంత్రాలు చేస్తున్నాడని సాగునీటి రంగనిపుణులు హెచ్చరిస్తున్నారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరినీటిని కృష్ణా బేసిన్‌కు మళ్లించినట్టయితే, ఎంతనీటిని మళ్లిస్తారో ఆమేరకు కృష్ణాబేసిన్‌లోని రాష్ట్రాలకు వాటాకేటాయించాల్సి ఉంటుంది. పోలవరం నుంచి 80 టీఎంసీలను నాగార్జున సాగర్ ఆయకట్టుకు మళ్లించారు. ఈ నేపథ్యంలో 80టీఎంసీల జలాలను కృష్ణాబేసిన్‌లోని నాటి ఉమ్మడి ఏపీకి 45టీఎంసీలు, కర్ణాటకకు 21, మహారాష్ట్రకు 14టీంఎంసీల చొప్పున ట్రిబ్యునల్ వాటాను కేటాయించింది. అందుకు ఉమ్మడి ఏపీప్రభుత్వం సైతం అంగీకరించింది. ప్రస్తుతం ఏపీ జీబీ లింక్‌ద్వారా 200 టీఎంసీలు మళ్లిస్తామనిచెప్పున్న బేసిన్ రాష్ట్రాలవాటాపై ప్రస్తావించకపోవడం తెలంగాణ రాష్ట్రం వివాదంచేస్తోన్నది.కృష్ణాలో తెలంగాణకు వచ్చేఅదనపు వాటాను ఎగ్గొట్టడానికే ఏపీ గోదావరిలో లేని వరద జలాల కాన్సెప్టును తెరపైకి తెస్తున్నదని తెలంగాణ వాదిస్తోంది. ●

కృష్ణా,గోదావరి నీటిని రాయలసీమ తరలించడానికి బనకచర్ల కీలకంగా మార బోతున్నది.కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ తరహా లో పోలవరంను వాడుకొంటారు. తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నిర్మిం చిన మల్లన్నసాగర్, కొండ పోచమ్మ తరహాలో చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన కొత్త ప్రాజెక్టుకు బొల్లపల్లి రిజర్వాయర్ కీలకంగా మారబోతుంది. ఆంధ్ర ప్రదేశ్ నలు చెరగులా సాగు, తాగునీరు అందించడానికి గోదావరిబనకచెర్ల లింక్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. లింక్ ప్రాజెక్టును గేమ్‌చేంజర్‌గా, గేట్ వే ఆఫ్ రాయలసీమగా అభివర్ణించారు. వీలైనంత త్వరగా పనులు కూడా చేపడతామని ముఖ్యంగా ప్రతిజ్ఞకూడా చేశారు. మొదటి దశలో పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువపై ఏర్పాటు చేసిన తాడిపూడి లిఫ్ట్ ప్రధాన కాలువ ద్వారా జలాలను 175 కిలోమీటర్ల దూరంలోని ప్రకాశం బ్యారేజ్‌కు తరలిస్తారు. రెండో దశలో అక్కడి నుంచి జలాలను ఆరు దశల్లో లిఫ్ట్ చేస్తారు. 84వ కిలోమీటరు వద్ద 150 టీఎంసీల సామర్థ్యంతో బొల్లపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లిస్తారు. మూడో దశలో బొల్లపల్లి నుంచి 110 కిలోమీటర్ల కాలువ ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ దిగువన ఉన్న బనకచర్ల రెగ్యులేటర్‌కు గోదావరి జలాలు పెన్నా బేసిన్‌కు తరలి స్తారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలతోపాటు రాయలసీమ జిల్లాలన్నింటికీ సాగునీరందిం చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుమారు 80,112 వేల కోట్ల రూపాయలు గోదావరి నీళ్ళను కృష్ణాబేసిన్ తోపాటు రాయలసీమకు తరలించడానికి వ్యయం చేయబోతున్నది. నీరే నిప్పుగామారి తెలుగు ప్రజల సఖ్యతను దెబ్బతీయకుండా మమతల పూలు పూసేలా పాలకులు సముచిత నిర్ణయం తీసుకోవాలి, కొట్లాటలు లేకుండా చూసుకోవాలి.

# 'కుంభ్' కళ..

ఉత్తరప్రదేశ్

**ఎ.వి.వి ప్రసాద్**

కనీవినీ ఎరుగని ఒక మహా సమ్మేళనం. ప్రపంచం నలు మూలల నుంచి బారులు బారులుగా వస్తున్న జనం. గంగా తరంగాల సుస్వరనాద హోరు నడుమ ఎలుగెత్తి వినిపించే సాధుసంత్‌ల మహాప్రభంజనం. గతవారం ప్రయాగ్‌రాజ్‌లో మొదలైన మహాకుంభమేళా. అన్ని జాతులవారు, అన్ని దేశాలవారు, అన్ని సంస్కృతుల వారు ఒక్కచోట కనిపించే ఈ మహా సమ్మేళనానికి త్రివేణీ సంగమ స్థలి అయిన ప్రయాగ్‌రాజ్ వేదిక అయింది. గత సోమవారం భోగి(13,జనవరి) రోజున అసాధారణ రీతిలో ప్రారంభమైన ఈ మహాకుంభ్‌లో నిత్యం సగటున రెండు కోట్ల మంది 'అమృత స్నానం' ఆచరిస్తున్నారంటే ఆ జనహోరును ఎలా కొలవగలం! గత ఆరు రోజులలో సందర్శకుల సంఖ్య దాదాపు 13 కోట్లు ఉంటుందని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా చెప్పడాన్ని బట్టి ప్రయాగ్‌రాజ్‌లోని 'జనజాతర' ఎంత ఉధృతంగా సాగుతున్నదో ఊహించుకోవచ్చు. ధార్మిక ఘోషతో జరిగే ఈ వేడుకలు రానురాను అనేక పరిణామాలు చెంది కాలానుగుణంగా వచ్చిన మార్పులకు తగినట్లుగా అనేక రంగులతో ఇప్పుడు కనిపిస్తున్నాయి. సాధారణంగా నదుల పేర్లు తలచుకొంటేనే ప్రతి భారతీయుని మదిలోను ఒక పరవశం కలుగుతుంది. నీటికి, మనిషికి ఉన్న సంబంధానికిఅది ఒక సంకేతం. నదీ ప్రవాహాన్ని చూడగానే దానిలో ఒకసారైనా మునగాలనిపిస్తుంది. గోదావరి, గంగ, కృష్ణవంటి నదుల్లో నిత్యంస్నానాలు చేసే వారు కూడా ఉన్నారు. కొన్ని పుణ్యతిథులలో చేస్తే దానిప్రభావం ఎంతో ఉంటుందనీ, జీవితాలు వికసిస్తాయనీ చాలా మంది విశ్వాసం. ఆ విశ్వాసాల నుంచే ఇన్నిరకాల వేడుకలు ఆవిర్భవించాయనిపిస్తుంది. వాటిలో అతి గొప్ప నదీ వేడుకగా ఈ మహాకుంభమేళాను చెప్పవచ్చు. ప్రతి జీవనదికి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పెద్దఎత్తున వేడుకలు జరుపుతారు. వాటినే 'పుష్కరాలు' అంటాం. ఖగోళ శాస్త్రంతోముడిపడి ఉండే ఈ వేడుకలన్నీ మాస ప్రాధాన్యం,వత్సర ప్రాధాన్యం, తిథి ప్రాధాన్యం ప్రకారం నిర్వహిస్తూంటారు. 12 రోజులు ఉండడంతోబృహస్పతి (గురుడు) ఆ రాశులలోకి ప్రవేశించినప్పుడల్లా ఒక్కొక్క నదికి పుష్కరాలు వస్తూంటాయి.

పుష్కర కాలంలో ఆ నదీజలాలకు అనేక రకాల మహత్తులు ఉంటాయనే నమ్మకంతో నదీ స్నానానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తుంటారు. అలాగురుడు మేషరాశిలోకి ప్రవేశించినప్పుడు గంగానదికివచ్చే పుష్కరాలనే కుంభమేళా అంటారు. కుంభఅంటే కుండ అనీ, కలశం అనీ అర్థాలు. మేళా అంటే జాతర లేదా సమ్మేళనా అని చెప్పవచ్చు. పూర్ణ కుంభ మేళా అంటే 12 సంవత్సరాలకోసారివచ్చే గంగా పుష్కరాలను ప్రధానంగా ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్ అనే నాలుగు ప్రాంతాల్లో నిర్వహిస్తూంటారు. అలా 12 పూర్ణ కుంభమేళాలు పూర్తయ్యాక 144 సంవత్సరాలకోసారి ప్రయాగలో మహాకుంభ మేళా జరుగుతుంది. గంగ, యమున,సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగ స్థలి అయిన ప్రయాగ్‌రాజ్‌లో జరిగే ఈ వేడుకలకు అందుకే విశేషప్రాధాన్యం. ఒక మహాకుంభమేళాను చూసిన వారు తమ జీవిత కాలంలో మరో పర్యాయం ఈ వేడుకలను చూడలేకపోవచ్చు. అందుకే ప్రయాగ్‌రాజ్‌లో జరిగే వేడుకలకు అన్ని కోట్ల సందర్శకులరాక. పుష్యపౌర్ణమి రోజున మొదలయ్యే మహాకుంభ్ 45 రోజులపాటు జరగడం కూడా విశేషమే. పుష్కరాలు పన్నెండు రోజులు మాత్రమే జరుగుతూంటాయి. కానీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ మహాకుంభ్‌ను 45 రోజులు నిర్వహించడం దాని విశిష్టతను మరింత పెంచుతోంది. అటు ఆధ్యాత్మికత ఇటు వ్యాపారం రెండూ కలగలసి సాగుతున్నట్లుగా కూడా కనిపిస్తాయి. 45రోజులు అంటే నెలన్నర పాటు కొనసాగవలసి రావడంతో భారీనిర్మాణాలనే యుపిప్రభుత్వం చేపట్టింది. వాటి కోసం45వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిందంటే అదికూడా సాధారణ విషయం కాదనేచెప్పాలి. రోజూ వచ్చే కోట్లమంది పర్యాటకుల కోసం, కొన్ని రోజుల పాటు అక్కడ ఉండేవారి కోసం రెండులక్షల 'టెంట్'లను నిర్మించింది. వాటిలో సాధారణ టెంట్‌లతో పాటు విలాసవంతమైన సకల సౌకర్యాలతో నిర్మించిన టెంట్‌లు కూడాఉన్నాయి. దాదాపు పదివేల ఎకరాలలో నిర్మించిన ఈ వేలాదిశిబిరాల సముదాయాన్ని చూస్తుంటే పౌరాణిక సినిమాలలోయుద్ధ క్షేత్రంలో రాజులు నిర్మించుకొనే తాత్కాలిక శిబిరాల్లా కనిపిస్తాయి. రోజుకు మూడు వేల నుంచి మూడు, నాలుగు లక్షల అద్దెవసూలు చేసే అన్ని 'తరగతుల' శిబిరాలు వీటిలో ఉండడం మరో విశేషం. సాధారణ భక్తులు తీరంపొడవునా ఏదో ఒకచోట మునుగుతూంటారు. కానీ విఐపి భక్తులు,అఖాడాలకు చెందిన విఐపి స్వామిజీలు అలా చేయలేరు గనుక వారి కోసం వీటిలో తేలియాడే ప్రత్యేకమైన జెట్టీలను కూడా నిర్మించారు. చాలా ఆకర్షణీయంగా కనిపించే ఈజెట్టీలపై వెళ్లి ప్రత్యేకంగా నిర్దేశించిన ప్రదేశాలలో ఆ విఐపిలు'పుణ్య స్నానాలు' చేసి వస్తారు. ఇలా 'హోదా'లకు తగినట్లుగా పుణ్యాన్ని సంపాదించుకొనే సౌకర్యాలు కూడా త్రివేణి సంగమం వద్దకనిపించడం మరో విశేషం. గంగానదిపై 30 బల్లకట్టు వంతెనలు నిర్మించడం మరో ఆకర్షణ. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలోవినియోగించుకోవడం ఈ మహాకుంభమేళాలో మరో ప్రత్యేకత.144 సంవత్సరాల క్రితం జరిగినప్పుడు ఇన్ని సౌకర్యాలు ఉండిఉండకపోవచ్చు. ఇన్ని ఆకర్షణలూఉండకపోవచ్చు. కానీ క్యుఆర్ కోడ్‌లు,డ్రోన్‌లు ఉపయోగిస్తూ అత్యంత ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానంతో సౌకర్యాలు కల్పిస్తూ,అన్నిరకాలవ్యాపారాలతో పర్యాటకులను ఆకట్టుకుంటూ ఇంతమహోన్నతంగా నిర్వహించడం మాత్రం నిజంగా అపూర్వం. ఈవేడుకల ద్వారా ప్రభుత్వానికి రెండులక్షలకోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అధికారులే చెబుతున్నారు. దానిని బట్టే అర్థమవుతోంది. అక్కడ వ్యాపారం ఏస్థాయిలో జరుగుతున్నదో తెలియడానికి. అటు ఆధ్యాత్మికం,ఇటువ్యాపారం ఒక దానికొకటి పోటీగా సాగుతున్నాయి. ఏది ఏమైనా ఇది చరిత్రలో నిలిచిపోయే వేడుక. ●



సాధువులు

# ప్రధానిరేసులో మాజీ బ్యాంకర్!

కెనడా

**గన్ని మోహన్**

విస్తీర్ణంలో ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా కొనసాగుతున్న కెనడాలో నెలకొన్న అంతర్గత సంక్షోభం కొలిక్కి వచ్చే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పుడు అత్యవసరంగా పాలనాపరంగా ఎదురైన సంక్షోభం అధిగమించేందుకు అధికారంలో ఉన్నలిబరల్‌పార్టీ కొత్తనేతను ఎన్నుకోవాల్సి వస్తోంది. మార్చి 9నాటికి కొత్తనేతను ఎన్నుకోవడం జరుగుతుందని ప్రకటించిన లిబరల్ పార్టీ నేతలు ఆక్రమంలో ఇద్దరు ముగ్గురు నేతలపేర్లు కూడా బయటకువచ్చాయి. తర్వాత కొందరు రేసు నుంచి తప్పుకున్నారు. కొత్తగా ముగ్గురిపేర్లు మాత్రమే వినవస్తున్నా వారిలో చంద్ర ఆర్యా ఒకరైతే మరొకరు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, కెనరా కేంద్రబ్యాంక్ మాజీ గవర్నర్ మార్క్ కార్నీ మరొకరు. కెనడాలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం,ద్రవ్యోల్బణం పెరుగుదల, పక్కగృహాల సమస్యలు వంటివి అధిగమించడంతోపాటు పక్కనేఉన్న అమెరికా నుంచి ఎదురవుతున్న ముప్పును కూడా అధిగమించేందుకు ఒక ఆర్థికవేత్త, పాలనాదక్షుడు అయిన నాయకుడు అవసరంఅని అటు లిబరల్‌పార్టీతోపాటు ఇటు కెనడా ప్రజలు కూడా బలంగా నమ్ముతున్నారు. ఇప్పుడు కొత్తగా రేసులోకి వచ్చిన మార్క్‌కార్నీ తాను కెనడాఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టగలనని నమ్ముతున్నారు. అలాగే పక్కలోబల్లెంగా తయారవుతున్నఅమెరికా ధోరణులకు కూడా ఫుల్‌స్టాప్ పెట్టే వ్యూహాలు తనవద్ద ఉన్నాయని చెపుతున్నారు. కెనడా బయటి వ్యక్తిగానే తనను చెపుతున్నా తాను పెరిగింది కెనడాలోనే కావడంతో కార్నీ లిబరల్ పార్టీ చీఫ్ పదవికి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆల్‌బ్రెట్టా రాజధాని ఎడ్మాంటన్ నుంచే తన అభిమానులు, మద్దతుదారులతో కూడినర్యాలీలో ఆయన ప్రసంగించారు. లిబరల్‌పార్టీ చీఫ్‌గాను, కెనడాకొత్తప్రధాని పదవికోసం జరుగుతున్న ఎంపికలో తానుకూడా అభ్యర్థి కాదలిచినట్లు ఆయన ప్రకటించారు. 59 ఏళ్ల మాజీ బ్యాంకర్ ఇప్పుడు మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో స్థానంలో వినిపిస్తున్న మొదటిపేరు అని చెప్పుకోవాలి. 2008 నుంచి 2013వరకూ ఆయన బ్యాంక్ ఆఫ్ కెనడాకు గవర్నర్‌గా పనిచేసారు. ఆతర్వాత బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు 2020 వరకూ గవర్నర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. వచ్చే అక్టోబరునాటికి పార్టీని,ప్రభుత్వాన్ని కూడా ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం మార్క్ కార్నీకి ఉందని లిబరల్ పార్టీలో కూడా బలంగా వినిపిస్తోంది. ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేల్లో లిబరల్ పార్టీ కంటే కన్సర్వేటివ్ పార్టీకి20 పర్సంటేజి పాయింట్లుఎక్కువ వచ్చాయి. కెనడాలో ప్రస్తుతంలిబరల్‌పార్టీ ప్రభుత్వంపై వ్యతిరేకత అంతకంతకూ పెరుగుతున్నట్లు ఈసర్వే చెపుతోంది. దీనికితోడు అమెరికాకు అధ్యక్షుడుగా ఎన్నికైన రిపబ్లికన్ నేత డొనాల్డ్‌ట్రంప్ తాను బాధ్యతలు చేపట్టిన వెంటనే కెనడా దిగుమతులపై 25 శాతం సుంకం వసూలు చేస్తాననిప్రకటించారు. లేని పక్షంలో కెనడా అమెరికాలో 51వ రాష్ట్రంగా విలీనంకావాలని ఆయనబహిరంగంగానే ప్రకటించారు. బ్రిటిష్‌వలసవాదులనుంచి శతాబ్దకాలంగా స్వాతంత్ర్యం పొంది అత్యున్నత దేశంగా భాసిల్లుతున్నకెనడా ప్రజలు ట్రంప్ వైఖరిని సుతరాము అంగీకరించడంలేదు. సరికదా సుంకాలను అడ్డుకోడానికి అత్యంత అనుభవం కలిగిన ఆర్థికవవేత్తలు ప్రధానిగా రావాలని బలంగా కోరుకుంటున్నారు. చెప్పుకోడానికి బయటి వ్యక్తి అయినా మార్క్‌కార్నీ అయితేనే ప్రస్తుత సమస్యలకు జవాబుదారీగా బాధ్యతగా పాలన కొనసాగిస్తారని అటు పార్టీనేతల్లోను, ఇటు ప్రజల్లోను బలంగా ఉంది. తాను రేసులో ఉన్నానని ప్రచారం ప్రారంభిస్తూనే కార్నీకెనడాలో యువత అందుబాటులో పక్కాఇంటిని కూడా పొందలేకపోతోందని,ఎక్కువమందికి వైద్యులు కూడా అందుబాటులోలేని దుస్థితి ఉందని వీటన్నింటినీ అధిగమించి కెనడా సార్వభౌమత్వాన్ని పరిరక్షిస్తానని చెపుతూ ఎన్నికల తెరపైకిదూసుకువచ్చారు. కాగా పోల్‌సర్వేలో ముందువరుసలో ఉన్నకన్సర్వేటివ్ పార్టీ నాయకుడు పియరీ పోలీవర్‌ను కూడా కార్నీవిమర్శించారు. ఆయనకున్న కన్సర్వేటివ్ భావాలు కెనడా అభివృద్ధి, సంక్షేమానికి పనికిరావంటూ కొట్టిపారేసారు. ఒకవేళ ఎన్నికలుఅంటూ జరిగి కన్సర్వేటివ్స్ అధికారంలోకి వస్తే పియరీ పోలివర్ ప్రధాని కాగలరన్న అంచనాలు కూడా ఉన్నాయి. కెనడాకు ప్రధానిగా పియరీ వస్తేకెనడా విధ్వంసానికి కారకుడవుతారని, ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందని ఆయన కన్సర్వేటివ్‌లపై ప్రజల్లో అపోహలు పెంచే ప్రయత్నం చేసి కార్నీ సఫలీకృతుడయ్యాడు. గత ప్రధాని ట్రూడో ప్రభుత్వం విధించిన కర్బనఉద్గార విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన పియరీ ట్రూడో తన ప్రచారంలో ట్రూడో విధేయుడికే మళ్లీ పట్టంకడతారా అంటూ కార్నీపై ప్రతి విమర్శలతో ముందుకు వస్తున్నాడు. అంతేకాకుండా కర్బన ఉద్గారాలపై సుంకం విధించాలన్న ట్రూడోకు మద్దతుపలికిన కార్నీని ఎన్నుకుంటే ప్రజలకు సుంకాల భారం తప్పదంటూ మరోవాదన తీసుకువచ్చాడు. ఇవన్నీ పక్కన పెడితే ఇప్పుడు మార్క్‌కార్నీ పార్టీచీఫ్ ప్రధానిగా వస్తేముందుగా ఎదుర్కొనాల్సింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నే. ఆయన విధించే25శాతం సుంకాలను విజయ వంతంగా తిప్పికొట్టే ప్రణాళికలు, 51వ రాష్ట్రంగా అమెరికాలో విలీనం కావాలన్న ట్రంప్ కోరికలను అధిగమించి కెనడా స్వయం ప్రతిపత్తిని పరిరక్షించాల్సిన బాధ్యత కొత్త ప్రధానిదే. వీటితో పాటు వచ్చే అక్టోబరులో జరిగే ఎన్నికల్లో మళ్లీ లిబరల్‌పార్టీని అధికారంలోకి తెచ్చే బాధ్యత ఇప్పుడు ఎన్నుకునే కొత్త నేతపైనే ఉంది. కార్బన్‌ట్యాక్స్ కార్నీ అంటూ కన్సర్వేటివ్‌లు చేస్తున్న ప్రచారాన్ని అధిగమించి ఆర్థిక, పాలనా సంస్కరణలతో కెనడాను మళ్లీ ట్రాక్‌లోకి తీసుకువస్తానని చెపుతున్న మెక్ కార్నీకే లిబరల్ పార్టీనేతలు ఓటువేస్తారా? లేక కన్సర్వే టివ్‌లకు ఎన్నికల్లో మళ్లీ పట్టం కడతారా అన్నది వచ్చే మార్చి నాటికి స్పష్టం అవుతుంది. సర్వేలను బట్టిచూస్తే మాజీ బ్యాంకర్‌కే పార్టీచీఫ్ రేసులో అగ్రతాంబూలం లభిస్తోంది. దీన్ని బట్టి చూస్తే ఒక మాజీ బ్యాంకర్ కెనడాకు అధిపతిగా వస్తున్నారని కెనడా ప్రజల్లో బలంగా నాటుకు పోయిందని చెప్పవచ్చు. ●



మార్క్ కార్నీ

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలేవి?

**డాక్టర్ నీలం సంపత్**

పంచ భూతాలలో ఒకటైన భూమి మానవ మనుగడకు అవసరమైన సకల వనరులను దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా కొనసాగుతున్న రవాణా రంగానికి గుండెకాయలాంటి రోడ్డు రవాణా రంగం నేడు రహదారి ప్రమాదాల రూపంలో అన్నిరకాల రోడ్డు యూజర్లను పెను ప్రమాదాల విషవలయంలోకి నెట్టివేస్తూ ఏటా లక్షాఎనభైవేల మంది వారి ప్రాణాలను బలితీసుకోవడంతో పాటు ఐదులక్షల పై చిలుకు ప్రమాద బాధితులను క్షతగాత్రులుగా మారుస్తూ వారిని జీవన్మరణ పోరాటం చేసేలా మార్చడంతో పాటు వారి కుటుంబాలతో పాటు దేశఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న వైనంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోనూ గతేడాది 23491 రోడ్డు ప్రమాదాలు జరిగి 6640 మంది ప్రాణాలు కోల్పోయిన వైనం ఆందోళన కలిగిస్తోంది. రోడ్లపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి?! దేశంలో ఒక వంద నలభై రెండు కోట్లపై చిలుకు జనాభా, తెలంగాణ రాష్ట్రంలో మూడు కోట్ల ఎనభై లక్షల పైచిలుకు జనాభా రోజువారీ మౌలిక అవసరాలను తీర్చడంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగం ఆశించిన స్థాయిలో పని చేయని నేపథ్యంలో లక్షలూ, కోట్ల సంఖ్యలో వ్యక్తిగత వాహనాలు రోడ్లపైకి వస్తున్న నేపథ్యంలో దేశంలో, రాష్ట్రంలో అన్నిరకాల రోడ్లపై రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. రోడ్లనిర్మాణంలో నాణ్యతా లోపాలు, రహదారులపై ఏర్పడిన బ్లైండ్ స్పాట్లు, బ్లాక్ స్పాట్లు,డ్రైవర్ల దుందుడుకు తనంతో నిర్లక్ష్యంతో మితిమీరిన వేగంతో నడపబడే వాహనాలు, మద్యం మత్తులో, నిద్రమత్తులో మొబైల్ ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవర్లు వాహకలిగి వుండి వాటిని ప్రజలువినియోగించుకోవడానికి అనువైన పదార్థాలుగా ఉత్పత్తి చేయడంతో పాటు భౌగోళికంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల దైనందిన అవసరాలను తీర్చడానికి సదరు సరుకులను చేర్చడానికి అవసరమైన రవాణా సదుపాయాన్ని కలిగిస్తుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో వాహనాలను నడుపుతుండడం ఫలితంగా దృష్టి మరలడం, పొగమంచుతో రోడ్లు సరిగ్గా కనపడకపోవడంతోపాటు డ్రైవింగ్ నైపుణ్యాలు లేని వారు డ్రైవింగ్ చేయడం మూలంగా ప్రమాదాలు జరుగుతున్న వైనం బహిరంగ రహస్యమే. వీటికి తోడు ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్లపై తిరుగుతుండడం, రోడ్డు స్థితిగతులను తెలియజేసే సైన్ బోర్డ్‌లనూ, సూచికలనూ డ్రైవర్లతో సహా రోడ్డు యూజర్లందరికీ తెలియజేయకపోవడం, ఒకవేళ తెలియ జేసినా వాటిని అర్థంచేసుకునే శక్తి డ్రైవర్లకు లేకపోవడం ఫలితంగానే ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో అన్నిరకాల రహదారులపై పెరుగుతున్న వాహనాల సంఖ్య ఫలితంగా పెచ్చుమీరుతున్న రోడ్డు ప్రమాదాలను నివారణకు అవసరమైన అవగాహనను కలిగించడం కోసం 1989లో మొట్ట మొదటిసారి మోర్త్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డుభద్రత వారోత్సవం ప్రారంభమై నేడు 36వ జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాలకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలోరోడ్డు ప్రమాదాలను అరికట్టలేకపోవడం శోచనీయం. నిన్న గాక మొన్న జరిగిన పార్లమెంట్ సమావేశంలో సాక్షాత్తూ కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి సదస్సులలో మన దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల ఘటనలతో కలతచెందాల్సి వస్తుందని బాధను వ్యక్తం చేయడం దేశంలో రోడ్డు ప్రమాదాల తీవ్రతకు ఉదాహరణగా భావించక తప్పదు. ఈ నేపథ్యంలోఘోర రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి అవసరమైన చైతన్యాన్ని కలిగించడానికి మోర్త్ మార్గదర్శకాలకు అనుగుణంగాజనవరి 1, 2025 నుండి తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఊరూరా వాడ వాడా ఎంతో సందడిగా కొనసాగుతున్న వైనం బహిరంగ రహస్యమే. ఐతే మోర్త్ మార్గదర్శకాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ ఆదేశాల ప్రకారం తయారుచేసిన రోజువారి కార్యక్రమాల నిర్వహణకోసం రాష్ట్ర,జిల్లాస్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు రవాణాశాఖ అధికార యంత్రాంగం చూపిస్తున్న చొరవ నిస్సందేహాంగా అభినందనీయమే. ఐతే మోర్త్



మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీలో ప్రధాన కార్యదర్శిగా ఎంతోకీలకమైన బాధ్యతను నెం వేర్చాల్సిన రహదారులు భవనాలశాఖ జిల్లాస్థాయి యంత్రాంగం పాత్ర కేవలం ప్రచార సామగ్రిలో భాగమైన బ్యానర్లూ, పోస్టర్లూ, ఫ్లెక్సీలు, కరపత్రాలకే పరిమితమౌతున్న వైనం విచారకరమే. అంతేకాకుండ మాసోత్సవాలలో రోడ్డు భద్రత కమిటీలో మెంబర్లుగా కొనసాగాల్సిన యన్.జి.ఓ.ల ఉనికి ఎక్కడా కనపడడం లేదని చెప్పక తప్పదు. జిల్లా ఇక పోతే సదరు రోడ్డుభద్రత కమిటీలో ఓ సభ్యుడిగా కొనసాగు తున్న రవాణాశాఖ అధికారులుమాత్రం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ను విజయవంతం చేయడానికి అవసరమైన మొత్తం ఖర్చుల భారాన్ని తామే మోయాల్సి వస్తుండడం నిస్సందేహంగా వారికి ఇబ్బందిని కలిగించేదనని పరిశీలకులనుకుంటున్నారు. ప్రభుత్వ పరంగా పైసా బడ్జెట్ రాదు. దానికితోడు రోడ్డు భద్రత స్టేక్ హోల్డర్లలో మరొకరైన పోలీసుశాఖ సైతం సదరు ఖర్చులను షేర్ చేసుకోవడం లేదు. కళాబృందాలకు భోజనాల సదుపాయాలు సైతం ఖర్చులను పెంచుతున్నాయి. మరోవైపు సదరు భద్రత మాసోత్సవాలలో మంత్రులు, బ్యూరోక్రట్ల లాంటి వి.ఐ.పిల తాకిడితో ఖర్చులు తడిసి మోపెడౌతుండడం గమనార్హం. అదిగాకుండా రవాణాశాఖ అధికారులు మాసోత్సవాల మూలంగా రోజువారీ శాఖాపరమైన విధులకు దూరంగా వుండాల్సి వస్తుండడంతో డ్రైవింగ్ లైసెన్సుల కోసం,వాహనాల రిజిస్ట్రేషన్ కోసం, ఫిట్నెస్ కోసం రవాణాశాఖ కార్యాలయాలకు వెళ్ళే ప్రజలు ఇబ్బందులకు గురికాక తప్పడం లేదనే భావన సర్వత్రవెల్లువెత్తుతోంది. గత పదిహేను రోజులుగా రాష్ట్రంలో ఓ వైపు భారీ ఎత్తున జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు కొనసాగుతున్నా మరోవైపు రాష్ట్ర రహదారులపై రోడ్డు ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. నల్గొండ సూర్యాపేట చివ్వెంలో, మహబూబ్ నగర్‌లో, కామారెడ్డిలో,ఆదిలాబాద్‌లో, బెల్లంపల్లిలో, మెదక్‌లో, మైలార్ దేవపల్లిలో, సంగారెడ్డిలతోపాటు నిన్నరాత్రి హైదరాబాద్ వరంగల్ హైవేలో భువనగిరి వద్ద మరో ఘోర రోడ్డు ప్రమాదంతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రమాదాల పరంపర కొనసాగుతూనే వుంది. వాహన చోదకులు అతివేగం, నిద్రమత్తులో, మద్యం మత్తులో వాహనాలను నడపడం, పొగ మంచుతో రహదారులపై వాహనాలు కనపడక ఒక దానితో మరొకటి ఢీకొట్టడం, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్ల వినియోగం, డ్రైవనిర్లక్ష్యం, వాహనాల ఫిట్‌నెస్‌లో లోపాల మూలానలతో రహదారుల పై నిలిపి వేసిన ట్యాంకర్ల లాంటి భారీ వాహనాలను ఢీకొట్టడంతో పాటు హిట్ అండ్ రన్‌లాంటి ఘటన వాహన చోదకుల,ప్రయాణీకుల,పాదచారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రపంచ ఆరోగ్యసంస్థ, ఐక్యరాజ్యసమితి నిర్దేశాలకు అనుగుణంగా మన దేశంలో, రాష్ట్రంలోనూ రోడ్డు ప్రమాదాలు తగ్గాలంటే ఎలాంటి బ్లైండ్ స్పాట్లు లేని పూర్తి భద్రతతో కూడిన రహదారుల నిర్మాణం జరపడంతో పాటు ఇదివరకే రహదారులపై వున్న బ్లైండ్‌స్పాట్లను తొలగించాలి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాల కల్పనతో మెజారిటీ ప్రజలను ఆకర్షించడం ద్వారా ప్రయాణ అవసరాల కోసం వ్యక్తిగత వాహనాలను కొనుగోలుని నియంత్రించడం ద్వారా రహదారులపై రద్దీని తగ్గించాలి. ట్రాఫిక్ నియమాలను త్రికరణ శుద్ధిగా అమలుపరుస్తూ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై కఠినశిక్షలతోపాటు జరిమానాలను విధించాల్సిందే. ఐరాడ్, ఐరాస్టే లాంటి ప్రపంచ బ్యాంక్ ప్రాయోజిత పథకాలను అమలు పరచడం ద్వారా రోడ్డు ప్రమాదాల డేటా బ్యాంకుని తయారుచేయాలి. ప్రమాద బాధితులకు తక్షణమే అత్యవసర వైద్య సేవలను అందించడానికవసరమైన గోల్డెన్ అవర్ పథకాన్ని మరింత ప్రచారం చేయాలి. గుడ్ సమారిటన్‌లకు ఇచ్చే బహుమతిని 5000 లనుండి 25000 లకు పెంచిన పెంపుకాగితాలకే పరిమితం కాకుండ కార్యాచరణలోకి తేవాలి. హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేలలోనే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటికి చేరువలో మల్టీ స్పెషాలిటీ సదుపాయాలున్న హాస్పిటల్స్‌ని నెలకొల్పాలి. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ కోసం పెద్ద మొత్తంలో ఆర్థిక వనరులు అవసరమున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనల ద్వారావసూలు చేస్తున్న కోట్ల రూపాయల జరిమానాల నుండి కొంత మొత్తాన్ని కేటాయించి ప్రమాదాల నివారణ పై అవగాహన కలిగించడానికి ఓ శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలి. ●

# ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిద్దాం

## - రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



**సింగరాయకొండ, జనవరి 18, ప్రభాతవార్త**

ఎన్టీఆర్ ఆశయ సాధనాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నారని రాష్ట్ర మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. శనివారం కందుకూర్ రోడ్ సెంటర్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మారి టైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామచర్ల సత్య మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి ఎన్టీఆర్ అని ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.1982 లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని మారని ఒకే ఒక కుటుంబం దామచర్ల కుటుంబమని,ఎవరికి ఏ సమస్య వచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అందరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సింగరాయకొండ మండలాన్ని సుందరంగా సిటీ లాగా అభివృద్ధి పదంలో నడిపించే విధంగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం ప్రజలుకు అల్పాహార విందును పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ చైతన్య, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు,టౌన్ అధ్యక్షులు కూనపురెడ్డి సుబ్బారావు, టీడీపీ నాయకులు చిగురుపాటి శేషగిరిరావు,సాదం బ్రహ్మయ్య, గాలి హరిబాబు,షేక్ సంధాని బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్త మద్యం షాపులకు సిద్ధం

## - సంక్రాంతికి ఎప్పుడు లేనంతా మద్యం అమ్మకాలు - ఏ జిల్లాలో ఎన్ని

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఏపీలో మరిన్ని మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు జిల్లాల వారీగా కొత్త మద్యం దుకాణాల నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధమైంది. కొత్త మద్యం పాలసీ అమలు తరువాత ఏపీలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. సంక్రాంతి వేళ మద్యం సేల్స్ కొత్త రికార్డు నెలకొల్పింది. ఏకంగా మూడు రోజుల్లో 400 కోట్ల మేర అమ్మకాలు జరిగాయి. గతంలో ఎప్పుడు లేనంతగా వినియోగం జరిగినట్లు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఏపీలో సంక్రాంతి వేళ మద్యం అమ్మకాలు భారీగా జరిగాయి. ప్రభుత్వం కొత్త మద్యం పాలసీలో భాగంగా రూ.99లకే క్వాటర్ మద్యం అందుబాటులోకి తెచ్చింది. కొత్త సంవత్సరం వేళ భారీగా మద్యం అమ్మకాలు జరిగాయని భావించగా ఇప్పుడు సంక్రాంతికి ఆ రికార్డు బ్రేక్ చేసింది. తాజాగా సంక్రాంతిని మూడు రోజుల్లో రూ.400కోట్లకు అమ్మకాలు జరిగాయి. సాధారణం కంటే రూ.160 కోట్లు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా వినియోగం ద్వారా లిక్కర్ సేల్స్ కొత్త రికార్డు నెలకొల్పాయి. ఇక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్లు గీత కార్మికులకు రాష్ట్రంలో రూ.340 మద్యం షాపులు కేటాయింపునకు రంగం సిద్ధమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కల్లుగీత ఉప కులాల వారీగా వారం రోజుల్లో వీరికి నోటిఫికేషన్ జారీ చేయనుంది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటు మద్యం షాపుల పాలసీలో 3396 షాపులకు లైసెన్స్‌లు జారీ చేశారు. అందులో 10 శాతం ఇప్పుడు గీత కులాలకు ఇవ్వనున్నారు. అలా వచ్చే 340 షాపుల్లో నాలుగు షాపులు సొండి కులానికి విడిగా కేటాయిస్తారు. గతంలో సీఎం హామీ ఇచ్చిన కుటుంబానికి ఒక షాపును కేటాయించనున్నారు. మిగిలిన 335 షాపులకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. దరఖాస్తులు తప్పనిసరిగా కులదృవీకరణ పత్రాలు సమర్పించారు. దరఖాస్తు రుసుం రూ.2లక్షలుగా ఉంది. అయితే లైసెన్స్ ఫీజులు సగం చెల్లిస్తే సరిపోతుంది. 2016 లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వేని కులాల జనాభాకు ప్రామాణికంగా ఈ దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రకాశం జిల్లాలో 18, నెల్లూరు జిల్లాలో 18, నంద్యాలలో 11, కర్నూలులో 10, ఎన్టీఆర్ జిల్లాలో 11, కృష్ణా జిల్లాలో 12, కడప 14, పల్నాడులో 13, గుంటూరులో 13, బాపట్లలో 12, కోనసీమలో 13, కాకినాడలో 16, తూర్పు గోదావరిలో13, చిత్తూరు 10, అన్నమయ్య 11, సత్యసాయిజిల్లాలో 9, అనంతపురంలో 14, తిరుపతి జిల్లాలో అత్యధికంగా 23 షాపులు పార్వతీపురం మన్యంలో 4, శ్రీకాకుళంలో 18, అనకాపల్లిలో 15, విశాఖ 14, విజయనగరం 16, ఏలూరు 14, పశ్చిమ గోదావరి జిల్లా 18 షాపులు గీత కులాలకు కేటాయించనున్నారు. ఇందు కోసం గీత కులాలను మూడు కేటగిరిలను చేశారు. ఏ కేటగిరిలో యాటా, బి కేటగిరిలో గౌడ, (ఈడిగ,గౌడ,గమళ్ళ, కలాలి,శ్రీ సాయన, సొండి, శెట్టి బలిజ)కులాలు ఉన్నాయి. ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

# చనిపోయిన వారిపై హాజరు..

## - ఉపాధిహామీకి సంబంధించిన రికార్డు మాయం
## - ఫీల్డు అసిస్టెంట్‌కు హాజరు
## - ఆశ్చర్యపోయిన పిడి జి జోసఫ్ కుమార్
## - సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెళ్ళడయిన అక్రమాలు



**కొండపి, జనవరి 18 ప్రభాతవార్త**

కొండపి మండలంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన తనిఖీలపై శనివారం కొండపిలోని మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి జోసఫ్‌కుమార్, ఉపాధిహామీ విజిలెన్స్ అధికారి పి ఝాన్సీరాణి, ఏపిడి వెంకటస్వామి, ఎంపిడి రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ ప్రజా వేదికలో సామాజిక తనిఖీ బృందం వెల్లడించిన తనిఖీలపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మండలం మొత్తం మీద ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు విరివిగా వెలుగుచూశాయి. ప్రతి పంచాయితీలో దొంగ మస్టర్లు, పనులు చేయకుండానే చేసినట్లు చూపించడం, కొలతలలో మాయ, వాలంటీర్ల బినామీ పేర్లు, ఫీల్డు అసిస్టెంట్లకు హాజర్లు, మరణించిన వారికి మస్టర్లతో గ్రామసభలో అక్రమాల చిట్టా బయటపడింది. పెద్ద పంచాయితీ అయిన కొండపిలో కోట్లాదిరూపాయల పనులు జరుగగా అందులో అక్రమాలను పిడి జోసఫ్ కుమార్ విచారించారు. మస్టర్ల వెరిఫికేషన్ చేయకుండానే బిల్లులు వేయడం ఆయన గుర్తించి ఏపిఓను మస్టర్ల గురించి విచారించగా జిల్లాలోనే మస్టర్ల తనిఖీ జరిగిందంటే ఒక కొండపిలోనే అని ఆమె పిడి బదులు సమాధానం చెప్పగా అయితే జిల్లాలో ఇంకా ఎవరు ఏపిఓలు తనిఖీలు చేయలేదనే ఆమెను పిడి ప్రశ్నించారు. అలాగే కొండపి చెరువులో చేసిన పనులను ఆయన ఆరాతీసి చెరువులో ఏవిధంగా నీటికుంటలు తీశారు అని నీకు అనుమతి ఎవరు ఇచ్చారని నీకు ఎస్టిమేషన్ వేసిన టిఏను ఆయన నిలదీశారు. అందుకు ఏపిఓ, టిఏ తెల్లమొఖం వేసుకుని సమాధానం చెప్పలేకపోయారు. అదేవిధంగా కొండపిలో ఫీల్డు అసిస్టెంటుగా పనులు చేయించిన కోర్నేలు గత మూడు ఏళ్ళుగా హాజరు వేసుకుని నిధులు స్వాహా చేయడంపై అదేవిధంగా మరణించిన వారిపై హాజరువేసి నిధులు దోచుకున్నందుకు తక్షణమే ఇతనిపై కేసు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా మరణించిన వారి పేర్లు జాబ్ కార్డుల నుంచి తొలగించారా లేదా అని ఏపిఓను ప్రశ్నించగా పొంతలేని సమాధానం చెప్పి మండలం మొత్తం మీద 82మాత్రమే తొలగించినట్లు సమాధానం చెప్పారు. ఇప్పటికీ మరణించిన దేపూరి శ్రీను, అశోక్ అనే వారిపేర్లు హాజరు వేయడం గురించి సామాజిక తనిఖీ బృందం వెల్లడించగా ఇలాంటి వారి పేర్లు ఎందుకు తొలగించలేదని హాజరు వేసినందుకు ఏపిఓపై, కంప్యూటర్ ఆపరేటర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓకు పిడి ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేటర్ జాబ్ కార్డుకోసం రూ.500లు డిమాండ్ చేస్తున్నారని సామాజిక తనిఖీలో రిపోర్టు ఇవ్వడం జరిగిందని వారు పిడి ముందు వెల్లడించారు. కొండపి చెరువులో మొత్తం పనులకు సంబంధించి 3కోట్ల 20లక్షల రూపాయలకు పనులు జరుగగా అందులో 11పనులకు ఇరిగేషన్ అనుమతి లేదని వారు తెలిపారు. ఇందులో జరిగిన పనికి రికార్డు అందించకపోవడంపై వారు పిడికి విన్నవించగా పిడి, ఏపిఓను ప్రశ్నించగా ఒకరిమీద ఒకరు చెప్పుకొని రికార్డు కనపడలేదని ఆయనకు విన్నవించారు. ఈ రికార్డులను ఈనెల 25వ తేదీలోపుగా అప్పగించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకే ఇంటిలో రెండు జాబ్ కార్డులు ఉండటాన్ని ఆయన ఏపిఓను ప్రశ్నించారు. కొండేపి మండలంలో జరిగిన అక్రమాలపై పిడి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పారదర్శకంగా విచారించి తిరిగి రికవరీ చేయడం జరుగుతుందని రికవరీ చెల్లించకపోతే వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అలాగే అవినీతికి పాల్పడిన ఎవరినైనా వదిలేది లేదని శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం

**కనిగిరి, జనవరి 18, ప్రభాతవార్త**

తెలుగుజాతి చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి గుండెల్లో ఉండే ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని కనిగిరి కొత్తూరు తెలుగుదేశం పార్టీ నాయకులు అచ్చాల రవి, తమ్మినేని సురేంద్రరెడ్డి, ఉండేలా శ్రీనివాసులురెడ్డి, భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదవాడి గుండెల్లో ఎన్టీఆర్ తీపి జ్ఞాపకమని ప్రభుత్వం అంటే పాలకులు కాదు సేవకులని చెప్పిన ఏకైక నాయకుడని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్ర అభివృద్ధితో పాటు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు మౌలిక వసతులతో శర వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు పిల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, రామకృష్ణ, మురళి, రవి, కిరణ్, మురళీ, రమేష్, బ్రహ్మాదిరెడ్డి, మురళి, డీలర్ శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల జీవితాలలో సంక్షేమ వెలుగులు నింపిన యుగ పురుషుడు ఎన్టీఆర్

**ఒంగోలు, ప్రభాతవార్త**

దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, పలువురు రాజకీయ ప్రముఖులు తెలుగుదేశం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలిఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనార్ధన్‌రావు మాట్లాడుతూ నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని, బడుగు, బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతవాది, స్త్రీలకు సాధికారితను ఇచ్చిన స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళులర్పిద్దాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో అధికారం అంటే పేదల జీవితాలు మార్చేందుకు వచ్చిన అవకాశం అని నిరూపించిన మహనీయులని ఆయన పేర్కొన్నారు. సినిమాలోనే కాదు రాజకీయాల్లో కూడా అన్న ఎన్టీఆర్ అలుపెరగని యోధుడిగా ఎన్నో రికార్డులు సృష్టించారని అన్నారు. తెలుగుదేశం స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి పార్టీని తీసుకువచ్చి అరుదైన రికార్డు సృష్టించారని ఆయన తెలిపారు. మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు కోటి సభ్యత్వాలతో ఘననివాళులర్పిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ముందుకు వెళ్తున్నామన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటిస్తూ ప్రతిపేదవాడిని అభివృద్ధిని ఆకాంక్షించిన రాజకీయ నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. రాజకీయ రంగంలో ఎన్నో సంచలనలు సృష్టించి తెలుగువారి సత్తా చూపించిన ఘనుడు ఎన్టీఆర్ అని జనార్ధన్ అన్నారు. పేదవాడికి పక్కా గృహాల పథకానికి పునాది వేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు తారక రామారావు అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో ప్రతి వర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి పేదవాడికి అన్ని సౌకర్యాలు కల్పించి ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తామని జనార్ధన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా పార్టీ కార్యాలయంలో నందు రక్తదాన శిబిరాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి అద్దంకి బస్టాండ్ నుండి ఎన్టీఆర్, పొనుగుపాటి కోటేశ్వరరావు, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 5వ డివిజన్ గోపాల్‌నగర్ వద్ద తిరుపతమ్మ గుడి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అక్కడి నుంచి తూర్పు కమ్మపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాలక్ష్మీ గుడి వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంజయ్య రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి చెన్నకేశవస్వామి లేఅవుట్‌లో గల ఎన్టీఆర్ పార్కులో గల ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడి నుంచి బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్ కింద ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు, తెలుగుతల్లి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని ఆర్టీసీ డిపో ఎదుట 60 అడుగుల రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్ నందు ఈదర హరిబాబు నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అక్కడినుండి టంగుటూరు మండలం





కందులూరు గ్రామం నందు ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలన్నింటిలో తెలుగుదేశం నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు షాక్

## - ఇక మూడు కేటగిరిలే

**ఒంగోలు, ప్రభాతవార్త**

గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సచివాలయ ఉద్యోగులలో కేవలం మూడు కేటగిరిలు ఉంటాయంటూ నిర్ణయించారు. జనాభా ఆధారంగా సిబ్బందిని సైతం సర్దుబాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లుగా ఇటీవల సమాచార శాఖ మంత్రి కే.పార్థసారధి తెలిపారు. ఇటీవల మంత్రి వర్గ భేటీలో పలు సంచళన నిర్ణయాలు తీసుకున్నట్లుగా వెల్లడించడం జరిగింది. ముఖ్యంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మూడు కేటగిరిలుగా విభజించామంటూ అది కూడా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామంటూ ఆయన తెలిపారు. ప్రస్తుతం సచివాలయంలో సగటు 11మంది చొప్పున సిబ్బంది పని చేస్తున్నారు. అందులో చాలా మందికి పని లేకుండా ఉండటం పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని చోట్ల అధిక పని ఉండటం వలన సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయని దీంతో జనాభా ఆధారంగా సచివాలయ ఉద్యోగులను విభజించి సర్దుబాటు చేస్తున్నారు. ముఖ్యంగా 3500 జనాభా ఉన్న ప్రజలు సచివాలయాలకు 8 మంది సిబ్బంది, అలాగే 2500 మంది జనాభా ఉంటే 7 మందిని అంతకంటే తక్కువ జనభా ఉంటే ఆరు మంది ఉంటారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి హెడ్‌గా మున్సిపాలిటీల్లో అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ సచివాలయాలకు హెడ్‌గా ఉంటారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15వేల గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో లక్ష 26వేల మంది సిబ్బంది పని చేస్తూ ఉన్నారు. ఈ సచివాలయాల్లో 8 మంది పని చేయాల్సిన చోట 10 నుంచి 14 మంది పని చేస్తున్నారని అధికారులకు నివేదికలో అందడంతో ఇలా కేటగిరిలను మార్చేశారు. అలా మిగిలిన సచివాలయ ఉద్యోగులను ఆయా డిపార్టుమెంట్లకు కేటాయించాలని ప్రభుత్వానికి సైతం ప్రతిపాదనలు రావడంతో అక్కడికి పంపించే ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇరిగేషన్ డిపార్టుమెంట్లలో ఏఈల కొరత ఉన్నట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అక్కడికి పంపించే ఆలోచన చేస్తున్నారు. అలాగే మిగిలిన శాఖలను కూడా సర్దుబాటు చేసే ప్రణాళికలను కూటమి ప్రభుత్వం చేస్తుంది.

# కల్లుగీత కార్మికులకు లిక్కర్ షాపులు కేటాయించాలి



**చీరాల టౌన్, జనవరి 18, ప్రభాతవార్త**

ప్రభుత్వం కల్లు గీత కులాలకు మద్యం దుకాణాలు కేటాయించినట్లు వార్తలు వస్తున్నాయని ప్రభుత్వం కేటాయించాలనుకునే మద్యం దుకాణాలు కల్లు గీత కులాలకు కాకుండా కార్మికులకు కేటాయించాలని ఏపీ గౌడ, ఇడిగా, శెట్టి బలిజ, శ్రీసైన, యుత కల్లుగీత కార్మిక సంఘం కార్యనిర్వాహక గౌరవ అధ్యక్షులు కాసాని రాము అన్నారు. శనివారం అమరావతిలో రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనితను కలిసి ప్రభుత్వం కేటాయించే మద్యం దుకాణాలు కల్లు గీత కార్మికులకు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాసాని రాము మాట్లాడుతూ ప్రభుత్వం కల్లు గీత కులాలకు మద్యం దుకాణాలు కేటాయించకుండా కార్మికులకు కేటాయించాలని కోరారు. కులాలకు మద్యం దుకాణాలు కేటాయిస్తే ఆర్థికంగా బలంగా ఉన్న వారు లబ్ది పొందుతారని కల్లు గీత కులాల్లో పేదలకు ఉపయోగం ఉండదని అన్నారు. విషయం పూర్తిగా విన్న వంగలపూడి అనిత మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని తద్వారా పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

# రిటైర్డ్ ఎంపీడీఓ బికారి వర్ధంతిలో భాగంగా పేదలకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌చే నిత్యవసర వస్తువులు పంపిణీ

**సంతనూతలపాడు, జనవరి 18, ప్రభాతవార్త**

సంతనూతలపాడులో టీడీపీ నేత రిటైర్డ్ ఎంపీడీఓ షేక్ బికారి సాహెబ్ ఆరో వర్ధంతిలో భాగంగా వారి చిన్న కుమార్తె ఎండీ హసీనాబేగం ఆధ్వర్యంలో పేద వర్గీయులకు అందించిన నిత్యవసర వస్తువులను శనివారం నాడు సంతనూతలపాడులో సంతనూతలపాడు ఎమ్మెల్యేల బీఎన్ విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. 80 మంది పేదలకు గోదుమ పిండి, నూనె ప్యాకెట్లను, ఒక పేద కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యవసర వస్తువులను దాత, సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు గౌరవ అధ్యక్షురాలు ఎంఈడీ హసీనాబేగం స్వచ్ఛందంగా అందించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంపీడీఓ బికారి సాహెబ్ చిత్రపటానికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, మాజీ ఎంపీపీ వివరం గోవిందు, నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, సంతనూతలపాడు టీడీపీ అధ్యక్షులు బొడ్డ శంకర్‌బాబు, టీడీపీ నాయకులు ఎస్.శ్రీరామ్మూర్తి, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, ఎన్.మాధవిలత, మందాడి వెంకటేశ్వర్లు, సేవా సంకల్ప్ చారిటబుల్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రటరీ చివుకుల సుబ్బయ్య, జాయింట్ సెక్రటరీ కే.వెంకటేశ్వర్లు, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు, ట్రస్టు సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, కే.జయరావు, ఏ.గోపాల్ తదితరులు పాల్గొన్నారు. రిటైర్డ్ ఎంపీడీఓ బికారి కుమార్తె హసీనాబేగం సేవలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఈ సందర్భంగా అభినందించారు.





# మొక్కలు నాటిన ఎమ్మెల్యే బిఎన్



**చీమకుర్తి, జనవరి 18, ప్రభాతవార్త**

చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 3వ శనివారంన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చింది. మున్సిపల్ ఆఫీస్ లో మొక్కలు నాటిన ఎమ్మెల్యే, తెలుగుదేశం నాయకులు రోడ్డును చీపుర్లు చేబూని, పరిశుభ్రం చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి ఇక్కడకు విచ్చేసిన ఎమ్మెల్యే బి. ఎన్. విజయ్ కుమార్ ను కమిషనర్ వై రామకృష్ణయ్య పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. తెలుగుదేశం కు చెందిన 12,13 వార్డు కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజనీ దేవిలు, తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, నాయకులు మన్నం ప్రసాదరావు, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమల్ల గంగాధర్, పూనాటి వెంకట్రావు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. గైర్హాజరైన చైర్ పర్సన్, కౌన్సిలర్లు : చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బియన్ విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కాగా మున్సిపల్ చైర్ పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, ఇద్దరు వైస్ చైర్మన్లు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 మంది కౌన్సిలర్లు ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు.



# విద్యార్థులు లేరంటూ హాస్టల్ మూసివేతకు యత్నం

## - రహస్యంగా హాస్టల్ సామాగ్రి తరలింపుకు యత్నం - స్థానికులు అడ్డుకోవడంతో సామాగ్రి తరలింపు నిలిపివేత

**పొన్నలూరు, జనవరి 18, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పొన్నలూరు 2015 సంవత్సరంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల మండలాల నుంచి కూడా హాస్టల్లోచేరి స్థానిక ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చదువుకునే వారు. హాస్టల్ ఏర్పాటు చేసిన ప్రారంభంలో సిబ్బంది చొరువతో విద్యార్థుల సంఖ్య భాగానే ఉన్నా, వసతి గృహం అద్దె భవనం కావడం, సరియన వసతులు లేక క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. అయితే ఈవిద్యా సంవత్సరం మొదటి మూడు నెలల హాస్టల్ నిర్వహించినప్పటికి అధికారులు నిర్లక్ష్యంతో హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో పీసీపల్లి వార్డెన్ ఇన్‌ఛార్జీగా ఉండటంతో హాస్టల్ పై సరిగా దృష్టి పెట్టకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో హాస్టల్లో ఇటీవల పూర్తిగా మూసివేశారు. ఉన్నతాధికారులు ఆదేశాలు పూర్తి స్థాయిలో లేనప్పటికి సిబ్బంది అత్యుత్సాహంతో హాస్టల్ సామాగ్రిని శనివారం నాడు రహస్యంగా తరలించడానికి ప్రయత్నించగా స్థానికులు అడ్డుకొని ఇన్‌ఛార్జీ వార్డెన్ గువ్వల సురేందర్‌రెడ్డి తో ఫోన్లో మాట్లాడగా సురేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి వారి ఆదేశాలతో ఆటోలో తరలించడానికి సిద్ధం చేసిన వంట సామాన్లను, ఇతర సామాగ్రిని మరలా హాస్టల్లో పెట్టించారు. ప్రభాతవార్త ప్రతినిధితో ఇన్‌ఛార్జీ వార్డెన్ సుందర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని అన్నారు.



## శింగరకొండపాలెం గ్రామంలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి




**అద్దంకి , జనవరి 18 , ప్రభాతవార్త**

అద్దంకి మండలం సింగరకొండ పాలెంలో శనివారం రాష్ట్ర విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. ముందుగా తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటిన విశ్వ విఖ్యాత నట సార్వభౌమ, తెలుగు ప్రజల ఆరాధ్యదైవం. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్బంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం శింగరకొండ పాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల రక్షిత శుద్ధి కేంద్రాన్ని మరియు ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించిన నూతన సిసి రోడ్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కారణజన్ముడు అన్న ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమం

**అద్దంకి , జనవరి 18 , ప్రభాతవార్త**



ఉత్తర అద్దంకి కాకానిపాలెం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం ఉదయం 10గంటలకు ఎన్టీఆర్ విగ్రహానికి మహిళలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. బాపట్ల పార్లమెంటు పార్టీ ఉపాధ్యక్షులు నాగినేని రామకృష్ణ మాట్లాడుతూ తన నిజ జీవితంలో పడిన కష్టాలు తన సినీ, రాజకీయ జీవితంలో అంకిత భావంతో సేవలు, ప్రజా స్వామ్య బద్దంగా న్యాయబద్దమైన పాలన అందించి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని అయన అన్నారు. అద్దంకి మాజీ జడ్‌పిటిసి, మాజీ సర్పంచ్ సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టుదల, కృషి, అంకితభావం ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్‌ను చూసి నేర్చుకోవాలని వారి చరిత్ర భావితరాలకు పునాదిరాళ్లని అందుకే ఈయన కారణజన్ముడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు సింగు సుబ్బాయమ్మ, మాజీ సర్పంచ్ పొడపాటి విజయలక్ష్మి, కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ, కంప రజని, షేక్ జహీరా, లహరి, అత్తులూరి రమేష్, చిన్ని శ్రీనివాసరావు, కాకాని ఆశోక్, కాకాని శ్రీనివాసరావు, మురకొండ శ్రీధర్, వడ్డవల్లి పూర్ణ, షేక్ ఖాసిం, రహిం, రహిమాన్, నర్రా శ్రీను, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 29వ వర్ధంతి

### – అన్నదానం, రక్తదానం నిర్వహించిన కొరిశపాడు మండల టీడీపి నాయకులు




**కొరిశపాడు , జనవరి 18 , ప్రభాతవార్త**

దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని మేదరమెట్ల గ్రామం టిడిపి నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ నాభిశిల వద్ద ఉదయం 9గంటలకు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ పేద ప్రజలకై కెజి రెండు రూపాయలకే బియ్యం వంటి పలు సంక్షేమ పథకాల గురించి ఉమ్మడి రాష్ట్ర రైతులను పీడించే కరణం మున్సబ్బుల వ్యవస్థను రద్దు చేసి రైతులు చేసిన ప్రయోజన గురించి ప్రసంగించారు. అనంతరం టిడిపి కార్యకర్తలు ఒంగోలు రిమ్స్ వైద్యుల పర్యవేక్షణలో రక్తదానం కార్యక్రమాన్ని చేపట్టి 50పైగా యునిట్ల రక్తాన్ని దానం చేశారు. సుమారు మూడు వేలకు పైగా ప్రజలకు అన్నదానాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు జాగర్లమూడి జయకృష్ణ, టిడిపి నాయకులు శ్రీనివాసరావు, రాజేష్ బ్రహ్మయ్య, కర్నాటి పూర్ణచంద్రరావు, చెన్నుపాటి హరిబాబు, నేరెళ్ళ పెద్ద వెంకటేశ్వర్లు, హనుమంతరావు, మండలంలోని అన్నీ గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికలాంగులకి స్కూటీ వాహనాల పంపిణీకి మంత్రి గొట్టిపాటి చొరవ

**అద్దంకి , జనవరి 18 , ప్రభాతవార్త**



అద్దంకి నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వికలాంగులకు – 4చక్రాల స్కూటీ వాహనాలను అందించాలని ఐజిసిఎల్ యాజమాన్యాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరగా వారు సానుకూలంగా స్పందించిన ఐజిసిఎల్ సంస్థ శనివారం అద్దంకి పట్టణంలోని పోతురాజు గండిలోగల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లబ్దిదారుల ధృవపత్రాలను పరిశీలించి ముఖాముఖ నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో వీలైనంత త్వరంలో లబ్దిదారులకు మోటారు వాహనాలను పంపిణీ చేయడం జరుగుతుందని వికలాంగుల ఉజ్వలమైన , మరింత సమగ్రమైన భవిష్యత్తు కు తోడ్పాటును అందించడంలో ముందు వరుసలో ఉంటాయని, ఆలాగే మంత్రి గొట్టిపాటి రవికుమార్ అదేశాలతో నియోజకవర్గ పరిధిలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టెందుకు సమ్మతంగా ఉన్నాయని అన్నారు.

## మేదరమెట్లలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్

**కొరిశపాడు , జనవరి 18 , ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి మూడో శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మేదరమెట్ల గ్రామంలో శనివారం ఉదయం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొరిశపాడు ఎంపిడిఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రామన్ని చేపట్టిందన్నారు. మంచి ఆలోచనలు ప్రజలు వారి పరిశుభ్రత కాకుండా స్వచ్ఛమైన వాతావరణం పని చేసే చోట పరిశుభ్రంగా ఉంటే రాష్ట్రం ఆరోగ్యవంతంగా వుండే అభివృద్ధి కనుక గ్రామ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు గ్రామాన్ని పరిశుభ్రంగా వుండేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, పంచాయతీ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ

### – ఆవిర్భావం చేసిన ఎన్టీఆర్

**జె.పంగులూరు , జనవరి 18 , ప్రభాతవార్త**




బ్రిటిష్ వారి అరాచకాలతో పోరాడి సాధించిన స్వతంత్రాన్ని కాంగ్రెస్ పార్టీ వాళ్ళ కుచిత రాజకీయాలతో అల్లాడుతున్న నిరుపేద ప్రజలకు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆశ జ్యోతి లాగా ఆదరణ పొందిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని జాగర్లమూడి వారిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవసా ధపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి నేటి వరకు ఎన్నో ఒడిదుడుకులతో నిరుపేద పేద ప్రజల ఆశేష ఆదరణతో ఆఖండ విజయాలు సాధించింది అన్నారు. కూటమి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి నిరుపేద లకు మరింత చేరువైందన్నారు. డ్వాక్రా పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని, ఎదుగుదలకు తొడ్పాటు అందించిందన్నారు. ఏపిని పారిశ్రామికంగా అభివృద్ధి పరచి అనేక మంది యువతీ, యువకులకు ఉద్యోగ కల్పన అందించాలని కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులుమండల,గ్రామనాయకులు పాల్గొన్నిఎన్టీఆర్‌కి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

**బల్లికురవ, జనవరి 18, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, తెలుగు జాతీ కీర్తి చంద్రికలను జగద్వితం చేసిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలు పల్లెలో పండుగ వాతావరణంలో జరిగాయి . శనివారం వేకువ జాము నుండి ఎన్టీఆర్‌విగ్రహాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. మండల కేంద్రమైన బల్లికురవలో అన్న నందమూరి తారక రామారావుకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్బంగా సీనియర్ నాయకులు, క్లష్టర్ ఇన్‌ఛార్జ్ మల్లినీడి గోవిందరావు మాట్లాడుతూ తెలుగు నేలపై ఆత్మ గౌరవ నినాదం, తెలుగు పౌరుషం ప్రపంచానికి చాటి, తెలుగుదేశం పార్టీ స్థాపించడం, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం ద్వారా చరిత్ర సృష్టించారన్నారు. భారతదేశంలోనే సంక్షేమ యుగానికి ఆద్యం పోసి, బడుగు, బలహీన వర్గాల వారికి చట్టసభలలో సముచిత గౌరవం కల్పించిన ఘన ఎన్టీఆర్ సొంతం అన్నారు. ఆడపడుచులకు సమాన ఆస్తి హక్కు, మహిళలకు ఉద్యోగాలలో సమాన అర్హత కల్పించి ప్రతి తెలుగింటి ఆడపడుచుకు అన్నగా ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారు అన్నారు. ఈసందర్బంగా ఎన్టీఆర్ గొట్టిపాటి విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిపాటి లక్ష్మయ్య, తెలుగు యువత అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతరావు, తెలుగు రైతు అధ్యక్షుడు దద్దాల అంజయ్య, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, కోయి పేరయ్య, పావులూరి ఏడుకొండలు, మలినీడి మహేష్‌బాబు, దద్దాల విజయ్, కందుల సాంబయ్య, చల్లగుండ్ల వీరాంజనేయులు, ఇన్నమూరి ఉమామహేశ్వరరావు, పత్తిపాటి వెంకటరావు, చింతల అమర్నాథ్, మందలపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.

## పారిశుధ్యం ద్వారా సమస్యలను పారద్రోలవచ్చు

**బల్లికురవ, జనవరి 18, ప్రభాతవార్త**



గ్రామీణ ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రమాదకర వ్యాధులు ధరిచేరకుండా పారద్రోలవచ్చని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని వల్లాపల్లి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్బంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, చింతల రామారావు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## మహానుభావుడు స్వర్గీయ ఎన్టీఆర్ సేవలు మరువలేనివి

### – ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర

### – పెద్దదోర్నాలలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

**పెద్దదోర్నాల, జనవరి 18, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు చేపట్టిన సంస్కరణలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు ప్రతి ఒక్కరి హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచిపోయాయని, అటువంటి మహానుభావుల జీవితాలు ఆదర్శనీయమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర కొనియాడారు. పెద్దదోర్నాల ఇండియన్ పెట్రోల్ బంక్ ఆవరణలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ టెక్నాలజీ సర్వీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర మాట్లాడుతూ తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడని, ఆయన చేపట్టిన సంస్కరణలతో బడుగు, బలహీన వర్గాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరుచుటకు దోహదపడ్డాయి అన్నారు. తెలుగుపౌరుషం ఎన్టీఆర్ అని తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచం నలు దిశల చాటి చెప్పిన ఘనత ఎన్టీఆర్‌కి దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ త్రిసభ్య కమిటీ మాజీ సభ్యులు, పెద్దదోర్నాల మాజీ మండల కన్వీనర్ అంబటి వీరారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి.లక్ష్మయ్య, టీడీపీ నాయకులు రావిక్రింది నరసింహారావు, రమణారెడ్డి, టీడీపీ మైనార్టీ నియోజకవర్గ నాయకులు షేక్ జిలాని, షేక్ జాకీర్, షేక్ కాశీం భాష తెలుగు యువత నాయకులు డి.సుధీర్‌బాబు(చంటి), పలువురు నాయకులు పాల్గొన్నారు.

## టీడీపి నాయకులను పరామర్శించిన డాక్టర్ మన్నె రవీంద్ర

**పెద్దదోర్నాల, జనవరి 18, ప్రభాతవార్త**



పెద్దదోర్నాల మండలంలో ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న ఎడవల్లి గ్రామానికి చెందిన ఎర్రబాలెం కుమార్, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి రావిక్రింది సుబ్బరత్నంలను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర శనివారం వారి గృహాలను సందర్శించి పరామర్శించారు. డాక్టర్ మన్నె రవీంద్రతో పాటు టీడీపీ నాయకులు షేక్ జిలాని, రమణారెడ్డి, జడి లక్ష్మయ్య, షేక్ జాకీర్, షేక్ కాశీంభాష, తెలుగు యువత నాయకుడు దర్శనం సుధీర్‌బాబు(చంటి), ఎర్రబాలెం రమేష్, మాజీ సర్పంచ్ తెల్లమేకల పాలంకయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పోటాపోటీగా జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి

**యర్రగొండపాలెం రూరల్, జనవరి 18 ప్రభాతవార్త**



గత కొన్నేళ్ళ నుంచి యర్రగొండపాలెం తెలుగుదేశంపార్టీలో గ్రూపుల కుంపటి రగులుతున్న విషయం విధితమే. తెలుగుదేశంపార్టీకి సంబంధించిన పలు కార్యక్రమాలపై పెద్ద ఎత్తున రాజకీయం నడిపిస్తున్న విషయం విధితమే. అటు టిడిపి ఎరిక్షన్ బాబు వర్గం, ఇటు టిడిపి రవీంద్ర వర్గం గత కొన్నేళ్ళ నుంచి పోటాపోటీగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ వార్తలకెక్కుతూ రచ్చ జరుగుతున్న విషయం కూడా జగమెరిగిన సత్యమే. అయితే ఇదే క్రమంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగి ఇరువర్గాలు పోటాపోటీగా అధిష్టానానికి వందల వాహనాలతో ఇక్కడి ఇన్చార్జిలను మార్చాలంటూ ఫిర్యాదులు సైతం చేసుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని రెండు గ్రూపులవారు ఎవరికివారు తమ వర్గాలతో కలిసి వేర్వేరుగా వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు.

**ఇరువర్గాల శ్రేణులతో వేర్వేరుగా వర్ధంతి కార్యక్రమం :**



తెలుగుదేశం పార్టీని స్థాపించి ఢిల్లీ స్థాయిలో తెలుగువారి సత్తాను చూపించిన నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్బంగా యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆ పార్టీ శ్రేణులతో పట్టణంలోని త్రిపురాంతకం సెంటర్‌లోని విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా ప్రముఖ వైద్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు మన్నె రవీంద్ర తన అనుచరులతో వర్ధంతి కార్యమ్రంలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా మన్నె రవీంద్ర మాట్లాడుతూ ఎన్టీఆర్ పాలన స్వర్ణయుగాన్ని తలపించిందని, ఆయన ప్రవేశపెట్టిన పలు పేదల పథకాలు ఇంకా అమలు జరుగుతున్నాయంటే అది ఆయన గొప్పతనమని కొనియాడారు. తెలుగువారికోసం ఆయన చేసిన సేవలు మరిచిపోలేనివని తెలిపారు. ఈ సందర్బంగా పార్టీ కార్యకర్తలు జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వారిద్దరితోపాటు ఇరువర్గాలకు చెందిన పార్టీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, మాగులూరి వెంకటేశ్వర్లు, షేక్ జిలాని, పోతిరెడ్డి రమణారెడ్డి, మేకల బాదరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దదోర్నాలలో ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

**పెద్దదోర్నాల, జనవరి 18, ప్రభాతవార్త**



పెద్దదోర్నాల మండల టీడీపీ కన్వీనర్ ఏరువ మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఎదురు ఎన్టీఆర్ విగ్రహం ముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, షేక్ మహబూబ్ భాష, వల్లభనేని కాశయ్య, జనసేన మండల కన్వీనర్ కేతి మురళి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

**త్రిపురాంతకం, జనవరి 18 ప్రభాతవార్త**



టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతిని మండలంలో అన్ని గ్రామాలలో టిడిపి శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మాజీ ఎంపిపి నాసరరెడ్డి విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలు నేటికీ ప్రజలు మరువలేనివని ఆ మహనీయుని గురించి ఎంత పొగిడినా తనివితీరనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసి ఉపాధ్యక్షుడు పి గురువారెడ్డి, మండల తెలుగుయువత అధ్యక్షులు వి అంకారావు, ఊట్ల వెంకటేశ్వర్లు, జనసేనా మల్లిఖార్జున, రాయుడు, వెంకటేశ్వరరెడ్డి, నాసరరెడ్డి, వై కోటయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు

**పెద్దారవీడు, జనవరి 18 ప్రభాతవార్త**



మండల కేంద్రం పెద్దారవీడు గ్రామంలో శనివారం మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలు పెద్దారవీడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొట్టం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆ మహాపురుషుడికి కోటికి పైచిలుకు పార్టీ సభ్యత్వాల నమోదుతో ఘనంగా నివాళులర్పించడం జరిగిందని తెలిపారు. అట్టడుగు బలహీన వర్గాలకు, రాజకీయాలకు పరిచయం చేసిన మహానేత నందమూరి తారక రామారావు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని టిడిపి నాయకులు గొట్టం రామాంజనేయ రెడ్డి, గొట్టం రవికుమార్ రెడ్డి, బొచ్చు వెంకటేశ్వరరెడ్డి, పొందుగుల వెంకటేశ్వరరెడ్డి, కొలగట్ల శివారెడ్డి, గాజులపల్లి శ్రీను, కొలిపర సాయి, కొలిపెర మల్లిఖార్జున, వేశాపోగు ఆదాము, వేశాపోగు పెద్దన్న, బత్తుల ఎల్లయ్య, మూడమంచు పెద్ద వెంకటేశ్వర్లు, చల్లా ఆది, బి శివ, వాయిరి రామకృష్ణ, పెద్ద వెంకటేశ్వర్లు, సాల్మన్ రాజు, రామయ్య, జయరావు, గాలెయ్య, ప్రకాశం మరియు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కాపురంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు...

### – వాహన చోదకులకు ఐ చెకప్ క్యాంపు

**మార్కాపురం రూరల్, జనవరి 18 ప్రభాతవార్త**



మండల కేంద్రం మార్కాపురం పట్టణంలోని స్థానిక ప్రాంతీయ రవాణా శాఖాధికారి కార్యాలయం ప్రాంగాణం నందు శనివారం రహదారి భద్రత మాసం సందర్బంగా ఆటో, లారీ తదితర లైసెన్స్‌లకు వచ్చిన వారందరికీ ఐ చెకప్ క్యాంపు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు వాహన తనిఖీ ధికారి మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంతీయ రవాణాశాఖాధికారి బి అమర్ నాయక్ మాట్లాడుతూ వాహన డ్రైవర్లు అందరూ ఆరోగ్యపరంగా ఉండటానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రహదారి భద్రత నియమాలను పాటిస్తూ వాహనాలు నడపాలని, వాహన యజమానులకు మరియు డ్రైవర్ల అందరికీ పాటించవలసిన జాగ్రత్తలు తెలియపరచడం జరిగిందన్నారు. రహదారి భద్రత మాసోత్సవం జనవరి నెల 16వ తేదీ నుండి ఫిబ్రవరి నెల 15వ తేదీ వరకు జరుగుతుందన్నారు. వాహన తనిఖీ అధికారి మాధవరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం వాహనం చోదకులు మరియు వాహన ఓనర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ క్యాంపు నందు వందమంది వరకు డ్రైవర్లు మరియు ఓనర్లు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఇటీవల జనాభా పెరగడం, వాహనాలు పెరగడం, రద్దీ విపరీతంగా పెరగడం, అతివేగంగా వాహనాలు నడపడం లాంటి అనేక కారణాలు నిత్యం ప్రమాదాలు పెరగడానికి కారణమని, అందుచేత వాహనదారులకు అవగాహన కల్పించి తగు జాగ్రతలు తీసుకునే విధంగా చేయడం, ప్రమాదాలను తగ్గించడం కోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వాహనదారుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని పొరబాటున ప్రమాదం జరిగితే ప్రాణాలు నిలబెట్టుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిచరణ్ తేజ్, మాట్లాడుతూ వాహనాలు నడుపువారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి మరియు ఆరోగ్యంతో ఎలా ఉండాలి అనే దానిమీద ఉదాహరణలతో పలు విషయాలు వివరించారు. ఎం అంజి కళ్ళ పరీక్షలు, సురభి మహేష్ కుమార్, ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దూపాడు పంచాయితీలో ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ ప్రారంభం

**త్రిపురాంతకం, జనవరి 18 ,ప్రభాతవార్త**



దూపాడు గ్రామ పంచాయితీ పరిధిలో ఆపివేసిన ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎనిబేరా అనూష ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. డిపిఓ మరియు డిఎల్‌పిఓ, మండల ఎంపిడిఓ రాజ్ కుమార్, ఏపిఓ సుజాతల ఆదేశాల మేరకుపంచాయితీలో ఆపివేసిన ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌నుఆళ్ళనాసర్ రెడ్డి సహకారంతో పునః ప్రారంభించారు. దూపాడు గ్రామ పంచాయితీని సర్పంచ్ ఎనిబేర అనూష అభివృద్ధి పథం వైపుకు నడిపిస్తున్నారని గ్రామ ప్రజలు కొనియాడారు. ఆపివేసిన ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను తిరిగి ప్రారంభించడంపట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## మండల విఆర్ఓ సంఘం అధ్యక్షులుగా మారంరెడ్డి చలమారెడ్డి

**మార్కాపురం రూరల్, జనవరి 18 ప్రభాతవార్త**



మార్కాపురం మండల విఆర్వోల సంఘం అధ్యక్షులుగా మారంరెడ్డి చలమారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రం మార్కాపురం తహశిల్దార్ కార్యాలయంలో శనివారం మండల గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా విఆర్వోల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విఆర్వోల సంఘం మండల అధ్యక్షులుగా మారంరెడ్డి చలమారెడ్డి, ఉపాధ్యక్షులుగా సౌజన్య, నల్లబోతుల మహాలక్ష్మిలు, కార్యదర్శిగా షేక్ మహబూబ్ బాష, ఉపకార్యదర్శులుగా పాటిపండ్ల మల్లేశ్వరి, బత్తుల సుజాతలు, కోశాధికారిగా వి రామకోటేశ్వరరావు, ఉపకోశాధికారిగా కెవి రమణారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా భీమవరం గణేష్, వై ప్రశాంతి, కె హేమలత, షేక్ మాబువలి, ఎం సుబ్బయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌కు సంకల్పిద్దాం

### – ఎంపీడీఓ జ్యోతిర్మయి పిలుపు

**సంతమాగులూరు, జనవరి 18, ప్రభాతవార్త**



మన ఇళ్లు, చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోగలిగితే స్వచ్ఛ ఆంధ్రాతో పాటు స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందని, ఆ దిశగా ప్రజలు అందరూ చైతన్యవంతులు కావాలని ఎంపీడీఓ జ్యోతిర్మయి పిలుపునిచ్చారు. ప్రతి నెల3వ శనివారం స్వచ్ఛత దినోత్సవం సందర్భంగా సంతమాగులూరు మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సంతమాగులూరు, పాతమాగులూరు, కామేపల్లి, సజ్జాపురం, కొప్పరం, అడవిపాలెం, వెల్లలచెరువు, పుట్టావారిపాలెం తదితర గ్రామ పంచాయతీల్లోని ఫ్లెక్సీలు, ప్లకార్డులను చేతబూని ర్యాలీ చేశారు. అనంతరం రోడ్డు పక్కనే ఉన్న వ్యర్థాలను, సైడు కాలువల్లో పూడిక తీత వంటి పనులను కార్మికులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## మార్కాపురం పట్టణ బిజెపి అధ్యక్షులుగా పాదర్తి ఆంజనేయులు

**మార్కాపురం రూరల్, జనవరి 18 ప్రభాతవార్త**



మండల కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని స్థానిక దోర్నాల బస్టాండ్ సమీపంలోగల భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో శనివారం మార్కాపురం మండల ఎన్నికల పరిశీలకులు బొచ్చు మల్లారెడ్డి ఆధ్వర్యంలో పట్టణ బిజెపి అధ్యక్షులుగా పాదర్తి ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాదర్తి ఆంజనేయులు మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో భారతీయ జనతాపార్టీని బూత్ స్థాయిలో తీసుకువెళ్ళి బలోపేతం చేయడానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి పివి కృష్ణారావు, కిసాన్ మోర్చా అధ్యక్షులు బొంతల కృష్ణ, జిల్లా కార్యదర్శి చిన్నయ్య, చక్రి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ చేపట్టిన పథకాలు ప్రజలు మరువలేనివి

## – వర్ధంతి వేడుకలో మండల టీడీపి అధ్యక్షులు సోరెడ్డి మోహన్ రెడ్డి



**బేస్తవారిపేట, జనవరి 18, ప్రభాతవార్త**
మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు బేస్తవారిపేట మండల టిడిపి అధ్యక్షులు సోరెడ్డి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేస్తవారిపేట బస్టాండ్ సెంటర్‌లో స్వర్గీయ ఎన్టి రామారావు చిత్రపటానికి మండలంలోని పలువురు టిడిపి నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి అధ్యక్షులు సోరెడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ నందమూరి తారక రామారావు నట సార్వభౌముడు, తెలుగుదేశంపార్టీ స్థాపించిన 8నెలలకే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఆయనదని కొనియాడారు. ఎన్టిరామారావు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం, ఇళ్ళులేని పేదలకు ఎన్టిఆర్ గృహాలు, వృద్దులకు పెన్షన్లు, పటేల్ పట్వారి వ్యవస్థపై ఉక్కుపాదం మోపిన నాయకుడు అన్నారు. రైతులకు భూమి శిస్తు నుండి విముక్తి కలిగించిన ఏకైక ముఖ్యమంత్రి అని, పురుషులతోపాటు మహిళలలకు సమాన హక్కులు కలిగి ఉండేలా జీవో తీసుకొచ్చిన మహనీయుడు అని కొనియాడారు. మహిళా సంఘాలకు రుణాలతోపాటు సంక్షేమ పథకాలు చట్టసభల్లో అధికారాలు తీసుకువచ్చిన నాయకుడు అని కొనియాడారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణంలో మధ్యాహ్నం దాదాపు 2వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేబికె పురం ఎంపిటిసి పూనూరు భూపాల్ రెడ్డి, బేస్తవారిపేట పట్టణ అధ్యక్షులు దూదేకుల ఖాశింపీరా సైదులు, బేస్తవరాణిపేట మండల ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, క్లస్టర్ ఇన్చార్జి ముప్పూరి రాము, బళ్ళారి సుబ్బరత్నం, సత్వేలి కృష్ణయాదవ్, బుద్దుల ప్రేమానంద్, మన్యాలు సుబ్రమణ్యం, దూదేకుల ఆదాం, పందిళ్ళపల్లె టిడిపి నాయకులు ఆవుల చిన్న శ్రీనివాసరెడ్డి, బిసు అరుణ్ కుమార్, అవ్వారి రామకృష్ణ, సందు రమేష్, జి అనిత, దూదేకుల నాగూర్, ఎం అనీల్, బి శంకర్ యాదవ్, కొరముట్ల శ్రీను, ఆకుల కొండలు, ఆకుల శ్రీను, వార్డు సభ్యులు దూదేకుల శివ, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ అంటే పేరు కాదు తెలుగువారి ఆత్మగౌరవం

## – ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు, జనవరి 18 ప్రభాతవార్త**
ఎన్టీఆర్ అంటే పేరు కాదు తెలుగువారి ఆత్మగౌరవమని, సామాజిక స్పృహ కలిగిన యువతను రాజకీయాల్లోకి తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గిద్దలూరు పట్టణంలోని శ్రీ విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. జోహార్ అన్న ఎన్టీఆర్ అని నినాదాలతో మహనీయుడిని స్మరించుకున్న అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన సామాజిక ఉద్యమ నిర్మాత ఎన్టీఆర్ అని, సామాజిక స్పృహ కలిగి యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చి నిజాయితీగల నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఎన్టిఆర్‌కే దక్కుతుందని కొనియాడారు.

**లెజండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌లో 206 మంది రక్తదానం :**
తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వరనయంలో మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది సహకారంతో శనివారం లెజండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరుమండలాలకు చెందిన టిడిపి, జనసేనా, బిజేపి, నందమూరి అభిమానులు 206మంది రక్తదానం ఏచసినట్లు వైద్యులు తెలిపారు. రక్తదానం చేసిన ప్రతిఒక్కరిని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేనా ఇన్చార్జి బెల్లంకొండ సాయిబాబు, బిజేపి నాయకులు జేవి నారాయణ, మండలపార్టీ అధ్యక్షులు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సబ్సిడీ యంత్ర పరికరాలను పరిశీలించిన ఏడిఏ వెంకటరమణ



**బేస్తవారిపేట, జనవరి 18, ప్రభాతవార్త**
మండలంలోని పలు గ్రామాలలో 14రైతు సేవా కేంద్రాలలో గతంలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపులకు సబ్సిడీపై ఇచ్చిన యంత్ర పరికరాలను కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ వెంకటరమణ శనివారం పరిశీలించారు. మండలంలోని కోనపల్లి, గలిజెరుగుళ్ళ, అక్కపల్లి, జనిపెల్లి, ఎంపిదెరువు, పిటికాయగుళ్ళ, జేసి అగ్రహారం, నేకునాంబాద్, సలకలవీడు, పూసలపాడు, చెట్టిచెర్ల, సోమవారిపేట, పెద్ద ఓబినేనిపల్లె గ్రామాల్లో గతంలో అందించిన పరికరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాటి పూర్తిధర వివరాలు, రుణం కట్టిన వివరాల గురించి సంబంధిత గ్రూపు సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బందిని గ్రూపులకు సంబంధించిన రికార్డులను ఎలా రాస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే యంత్ర పరికరాల వినియోగం, ప్రయోజనాల గురించి గ్రూపు ద్వారా సబ్సిడీపై పొందిన యంత్రాల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ఎన్నిట సర్వీస్ చేయలని అలా వచ్చిన ఆదాయంతో లోను నగదు చెల్లించుకుంటూ మిగిలిన నగదును పొదుపు చేసుకోవాలని గ్రూపు సభ్యులకు తెలియజేశారు. స్థానిక వ్యవసాయ శాఖాధికారికి ఇక్కడ మెర్సీ మాట్లాడుతూ కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపులకు 40శాతం రాయితీపై యంత్ర పరికరాలు సరఫరా చేయడం జరిగిందని 10శాతం గ్రూపు వారు చెల్లించారని మిగిలిన 50శాతం నగదును పిడిసిసి బ్యాంకు వారు రుణరూపంలో మంజూరు చేశారని తెలిపారు. గ్రూపు సభ్యులు తప్పనిసరిగా బ్యాంకు వారు నిర్దేశించిన వాయిదాల ప్రకారం నగదును చెల్లించాలని తద్వారా భవిష్యత్‌లో కూడా ఈ గ్రూపులకు బ్యాంకు వారు మరింత రుణ సదుపాయం కల్పించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఈఓ డి నాయక్ రసూల్ మరియు సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బంది, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి ప్రతిరూపం ఎన్టీఆర్

## – మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య



**కొండపి, జనవరి 18 ,ప్రభాతవార్త**
మన రాష్ట్రంలో సంక్షేమానికి ప్రతిరూపం ఎన్టి రామారావు అని తేదేపా మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య అన్నారు. శనివారం ఎన్టిఆర్ 29వ వర్ధంతి వేడుకలు కొండపిలో ఘనంగా నిర్వహించారు. ముందుగాఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామచర్ల సత్య మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళుగా భావించిన వారు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ ఎన్టీరామారావు అని అన్నారు. ప్రతి పేదవాడికి ఆశాజ్యోతిగా వెలిగిన వ్యక్తి అని ఆయన అన్నారు. ఎన్టిఆర్ ఆ రోజుల్లోనే ప్రతి పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అనే నినాదాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి చైర్మన్ జి రామయ్య చౌదరి, స్టేట్ మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయపాటి సీతమ్మ, మండలపార్టీ అధ్యక్షులు బొడ్డపాటి యలమందనాయుడు, నరసారెడ్డి, మాజీ ఎంపిపి డైరెక్టర్లు కృష్ణారెడ్డి, టిఎన్‌ఎస్ నాయకులు బత్తుల నారాయణ స్వామి, తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఖాయిషా, తెలుగు మహిళ మండలాధ్యక్షురాలు బొడ్డపాటి ప్రసన్న లక్ష్మి, గ్రామ నాయకులు బూదపాటి సోమయ్య, నన్నూరి సుబ్బారామయ్య, ముక్కు ప్రసాదు, దేవూరి సుబ్బారావు, మండలంలోని తెదేపా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి తాలూకా యూనిట్ ఏపీ ఎన్జీవో నూతన కార్యవర్గం ఏర్పాటు



**కొనకనమిట్ల, జనవరి 18, ప్రభాతవార్త**
పొదిలి తాలూకా ఏపీఎన్‌జీజీఓ నూతన కార్యవర్గం పొదిలి కార్యాలయంలో శనివారం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. అధ్యక్షులుగా ఎల్. శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఎస్‌కె సంధాని భాష, కోశాధికారి జి.వెంకటరావు, సహాధ్యక్షులు ఎస్‌కె అబ్బుల్, రహీమాన్, ఉపాధ్యక్షులు ఎస్‌కె కరిముల్లా, ఎస్‌కె అబ్బుల్ అలీఫ్, కే.విజయ, సంయుక్త కార్యదర్శులుగా పి.కళా ప్రపుల్ల, ఎస్‌కె ఈసుఫ్, జే.వెంకటేశ్వర్లు, పి.విజయకుమార్, స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా రవికుమార్, డీఈసీ మెంబర్‌గా కే.రమావేదేశిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌బాబు, కృష్ణారెడ్డి, కోఆప్షన్ పరిశీలకులు ఎం.వెంకటేశ్వరరావుల సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది.

# కేంద్ర మంత్రి అమిత్‌షాను విమర్శించే స్థాయి మీదికాదు

## – బిజేపి గిద్దలూరు పట్టణ అధ్యక్షులు ఉదయ శంకర్



**గిద్దలూరు రూరల్, జనవరి 18, ప్రభాతవార్త**
కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కాంగ్రేస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శించడం కరెక్ట్ కాదని ఈ రాష్ట్రానికి కాంగ్రేస్ చేసిందేమీ లేదని బిజేపి నాయకులను విమర్శించే అర్హత మీకు కానీ, మీ జాతీయ నాయత్వానికి కానీ లేదని మీ స్థాయిని మరచి విమర్శించడం మానుకోవాలని వైఎస్ షర్మిలను కోరుతున్నట్లు బిజేపి పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయశంకర్ అన్నారు. అంతేకాకుండా ఈ రాష్ట్రానికి రెండు లక్షల కోట్ల అభివృద్ధి నిధులను మంజూరు చేసిన ఘనత భారతీయ జనతాపార్టీది అని, విశాఖ ఉక్కు అభివృద్ధికి 1140కోట్లు కేటాయించి ఈ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి బిజేపి పార్టీ నిరూపించిందని అన్నారు. కర్ణాటకలో మీ సూపర్ సిక్స్ ఫెయిల్యూర్, తెలంగాణ కూడా సూర్ సిక్స్ అమలు చేయలేక పోయారని మీరు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఎన్డీయే కూమిని చూసి ఓర్వలేక విమర్శిస్తున్నారని మీరు విమర్శలు మాని భషరతుగా మీ వ్యాఖ్యలను విరమించుకోవాలని అభివృద్ధిని అడ్డుకుంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు మీ పార్టీ నాయకులను, మిమ్మల్ని తరిమికొట్టే రోజులు వస్తాయన్నారు.

# కరాటే సాధనతో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి

## – రూరల్ సిఐ రామకోటయ్య



**గిద్దలూరు రూరల్, జనవరి 18, ప్రభాతవార్త**
ప్రతి బాలిక కరాటే సాధనతో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని గిద్దలూరు రూరల్ సిఐ రామకోటయ్య అన్నారు. గిద్దలూరు పట్టణంలోని రాజరాజేశ్వరి బిఈడి కళాశాల ఆవరణంలో సిద్దార్ధ కరాటే అకాడమి ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కరాటే కోచ్ పివి సుబ్రహ్మణ్యంకు చెందిన శిష్యులు 30మందికి బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించి అర్హులైన వారందరికీ ఏపి టెక్నికల్ డైరెక్టర్ కరాటే మోహన్ రావు బెల్ట్ ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అకాడమిలో శిక్షణ పొందిన వారు కామన్ వెల్త్ పోటీలకు అర్హులని, గతంలో కూడా ఎన్నో పథకాలు సాధించామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిఐ రామకోటయ్య పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. జనవరి 5వ తారీఖున జిల్లా కేంద్రంలో జరిగిన కరాటే బెల్ట్ టెస్ట్‌లో గిద్దలూరుకు చెందిన కరాటే మాస్టర్ పివి సుబ్రహ్మణ్యం బ్లాక్ బెల్ట్ ఫోర్త్ డాన్ సర్టిఫికేట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం రంగారెడ్డి, ఎస్‌కె మహబూబ్ బాష, తిరుమల టింబర్ డిపోఎస్‌కె షబ్బీర్,సయ్యద్‌షాసావలి, శ్రీధర్ చాంద్‌బాషా,విద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కంది పంటలో మచ్చల పురుకు నివారణకు చర్యలు



**కొనకనమిట్ల, జనవరి 18, ప్రభాతవార్త**
కంది పూత, కాయ దశలో ఉందని, ఈ దశలో మారుకా మచ్చల పురుగు ఆశిస్తాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి కే.ప్రసన్న రంగలక్ష్మి అన్నారు. వద్దిమడుగు, వాగుమడుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు నివారణకు సూచనలు చేశారు. రబీ సీజన్‌లో పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని, పంట నమోదుపై సూపర్ చెక్ నిర్వహించారు. కంది పంటలో పూత, కాయలను గుండుగా చేసుకొని మారుకామచ్చ పురుగు నష్టం చేస్తోందన్నారు. నివారణకు ఎమామెక్టిన్ బెంజో మేతా 80 గ్రాములు లేదా నొవాల్యూరాన్ 200 ఎంఎల్ తో పాటు 13-0-45 కేజీలను కలిపి ఎకరాకు పిచికారి చేయాలి. ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ పొలాల్లో ఉన్న తెగుళ్లను పురుగులను గుర్తించవచ్చని యాజమాన్య పద్దతులు కూడా తెలుసుకోవచ్చని ఎవో ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీనాయక్, వీఏఏ రమేష్, ఎస్‌కే సలోని, రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**కొనకనమిట్ల, జనవరి 18, ప్రభాతవార్త**
మండలంలోని 565 జాతీయ రహదారిలో చౌటపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో శిరుగూరి పెద్ద నాగయ్య(66)అక్కడికక్కడే మృతి చెందాడు. చౌటపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పెద్ద నాగయ్య పాల ప్యాకెట్ తెచ్చుకొనేందుకు సెంటర్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా మార్కాపురం నుండి పొదిలి వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, విజయమ్మ, నలుగురు కూతుర్లు, కుమారుడు, మనుమల్లు కలిగి ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై టి.రాజకుమార్, పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వెలుగొండ ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలి

## – కార్మిక కర్షక రైతు డిమాండ్



**వెలిగండ్ల, జనవరి 18, ప్రభాతవార్త**
వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన కోసం కార్మిక కర్షక ప్రజా ఉద్యమాలు ఉద్భతం చేయాల్సిన అవసరం ఎంతైనాఉందని జిల్లా సీఐటీయు కమిటీ సభ్యులు రాయల మాలకొండయ్య తెలిపారు. శనివారం వెలిగండ్ల ప్రజా సంఘాల కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం అయినకోట వెంకట రంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో జిల్లా సీఐటీయు కమిటీ సభ్యులు రాయల మాలకొండయ్య పాల్గొని మాట్లాడుతూ నిత్యం కరువు కాటకాలు వలసలకు గురవుతూ రక్షిత మంచినీరు లేక దుర్భిక్ష ప్రాంతంగా ఉంటూ అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం అత్యంత అవసరమని వారన్నారు. వెలుగొండ సాధన కోసం మరో ఉద్యమానికి ముందుకు వెళ్ళడానికి ఈనెల 23 గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కనిగిరి క్లబ్ రోడ్డులో జరిగే బహిరంగ సభకు హాజరై జయప్రదం చేయాలని కోరుతూ ఈబహిరంగ సభకు ఆలిండియా సీపీఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హాజరవుతున్నారని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పగడాల చెక్రిరావు, కండె బాలకృష్ణ, కాకర్ల నారాయణ, రంగస్వామి, రామకృష్ణ, కాశీం పీరా, సుందరరావు, బాలయ్య, బాల కాశయ్య,చంద్రశేఖర్,నాగమ్మ, నారాయణమ్మ, ప్రభావతి,చెన్నమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



**వెలిగండ్ల, జనవరి 18, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సూచనల మేరకు స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రమైన వెలిగండ్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద గల స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ఎన్టీఆర్ పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి చేసిన సేవలు గురించి గుర్తు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరికృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ కుమార్, జిల్లా మాజీ డీసీఎంఎస్ అధ్యక్షులు బీరం వెంకటేశ్వరరెడ్డి, కొండు విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి సలోమాన్ రాజ్, రావి శ్రీనివాసులు, మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# టీడీపి కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**సంతనూతలపాడు, జనవరి 18, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో భాగంగా సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు పర్యవేక్షణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంతనూతలపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా 25 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ విచ్చేశారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శనగల వెంకటరమణ అధ్యక్షత వహించారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు బొడ్డ శంకర్‌బాబు, నీటి సంఘాల అధ్యక్షులు ఎం.రంగనాయకమ్మ, చెరుకూరి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఎన్.మాధవిలత, ఎం.వెంకటేశ్వర్లు, చిట్టంశెట్టి శ్రీనివాసరావు, ఎస్.శ్రీరామమూర్తి, బొడ్డపాటి చంద్రశేఖర్, రావులపల్లి సురేష్‌బాబు, నల్లగట్ల సుబ్బారావు, ఈ కార్యక్రమం నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంతనూతలపాడు బ్రాంచ్ సభ్యులు పావులూరి నారాయణస్వామి చౌదరి, చివుకుల రాంగోపాల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఏవో సుధాకరరావు, డాక్టర్ సుబ్బారావు, టెక్నీషియన్స్ శ్రీనివాసులు, పవన్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్, వీర్ల అంకయ్య పాల్గొన్నారు.

# ప్రతి రైతునూ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయండి



**దొనకొండ,జనవరి 18, ప్రభాతవార్త**
దొనకొండ మండలం లో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు వివరాలని ఫార్మర్ రిజిస్ట్రీ నందు నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి వి. లక్ష్మీ నారాయణ రైతు సేవా కేంద్ర సిబ్బందిని ఆదేశించారు.నిన్న ఈరోజు ఇండ్ల చెరువు, మంగిన పూడి రైతు సేవా కేంద్రాల పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం లో రైతులతో నిర్వహించిన సమావేశం లో మాట్లాడుతూ ప్రతి రైతు సిబ్బంది తో సహకరించి పేర్లు నమోదు చేయించకోవాలని రైతులని కోరారు. ఆధార్ నెంబర్ మాదిరి ప్రతి రైతుకి ప్రత్యేక సంఖ్య ని కేటాయిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వము తీసుకొచ్చిన ఖఫార్మర్ రిజిస్ట్రీ ఖ కార్యక్రమాన్ని గురించి రైతులకు వివరించి,దీని ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను (ఐడి నంబర్ ) కేటాయించటం జరుగుతుందని తెలిపారు.గ్రామ వ్యవసాయ, ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ సహాయకులు ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్సైట్లో రైతుల వివరాలు నమోదు చేస్తారు. రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత రైతుకు ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో వెసలు బాటను కల్పించనున్నారు.

**అర్హులు:..** భూమి గల రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీ, వ్యవసాయ ఆధారిత వృత్తులపై జీవించేవారు.

**నమోదు చేసేందుకు కావలసినవి :..** రైతు ఆధార్ సంఖ్య, పట్టాదారు పాసుబుక్, చరవాణి నంబర్.

**ప్రయోజనాలు:..**
అర్హులైన రైతులను గుర్తించటం, ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులు అయినటువంటి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా,పంట నష్టపరిహారం, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందించుట మొదలైనవి ఫార్మర్ రిజిస్ట్రీ నెంబర్ ఉన్నవారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో రెండు గ్రామాల రైతులు, గ్రామ వ్యవసాయ సహయకులు విన్ని బాబు, రాధిక పాల్గొన్నారు.

# సంక్షేమ పాలనకు ఆద్యుడు ఎన్టీఆర్

## – దొనకొండలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ



**దొనకొండ,జనవరి 18, ప్రభాతవార్త**
దొనకొండ మండలం, దొనకొండ టౌన్ లో శనివారం అన్న నందమూరి తారక రామారావు గారి 29వ వర్ధంతి సందర్భంగా, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి ..డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.. గారు, టిడిపి యువనాయకులు ..డాక్టర్ కడియాల లలిత్ సాగర్.. గారు. తదుపరి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహానటుడిగా, ప్రజానాయకుడిగా ఒకే జీవితంలో రెండు చరిత్రలు సృష్టించిన శకపురుషుడు ఎన్టీఆర్. ప్రజాహిత పాలనకు, సంక్షేమ పథకాలకు ఆద్యుడిగా, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా, జాతీయ రాజకీయాలకు సరికొత్త దిశా నిర్దేశం చేసిన ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పిద్దాం. రాజకీయాల్లో మహిళల, బడుగు వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు, అట్టడుగు వర్గాలకు సంక్షేమాన్ని అందించేందుకు, మహిళలకు ఆస్తి హక్కు, బీసీలకు రిజర్వేషన్లు, రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి పథకాలతో సమసమాజ స్థాపనకు బాటలు వేసిన ఎన్టీఆర్ ఆశయ సాధనకు మనందరం కృషిచేద్దాం.

ఆ దేవుడెలా ఉంటాడో తెలియని భారతీయులకు ఎన్టీఆర్ పోషించిన శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీనివాస, శివుడు, సత్యనారాయణ స్వామి వంటి పాత్రలే నిలువెత్తు సాక్ష్యాలుగా నిలిచాయి. పౌరాణిక, జానపదాల్లో అనితరసాధ్యంగా నటించిన ఎన్టీఆర్ సాంఘికాల్లోనూ, చారిత్రకాల్లోనూ తనదైన బాణీ పలికించారు. సినిమా రంగంలో ఎన్టీఆర్ సాధించిన అపూర్వ విజయాలకు, నభూతో నభవిష్యత్ అన్న చందాన సాగిన సక్సెస్‌కు కొదువే లేదు. ఆయన చిత్రాలు నెలకొల్పిన రికార్డులు ఈ నాటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయంటేనే ఎన్టీఆర్ స్టార్ డమ్ ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. అనేక విలక్షణమైన పాత్రలలో జీవించి, అలరించారు రామారావు. ముఖ్యంగా పేదవాడి పక్షం నిలచి పోరాడే నాయకునిగా నటరత్న అభినయం సామాన్యులను ఇట్టే ఆకట్టుకుంది. దాంతో రామారావు తమకోసమే జన్మించాడనీ ఎందరో భావించారు. తమ గుండె గుడిలో తనను ఆరాధిస్తున్న సామాన్యుల కోసం ఏదైనా చేయాలి అనే సత్సంకల్పంతోనే ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం చేశారు. 1982 మార్చి 29న తన మాతృభాషను స్మరిస్తూ తెలుగుదేశం పార్టీని నెలకొల్పారు ఎన్టీఆర్. కేవలం తొమ్మిది మాసాల వ్యవధిలో తెలుగునేలపై పర్యటించి, 1983 జనవరి 5న జరిగిన ఎన్నికల్లో విజయఢంకా మోగించారు. జనవరి 9వ తేదీన తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 1984 ఆగస్టులో ఎన్టీఆర్ పదవీచ్యుతిడిని చేసినప్పుడు, కేవలం మాసం రోజుల్లో ఆయనను మళ్ళీ ముఖ్యమంత్రిగా నిలపడంలో ప్రజలు సాగించిన పోరాటం ఓ చరిత్రగా నిలచింది. 1984లో తన ప్రాంతీయ పార్టీని జాతీయ పార్లమెంట్ లో ప్రతిపక్షంగా నిలిచేలా చేసింది ఎన్టీఆర్ కరిజ్మానే. వరుసగా 1983, 84, 85 సంవత్సరాలలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఘనత కూడా రామారావు సొంతమే. 1994లో ప్రత్యర్థి పార్టీని ప్రతిపక్షహోదాకు కూడా అర్హత సాధించని విధంగా ఓడించిందీ ఎన్టీఆరే. ఇంతటి అపూర్వ విజయాలు సాధించిన ఎన్టీఆర్ తెలుగువారయినందుకు అందరూ గర్వించారు. అందుకే ఆయనను సదా స్మరించుకుంటూ ఉన్నారు. మనలాంటి యువ నాయకత్వానికి ఎన్టీఆర్ ఆదర్శం. ఆనాడు ఎన్టీఆర్ మంత్రివర్గంలో మా తాతగారు గొట్టిపాటి హనుమంతరావు గారు పనిచేయడం నాకు ఎంతో గర్వంగా ఉంది ఈ ప్రాంతంలో మా గొట్టిపాటి వారి అభివృద్ధికి ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీ రామారావు గారి సహకారం ఈనాటికి కూడా మనం మరువలేము ఆయన స్ఫూర్తితో నేను గొట్టిపాటి వారసురాలుగా దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చి చూపిస్తానని మీ అందరికీ ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. క్రితం ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు, ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గారు, ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ గారు సారధ్యంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి రాష్ట్రంగా ఈ ఏడు నెలల పాలనలో ప్రజలు ఎంతో ఆనందంగా పయనిస్తున్నారు అని చెప్పడానికి గర్వపడుతున్నాను. కూటమి ప్రభుత్వంలో ప్రజల అవసరాలు తీర్చడంతో పాటు స్వేచ్ఛగా ఆనందంగా జీవిస్తున్నారు. నిన్నటి సంక్రాంతి చూశారు మీరు మన దర్శి పట్టణంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి సంక్రాంతిగా జరుపుకున్నాము ఇదే స్ఫూర్తితో దర్శి ప్రాంతంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు మీరందరూ సంపూర్ణ సహకారాన్ని అందించాలని అభివృద్ధిని ఆదరించాలని మరొక్కసారి మీ అందరిని కోరుకుంటూన్నాను. ఈ కార్యక్రమం లో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ మండల పార్టీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వర రావు గారు, నియోజకవర్గ బి సి సెల్ అధ్యక్షులు మోడీ వెంకటేశ్వర్లు గారు వివిద హోదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు మరియు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రైతులు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

**సింగరాయకొండ, జనవరి 18, ప్రభాతవార్త**
బింగినపల్లి గ్రామంలోని రైతులందరూ అందుబాటులో ఉండి భూముల రీ సర్వే ను సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ టి రవికుమార్ తెలిపారు. మండల పరిధిలోని బింగినపల్లి గ్రామంలో శనివారం రెవెన్యూ అధికారులు గ్రామంలోని భూములు రీ సర్వే పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి 40 రోజులు పాటు గ్రామంలోని భూములపై రీ సర్వే నిర్వహించబడుతుందన్నారు. రీ సర్వే నిర్వహించే ముందుగానే ఆ సర్వే నంబర్ లోని రైతులకు తెలియపరుస్తామన్నారు. రైతులందరూ అందుబాటులో ఉండి భూములపై ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. రీ సర్వే నిర్వహించే సర్వే నంబర్లు లోని రైతులు వారి హక్కు పత్రాలను అధికారులకు సమర్పించాలన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు సన్నె బోయిన మాలకొండయ్య మాట్లాడుతూ రైతులు అపోహలు నమ్మి వివాదాలు పెట్టుకోవద్దని, ఏదైనా సమస్య ఉంటే అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఆంధ్రప్రదేశ్ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఆయన తెలిపారు. అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను అర్హత కలిగిన వారికి ఆన్లైన్ కూ అవకాశం కల్పించి పంట రుణాలకు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సన్నె బోయిన మాలకొండయ్య నీటి సంఘం అధ్యక్షుడు పూడి రోసిరెడ్డి రైతులు ప్రజలు పాల్గొన్నారు.



## పరిసరాలు పరిశుభ్రంగా చేసుకోవడం అందరి బాధ్యత



**కనిగిరి, జనవరి 18, ప్రభాతవార్త**

పరిసరాలు పరిశుభ్రం చేసుకోవడం అందరి బాధ్యత అని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్, కమీషనర్ దానియల్ జోసెఫ్ అన్నారు. శనివారం స్వచ్ఛ కనిగిరి కార్యక్రమంలో భాగంగా పామూరు బస్టాండ్ లోని చర్చి సెంటర్లో స్వచ్ఛత దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక్క అడుగు స్వచ్ఛత వైపు శుభ్రత లేనిదే రక్షణ లేదని ర్యాలీ నిర్వహించి రోడ్లను ఊడ్చారు. ప్రజలు తడి చెత్తను పచ్చ బుట్ట, పొడి చెత్తను నీలం బుట్టలో, హానికరమైన చెత్త ఎర్ర బుట్టలో వేయాలని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, గుడ్ హెల్ప్ సంస్థ కన్వీనర్ రమేష్, సచివాలయ, శానిటరీ సెక్రటరీలు జే.రమణారెడ్డి, బి.పవన్, ఎస్టీ రహమతుల్లా, డి.స్రవంతి, జి.లోకేష్, వి.నాగలక్ష్మి, సీహెచ్ కాశీరాజు, ఏ.జ్యోతి, ఎం.సులోచన, డి.రాజశేఖర్, ఎం.మాలకొండయ్య, డి.ప్రసాద్‌రెడ్డి, మెప్మా ఆర్పీలు, పారిశుధ్యకార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్

### - ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, జనవరి 18, ప్రభాతవార్త**

నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం కనిగిరి అమరావతి మైదానంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ళు అన్న సూక్తిని మొదటిసారిగా రాజకీయాలకు పరిచయం చేసిన మానవతా వాది అని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండులన, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కనిగిరి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, బజాజ్ ఓబుల్‌రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, కనిగిరి మండల తెలుగు యువత అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, కనిగిరి మండల బీసీ సెల్ అధ్యక్షుడు గంజిగుంట శ్రీనివాసులు, కనిగిరి మండల కన్వీనర్ పిచ్చల శ్రీనివాసరెడ్డి, షేక్ మస్తాన్‌బాబు, కమిటీ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ రహిమాన్, ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు రాచపూడి వెంకటేశ్వర్లు, యువరాజ్, వివి మనోహర్‌రావు, చింతం కిరణ్, రోషన్ సంధాని, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ బుల్ల బాలబాబు, దొరసాని, మాజీ ఎంపీపీ మమ్ముల వెంకటేశ్వర్లు, షేక్ ఫిరోజ్, షేక్ వాజిద, తమ్మినేని సురేంద్రరెడ్డి, అచాల రవి, భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉండేల శ్రీనివాసరెడ్డి, పిల్లి కిరణ్‌రెడ్డి, షేక్ గయాజ్, నాగేంద్ర, జనార్ధన్‌రెడ్డి, కాజా కోట సురేష్‌బాబు, సుధారాణి, అరుణ అంజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దద్దాల నారాయణకు అభినందన కార్యక్రమం



**కనిగిరి, జనవరి 18, ప్రభాతవార్త**

హనుమంతునిపాడు మండలం జడ్పీటీసీగా ఉన్న దద్దాల నారాయణ యాదవ్‌ను వైసీపీ అధిష్టానం కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జీగా ప్రకటించి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం వైసీపీ కార్యాలయంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ,కార్యకర్తలు కేక్ కట్ చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కనిగిరి జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గానికి పార్టీ అధిష్టానం నియమించిన దద్దాల నారాయణయాదవ్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి బాగోగులు చూసుకుంటున్నారని అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనిగిరి నియోజకవర్గంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ మూడు సార్లు అవకాశం ఇవ్వడం హర్షించే విషయం అన్నారు. అలానే సేవాభావం కలిగిన వ్యక్తి దద్దాల నారాయణయాదవ్‌కు పార్టీ అధిష్టానం 2024లో అవకాశం కల్పించిందని అన్నారు. స్వల్ప మెజార్టీతో ఓడిపోయినప్పటికి నిరంతరం ఆయన ప్రజల్లో ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీపల్లి జడ్పీటీసీ ఓకేరెడ్డి, బొర్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యాలరావు, హనుమంతునిపాడు మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు చింతగుంట్ల కిషోర్, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా

### - ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ



**కనిగిరి, జనవరి 18, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నియమితులై నేటికి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ శనివారం మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా, జడ్పీటీసీగా ఉన్న తనను ప్రోత్సహించి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు ఇచ్చిన జన హృదయ నేత, నిరుపేదల పెన్నిది పార్టీ అధినేత జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. జగనన్న పట్టుదల ధైర్యం, సాహసం, పోరాట పటిమ నాకు ఆదర్శం, స్ఫూర్తి అని అన్నారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లి కూటమి ప్రభుత్వం తప్పిదాలను ఎండకట్టి, ఎన్నికల హామీల అమలుకై పోరాడుతామన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్న, పార్లమెంట్ ఇన్‌ఛార్జీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి ఆశీస్సులతో కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులందరిని కలుపుకుని పోతూ, కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా నిలబడి గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గంలో వైసీపీజెండాను ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసేంత వరకు శక్తికి మించి కృషి చేస్తానని చెప్పారు. కనిగిరి సమన్వయకర్తగా నియమించినప్పటికి నుండి నేటి వరకు నాకు మద్దతు తెలుపుతూ, నా వెంట నడుస్తూ నాకు అండగా నిలబడి, నీకు మేమున్నాం అంటూ వెన్నుదన్నుగా తోడుగా నిలిచిన నియోజకవర్గం వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ఓట్లు వేసిన ప్రజలకు అందరికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. మీరందరూ నాపై చూపించిన ప్రేమ, ఆప్యాయతలు నేను ఎప్పటికి మరిచిపోలేనని అన్నారు.

## ప్రతి నాయకుడు ఓటును అడగ్గలిగే హక్కుగా పనిచేయాలి

### - సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్



**మద్దిపాడు, జనవరి 18, ప్రభాతవార్త**

పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి పని చేసి ప్రతి నాయకుడు ఓటును అడగ్గలిగే హక్కుగా పని చేయాలని సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మద్దిపాడు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో శనివారం నాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, సినీ నటులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను తెలుగు తమ్ముళ్లు, అభిమానులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రతి ఏటా టీడీపీ శ్రేణులు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించేవారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో రాజకీయ పరిస్థితుల నేపధ్యంలో ఒక మాదిరిగా జరిగాయి. అయితే ఈ సారి 29వ వర్ధంతి గతంలో మాదిరిగా మళ్లీ బారీగా నిర్వహించేలా ఎక్కడికి అక్కడ కార్యకర్తలు సన్నాహాలు చేశారు. మండల పరిధిలోని మద్దిపాడు, నందిపాడు, దొడ్డవరం, సీతారాంపురం, గుళ్లాపల్లి, మల్లవరం, వెల్లంపల్లి, కొలచనకోట, బసవన్నపాలెం, ఇనమనమెల్లూరు, పెద్దకొత్తపల్లి, లింగంగుంట తదితర గ్రామాల్లో టీడీపీ శ్రేణులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల కేంద్రమైన నట రాజా కళా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ అతిథులుగా మండల టీడీపీ అధ్యక్షులు మండవ జయంతిబాబు, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి అడకా స్వాములు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండవ రంగారావు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఒంగోలు నగరానికి చెందిన విజయదుర్గా బ్లడ్ బ్యాంక్ సహకారంతో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరం నందు మల్లవరం గ్రామ పార్టీ అధ్యక్షులు మార్నేని రాఘవ ఆధ్వర్యంలో తమ గ్రామం నుంచి నాయకులను, కార్యకర్తలను సమీకరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మల్లవరం గ్రామానికి చెందిన ఉప్పుటూరి కాలేషాబాబు, ఎన్.ధరణిబాబు, ఎన్.రాకేష్, సీహెచ్ హర్ష, నాగరాజు, అవినాష్, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కార్యదర్శి మాజీ ఏఎంసీ డైరెక్టర్ ముత్తనపల్లి రామలింగం, ఎస్సీ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు ప్రభాకర్, బీసీ సెల్ అధ్యక్షులు శుద్దపల్లి అనిల్, సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నర్రా సురేష్, మార్నేని రాఘవ, నారిపెద్ది వరహాల చౌదరి, చంచు హరిబాబు, మాజీ జడ్పీటీసీ మొనపాటి రామకృష్ణ,గడ్డంరవికుమార్,వివిధ గ్రామాలకు చెందిననాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## టీడీపి తరుపున ఆర్థిక సహాయం అందజేత



**మద్దిపాడు, జనవరి 18, ప్రభాతవార్త**

ప్రతి కార్యకర్తకి కష్టకాలంలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండవ జయంతిబాబు అన్నారు. శనివారం నాడు పెద్దకొత్తపల్లి గ్రామం అరుంధతి నగర్‌కు చెందిన పూనూరు రామయ్య గత నెల రోడ్డు ప్రమాదంలో గాయపడటం జరిగింది. అదే క్రమంలో అదే గ్రామానికి చెందిన జెన్నేపోగు పౌలు(పవన్) గత డిసెంబర్ నెలలో సీతారాంపురం కొష్టాలు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా వీరి ఇరువురికి పెద్ద కొత్తపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ తరుపున ఒక్కొక్కరికి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండవ జయంతిబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నల్లూరి రామచంద్రయ్య, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లూరి సంజీవరావు, నర్రా సురేష్, నల్లూరి అనూష, మండవ గోపి చంద్, పోతినేని రామయ్య, మలసాని నరేన్, నాతాని సుధీర్, పాటిబండ్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ రూల్స్ తప్పక పాటించాలి

### - ఎస్సై బి.శివరామయ్య



**మద్దిపాడు, జనవరి 18, ప్రభాతవార్త**

వ్యతిరేక దిశలో ప్రయాణం చేయడం, వాహనాలను నడుపుట ద్వారా ప్రమాదాలు కొనితెచ్చుకునే పరిస్థితి ఉంటుందని ఎస్సై బి.శివరామయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని సీతారాంపురం కొష్టాలు సెంటర్ వద్ద, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి వద్ద, రాచవారిపాలెం జంక్షన్ వద్ద, గ్రోత్ సెంటర్ వద్ద వ్యతిరేక దిశలో వాహనాలు నడుపుట వలన రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై బి.శివరామయ్య ప్రధాన కూడలి వద్ద వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు తీసుకుని వెళ్లే ట్రాక్టర్ డ్రైవర్లు సైడ్ డోర్లు ఓపెన్ చేసి పక్క వైపున వెనుక వైపున కూలీలను కూర్చొని పెట్టడం వలన పొరపాటున వాళ్లు కిందపడినట్లయితే అనుకోని విధంగా ప్రాణాపాయం సంభవించినట్లయితే ఇటువంటి డ్రైవర్ మీద నాన్ బెయిలబుల్ సెక్షన్స్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని కనుక ప్రతి ఒక్క ట్రాక్టర్ రడైవర్లు ఆటో డ్రైవర్లు వెనుక వైపున డోర్లు ఓపెన్ చేసి కూలీలను, ప్రయాణికులను కూర్చొని పెట్టరాదని, ఆటో డ్రైవర్లు, కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం కానీ, సైడ్ కూర్చొని పెట్టడం గాని చేయరాదని డ్రైవర్లకు సూచించారు. ప్రతి ఒక్కరు తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్టు ధరించి ప్రయాణించాలని, తాగి వాహనాలు నడపవద్దని వ్యతిరేక దిశలో ప్రయాణాలు చేయడం ప్రమాదకరం కావున రోడ్డు సేఫ్టి రూల్స్ తప్పక పాటించాలని వాహనదారులకు ఎస్ఐ బి.శివరామయ్య తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు పరిశీలన



**మద్దిపాడు, జనవరి 18, ప్రభాతవార్త**

దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దే లక్ష్యం దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. శనివారం నాడు స్థానిక మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన చేసి సంతృప్తిని వ్యక్తం చేస్తూ , స్థానిక పీహెచ్‌సీ సిబ్బందితో స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని తప్పక నిర్వహించాలని సూచించారు. ఆదివారం నాడు కడప జిల్లా మైదుకూరులో సీఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 12 నెలలకు 12 టీమ్స్ తో ఫోగ్రాంను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, డాక్టర్లు ఆనంద్ మోహన్, శిరీష చందన, వినీల చౌదరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సీహెచ్ రజిత కుమారి, సీనియర్ అసిస్టెంట్ చైతన్య, హెల్త్ సూపర్‌వైజర్స్ కే.బాలకోటయ్య, కే.సీతమ్మ, నాగరాజి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితులు పాల్గొన్నారు.

## యుగపురుషుడు నందమూరి తారక రామారావు వర్ధంతి



**జరుగుమల్లి, జనవరి 18, ప్రభాతవార్త**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సూచనలతో జరుగుమల్లి మండలంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు మండల కన్వీనర్ పోకూరి రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో సెంటర్లో శనివారం వర్ధంతి వేడుకలు జరిగాయి. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోకూరి రవీంద్రబాబు మాట్లాడుతూ యుగపురుషుడు ఎన్టీఆర్ అని ఆయన సినిమా రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో నూతన వరవడి సృష్టించారని తెలిపారు. పార్టీని స్థాపించిన ఆరు నెలల కాలంలోనే అధికారాన్ని చేపట్టారన్నారు. పేద బడుగు వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. మండలంలోని ముఖ్య నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేసిన పువ్వాడి, యారవ, బొల్లా



**పామూరు,జనవరి 18, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ దినాల్లో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఆటల పోటీల్లోభాగంగా ఉగ్రన్న యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పామూరులో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు శనివారం సాయంత్రం బహుమతులు ప్రధానం గావించారు. స్థానిక పేట బాయ్స్ మొదటి బహుమతి గెలుచుకోగా ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు అందించిన రూ.50,116లతో పాటు షీల్డ్‌ను మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, లక్ష్మీనరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి తదితరులు పేట 11బాయ్స్‌కు అందజేశారు. ద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులతో పాటు బెస్ట్ షీల్డ్, బెస్ట్ బౌలర్స్, బ్యాట్స్‌మెన్‌లకు, మ్యాన్‌ఆఫ్‌ద సీరిస్‌లకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఓడిన వారు కృంగిపోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఆర్ రఫీ, ముబినా మౌలాలి, పట్టణ అధ్యక్షుడు కాజా రహంతుల్లా, శ్రీనివాసులు, కావేరి రసూల్, కోక వినోద్, మన్నం రమణయ్య, గుత్తి మహేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదానం కార్యక్రమం



**య ర్రగొండపాలెం,జనవరి18,ప్రభాతవార్త**

యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని నియోజకవర్గంలోని తెలుగుదేశంపార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు.కార్యక్రమంలో నియోజకవర్గ నుండి పెద్దసంఖ్యంలో నాయకులు అభిమానులు హజరైనారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయండి ప్రజల ప్రణాలు కాపడిన వారవుతాం అన్నారు. కార్యక్రమానికి ముందుగా పార్టికార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నాయకులతో కలిసి నివాళ్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు కామేపల్లె వెంకటేశ్వర్లు,యం.మంత్రునాయక్,చిట్యాల వెంగళ్‌రెడ్డి,శనగా నారాయణరెడ్డి, రెంటపల్లె సుబ్బారెడ్డి,తోట మహేష్‌నాయుడు,కొత్తమాసు సుబ్రమణ్యం,కొప్పర్తి వెంకటరెడ్డి,ఒంగోలు ఆదిరెడ్డి,లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుజాతి కీర్తిప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్

### - లెజండరి బ్లడ్ డొనేషన్ కాంపెయిన్‌ను ప్రారంభించి రక్తదానం గావించిన ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

### - ఆయన స్ఫూర్తితో పలువురు నేతలు రక్తదానం



**పామూరు, జనవరి 18, ప్రభాతవార్త**

ఒకప్పుడు మదరాసిలుగా చెప్పుకునే తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, తెలుగుజాతి పౌరుషాన్ని నిలబెట్టేందుకు తెలుగుదేశం పార్టీని ఆవిర్భవింపచేసి చరిత్రను తిరగరాసి అధికారాన్ని ఎక్కి ఢిల్లీ కోటను గడగడలాడించిన మాజీ ముఖ్య మంత్రి స్వర్గీయ రామారావు చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రశంసించారు. నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి ని పురస్కరించుకుని స్థానిక సత్యదేవుని కళ్యాణ మండపం నందు ఏర్పాటు చేసిన లెజండరి బ్లడ్ డొనేషన్ క్యాంపును ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పువ్వాడి వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ సూర్యచంద్ర సేవా సంస్థలు అధ్యక్షులు దర్శి వెంకట మనోహర్‌ప్రసాద్, లక్ష్మీనరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు అడుసుమల్లి ప్రభాకరరావు చౌదరి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రమణయ్య, పామూరు పట్టణ ఫోర్‌మెన్ కమిటీ మెంబర్లు ఇర్రి కోటిరెడ్డి, షేక్ గౌస్‌భాషా, పందిటి హరీష్, ఉప్పలపాటి హరిబాబు పలువురు ఆధ్వర్యంలో విజయవంతంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. గత వారం నుండి మండలంలో విస్తృతంగా ప్రచారం గావించడంతో ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ అభిమానులు, టీడీపీ, జనసేనలతోపాటు, నాయకులు ,కార్యకర్తలు వచ్చి రక్తదానం చేశారు. వారు మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడిగా ఎన్టీఆర్ నిలిచిపోతారని అన్నారు. ఎన్టీఆర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిరుపేదలకు రూ.2లకే కిలోబియ్యం, ఉచిత విద్య, కూడు, గూడు, నీడ అనే పథకాలను ప్రవేశపెట్టి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబులచే ప్రశంస పత్రాలు అందజేశారు.

## ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా క్యాన్సర్ పేషెంట్‌కు ఆర్థిక సాయం అందించిన ఆకుపాటి



**పామూరు, జనవరి 18, ప్రభాతవార్త**

పామూరు పట్టణంలోని అంకాలమ్మ వీధికి చెందిన పత్తి అంకయ్య నోటి సంబంధిత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తన మిత్రుల ద్వారా తెలిసిన వెంటనే ప్రకాశం జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు పామూరు రెండో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మానవసేవే మాధవసేవ గా భావించి స్వర్గీయ ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా వైద్యం ఖర్చుల నిమిత్తం పేషెంట్ అంకయ్యకు రూ.5,116లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నీరుకట్టు రసూల్, నక్క తిరుపతయ్య, ఇండ్ల నరసింహారావు, పుప్పాల రామ్మూర్తి, జంతిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కంభాలదిన్నెలో ఘనంగా ఎన్టీఆర్‌కు నివాళి



**పామూరు, జనవరి 18, ప్రభాతవార్త**

మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో గోళ్ళ వీరబాబు, మన్నం రమణయ్య, ఓరుగంటి సుబ్బమ్మ తదితరుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, దారపనేని సుబ్బారావు, పచ్చవ బాబు, ప్రసాద్, మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్య తదిరతుల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రుల అభిమాన నటుడే కాకుండా ఆంధ్రుల ఆరాధ్యదైవంగా నిలిచిన ఏకైక మహనీయుడిగా ఎన్టీఆర్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామంలో పేదలకు వస్త్ర దానం గావించారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు.

## ఎన్టీఆర్‌కు ఘననివాళులర్పించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, జనవరి 18, ప్రభాతవార్త**

సంతనూతలపాడు కేంద్రంలో మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ 29వ వర్ధంతి వేడుకల్లో ముఖ్య అతిధిగా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొని ఎన్టీఆర్ డాక్టర్ సింగయ్య విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అభ్యున్నతకు ఎన్టీఆర్ చేసిన సేవలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో భారీగా అన్నదాన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పాటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మాజీ ఎంపిపి వివరం గోవిందు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, సంతనూతలపాడు టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, నీటి సంఘాల అధ్యక్షులు మన్నం రంగనాయకమ్మ, చెరుకూరి శ్రీనివాసరావు, నల్లూరి కృష్ణారావు, మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు రావులపల్లి వెంకట సురేష్‌బాబు, మండల టీఎన్టీయుసీ అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంటు టీఎన్టీయుసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పావులూరి నారాయణస్వామి చౌదరి, సిండికేట్ రైతు సొసైటీ మాజీ అధ్యక్షులు సాదినేని శ్రీరామ్మూర్తి, మండల జనసేన పార్టీ అధ్యక్షులు ముద్రగడ్డ ఫణీంద్ర, మండల బీజేపీ అధ్యక్షులు తెల్లమేకల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, నల్లగట్ల సుబ్బారావు, వి.కోటేశ్వరరావు, ఆళ్లరాము, సీహెచ్ వెంకట సుబ్బయ్య, పి.భాస్కరరావు, గుర్రం శ్రీనివాసరావు, బొడ్డపాటి చంద్రశేఖర్, కొంకా శ్రీనివాసరావు, అబ్బూరి శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, మన్యం ప్రసాద్, ఎస్.ఉమా,ఎం.పోలిశెట్టి, బి.రామదాసు, వి.అంకంశెట్టి, బీవీ రమణారావు, కట్టా సుబ్బారావు,నల్లూరి గోపి,కే.ఆంజనేయులు,అంకమ్మరాజు,ఎం.సుబ్బారావు,ఎం.బ్రహ్మయ్య, పి.కుబీంద్ర రావు, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మ్యూజికల్ నైట్

**ఒంగోలు, ప్రభాతవార్త**

హైదరీక్లబ్ ఆవరణలో జరుగనున్న మెగా మ్యూజికల్ నైట్‌కు గౌరవ సభ్యులందరూ కుటుంబ సమేతంగా రావాల్సిందిగా హైదరీక్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6గంటలకు ఖచ్చితంగా ప్రారంభమవుతుందని అన్నారు. వాహనాలను క్లబ్ ప్రాంగణంలోనికి అనుమతించడం లేదు, కనుక మీ వాహనాలు క్లబ్ బయటే మీ వీలును బట్టి పార్కింగ్ చేసుకొని రావాల్సిందిగా తెలిపారు. ఆర్డీఓ ఆఫీసు కాంపౌండ్‌లో కానీ, కలెక్టర్ ఆఫీసు కాంపౌండ్‌లో కాని చర్చి కాంపౌండ్‌లో కాని పార్కింగ్ చేసుకోవాలని తెలియజేశారు.

## సిద్ధమూర్తి నారాయణరెడ్డి లాంటి ప్రాధమిత్రుని కోల్పోవడం బాధాకరం

### - ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

**పామూరు, జనవరి 18, ప్రభాతవార్త**

స్నేహానికి ప్రాణం ఇచ్చే నా అల్లుడు సిద్ధమూర్తి నారాయణరెడ్డి మృతి బాధాకరమని తాను ఒక ప్రాణం మిత్రుని కోల్పోయానని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. శనివారం నాడు మృతి చెందిన నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను ఆయన స్వగ్రామానికి వచ్చి పరామర్శించారు. గత 30 సంవత్సరాల నుండి నారాయణరెడ్డికి తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఇనిమెర్ల గ్రామస్తులు మధ్య నెమరవేసుకున్నారు. ఎంతో ఆప్యాయత అనురాగంతో తామిద్దరం కలిసిమెలిసి జీవించామని ఆయన పేర్కొన్నారు. నారాయణరెడ్డి సోదరుడు లక్ష్మీనారాయణరెడ్డి తనకెంతో ఆత్మీయుడని, గ్రామస్తుల హృదయాలను గెలుచుకుని రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గెలిచాడని, వారికి వారి కుటుంబ సభ్యులకు తాను ఎల్లవేళలా అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధమూరి లక్ష్మీనారాయణరెడ్డి సోదరుడు టీచర్ సిద్ధమూర్తి మల్లిఖార్జున్‌రెడ్డి, మరో సోదరుడు టీచర్ మల్యాద్రిరెడ్డి, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అలా అజయ్‌బాబు, తెలుగుదేశం గ్రామ కార్యదర్శి నగేష్, గాజులపల్లి



కృష్ణారెడ్డి, గాజులపల్లి రమణారెడ్డి, గోదా గురువారెడ్డి, గోదా మాలకొండారెడ్డి, మల్లిఖార్జున, మారంరెడ్డి శివారెడ్డి తదితరులు సిద్ధమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

19-1Pg5.qxd:19-1Pg5.qxd 01/01/01 6:52 AM Page 1



# తొలిరోజునే ట్రంప్ 10 ఉత్తర్వులు!

## రేపు ప్రమాణ స్వీకారానికి భారీగా ఏర్పాట్లు

## 'టైటిల్-42'తో అక్రమ వలసదారులను వెనక్కి పంపే చర్యలు



**వాషింగ్టన్, జనవరి 18:** ప్రమాణస్వీకారంచేసిన మొదటిరోజునే అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పది కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకంచేయాలనినిర్ణయించారు. గతంలో ఒబామా కేర్‌స్కీంనే టార్గెట్‌గా చేసుకన్న ట్రంప్ ఇపుడు మరికొన్ని కొత్త ఉత్తర్వులు జారీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. వీటిలో ముఖ్యంగా వలసవిధానాలు కీలకంగా ఉన్నాయి అక్రమ వలసదారులను గుర్తించి సామూహిక అప్పగింత కార్యాచరణ ఉత్తర్వులపై సంతకం చేయనున్నారు. ఎలాంటి డాక్యుమెంట్లులేని వలసదారులకు ఈ స్కీం అమలవుతుంది. అమెరికా చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా సామూహికంగా వెనక్కి పంపించే ఏర్పాట్లు చేస్తామని, క్రిమినల్స్ అమెరికాలో ఉండకూడదన్న లక్ష్యమే కీలకమని ట్రంప్ వ్యాఖ్యలు చేసారు. అదేవిధంగా అమెరికాలో జన్మించిన విదేశీయులకు జన్మతహా వచ్చే పౌరసత్వాన్ని కూడా రద్దుచేస్తామని క్రటించారు. అమెరికా రాజ్యాంగం 14వ సవరణ కింద ఎవరైనా సరే అమెరికాలో జన్మించినవారికి జన్మతహా పౌరసత్వం లభిస్తుంది. ఇపుడు ట్రంప్ చేస్తున్న చర్యలవల్ల న్యాయపరమైన చిక్కులు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణుల అంచనా. బైడెన్ పాలనలోని అన్ని విధివిధానాలను కూడా సమీక్షించి అవసరమైతే రద్దుచేస్తామని అందుకోసం తాను టైటిల్42ను వినియోగిస్తామని ఈచట్టంప్రకారం శరవేగంగా అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు వీలుకలుగుతుందన్నారు. అలాగే ట్రంప్ ఓటమి సందర్భంగా అమెరికా పార్లమెంట్ భవనం క్యాపిటల్ హిల్స్‌పై జరిగిన దాడి కేసులో నిందితులందరికీ క్షమాబిక్ష ప్రసాదిస్తామన్నారు. ఇప్పటికే ఆయన తన ఎన్నికల ప్రచారంలో పదేపదే ప్రస్తావించారు. ఎన్నికయిన తర్వాత కూడా మరికొన్ని సార్లు చేసారు. జనవరి ఆరో తేదీ దాడుల్లో పాల్గొన్నవారికి క్షమాబిక్ష ప్రసాదించడం చట్టాలను అవమానించడమేనన్న విమర్శలు కూడా వచ్చాయి. తాను బాధ్యతలుచేపట్టిన వెంటనే రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తనకు బాగా తెలుసునని, అలాగే పుతిన్‌కూడా తెలుసని అన్నారు. ఇద్దరితోను మంచి సంబంధాలున్నాయని, అదే విధంగావారు కూడా తనను గౌరవిస్తారన్నారు. వారు బైడెన్‌ను గౌరవించరని ట్రంప్ ఛలోక్తులువేసారు. ఇక మెక్సికో కెనడాలనుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై 25శాతం సుంకాలు వేస్తామని ప్రకటించారు. ఇలాంటి సుంకాలు అమెరికా ఆర్థికవ్యవస్థను దెబ్బతీస్తాయని చెపుతున్నారు. బైడెన్‌కు ఉన్న విద్యుత్ వాహనాలు తప్పనిసరి విధానాన్ని రద్దుచేస్తామని అన్నారు. అమెరికాలో ఉన్న కార్లలో 2030 నాటికి 50శాతం కర్బన ఉద్గారాలు లేని కార్లుగా ఉండాలన్న లక్ష్యంతో బైడెన్ విద్యుత్ వహనాలు తప్పనిసరిచేసారు. అలాగే అమెరికాలో చమురుడ్రిల్లింగ్‌ను కూడా పెంచుతామని, దేశంలో చమురు ఉత్పత్తి ఇంధన వ్యయాన్ని తగ్గిస్తుందని ట్రంప్ చెపుతున్నారు. మహిళల క్రీటల్లో ట్రాన్స్ జెండర్ క్రీడాకారులకు నిషేధం విధించాలని నిర్ణయించారు. ట్రాన్స్‌జెండర్లను పురుషులుగానే గుర్తించాలని మహిళా క్రీడల్లో పాల్గొనడాన్ని నిషేధిస్తామని అన్నారు. మహిళ క్రీడలనుంచి పురుషులను తాను బాధ్యతలు చేపట్టిన మొదటిరోజునుంచే నిషేధిస్తామన్నారు. అలాగే మేడిన్ అమెరికా ఆటో పరిశ్రమకు ప్రోత్సాహకాలిస్తామన్నారు. అమెరికా ఆటోరంగానికి జవసత్వాలు పెంపొందిస్తామని ట్రంప్ చెపుతున్నారు. తాను బాధ్యతలుచేపట్టిన మరుసటిరోజే వీటిపై సంతకంచేస్తానన్నారు.



## ఛత్తీస్‌గఢ్ దుర్గ్ రైల్వేస్టేషన్‌లో పట్టుబడిన సైఫ్ కేసు నిందితుడు

### దాడికేసులో ముంబయి పోలీసుల దర్యాప్తు ముమ్మరం

**ముంబయి, జనవరి 18:** బాలివుడ్‌నటుడు సైఫ్ ఆలీఖాన్‌పై దాడికి దిగిన ఆగంతకుడిని పోలీసులు గుర్తించారు. 31 ఏళ్ల ఆకాశ్‌కైలాశ్ కన్నోజియా అని పేరును సైతం వెల్లడించిన పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. రైల్వేరక్షక అధికారులు ముంబయి హౌరా జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో ఛత్తీసఘర్‌కు పారిపోయి వచ్చాడని తెలిపారు. రాత్రి రెండు గంటలసమయంలో దుర్గ్ రైల్వేస్టేషన్‌కు రైలు వచ్చిందని, జనరల్ కంపార్టుమెంట్‌లో ఉన్న నిందితుడు స్టేషన్‌లో దిగిన వెంటనే అదుపులోకి తీసుకున్నామని ఆతడిని ప్రస్తుతం ఇంటరాగేషన్‌చేస్తున్నట్లు తెలిపారు. ముంబయి పోలీసులు నిందితుడి ఫోటో, రైలు నంబరు, లొకేషన్ వంటివి ఆర్పీఎఫ్‌కు పంపించడంతో వెంటనే పట్టుకున్నట్లు తేలింది. ప్రస్తుతం ఆర్‌పిఎఫ్ కస్టడీలో నిందితుడు ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. విడియో కాల్‌ద్వారా ఆగంతకునితో ముంబయి పోలీసులు మాట్లాడారు. మయుంబయినుంచి ఒక పోలీస్ టీమ్ దుర్గ్‌కు వెళ్లింది. నిందితుడా కాదా అని నిర్ధారించి అనుమానితుడిని ముంబయికి తీసుకువస్తామన్నారు. టికెట్‌లేకుండా నిందితుడు ప్రయాణించినట్లు తేలింది. ముందు నాగ్‌పూర్‌కు వెళుతున్నట్లు చెప్పాడని, ఆ తర్వాత బిలాస్‌పూర్‌కు పోతానని చెప్పినట్లు ఆర్‌పీఎఫ్ తెలిపింది. ఒకసారి బాంద్రా రైల్వేస్టేషన్‌లోకనిపించాడని, మరోసారి దాదం రైల్వేస్టేషన్‌లో సిసిటివిలకు చిక్కిన నిందితుడు ముంబయినుంచి పరారయ్యేందుకు యత్నించినట్లు గుర్తించారు. దీనితో ఆగంతకుడని ప్రశ్నించిన తర్వాత పోలీసులు ముంబయి పోలీస్‌కు అప్పగించేందుకు సిద్ధం చేసారు. అంతకు ముందు వారిస్ ఆలీ సల్మాని అనే వడ్రంగిని అదుపులోకి తీసుకున్నాడు. ఆగంతకుడిని పోలిన ఈతడిని ప్రశ్నించిన పోలీసులు ఆతడు కాదని నిర్ధారించుకున్నారు.

## సైఫ్‌పై పదేపదే ఆగంతకుడు కత్తితో దాడిచేసాడు

### బాంద్రాపోలీసులకు కరీనాకపూర్ వాంగ్మూలం



**ముంబయి, జనవరి 18:** తన బాంద్రా నివాసంలోకి చొరబడిన ఆగంతకుడు తన భర్త సైఫ్ ఆలీఖాన్‌ను పదేపదే పొడిచాడని సైఫ్ భార్య బాలివుడ్‌నటి కరీనాకపూర్‌ఖాన్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. బాంద్రాపోలీసులు శనివారం కరీనా వాంగ్మూలాన్ని నమోదుచేసారు. ఆగంతకుడు కోపంతో ఊగిపోతూ కనిపించాడని, ఉద్రేకపూరితంగా ఉంటూ సైఫ్‌పై పదేపదే దాడిచేసాడని ముందు సైఫ్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లే లక్ష్యంతో మరేమీ పట్టించుకోలేదని ఆమె పోలీసులకు తెలిపింది. మొత్తం అందరూ వస్తున్నట్లు పసిగట్టిన ఆగంతకుడు స్పాట్‌నుంచి పారిపోయాడని, ఎలాంటి విలువైన వస్తువులు కూడా తనవెంట తీసుకెళ్లలేదని ఆమె చెప్పారు. సైఫ్ తన పిల్లలు తైమూర్, జహంగీర్‌లను రక్షించేందుకు ఆగంతకుడిని ప్రతిఘటించారని, జేహ్‌కు సమీపిస్తాడన్న ముందస్తు అంచనాతోనే సైఫ్ ప్రతిఘటించడంతో పదేపదే పొడిచాడని కరీనా వెల్లడించింది. ఈసంఘటన తర్వాత తన సోదరి కరిష్మా ఇంటికివెళ్లానని, సైఫ్‌నువెంటనే ఆసుపత్రికితరలించి శస్త్రచికిత్సలుచేసినట్లు తెలిపారు.

## కేజ్రీవాల్ కాన్వాయ్‌పై రాళ్లదాడి..



**న్యూఢిల్లీ, జనవరి 18:** ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రయాణిస్తున్న కారుపై రాళ్లుపడటంతో బిజెపి దాడులు చేయిస్తోందంటూ ఆప్ కేడర్ ఆగ్రహావేశాలు వ్యక్తంచేసింది. నగరంలో వచ్చే నెలలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న కేజ్రీవాల్‌ను అడ్డుకోలేక బిజెపి ఈ విధంగా కుట్రలుచేస్తోందని ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు. బిజెపికి చెందిన పర్వేశ్ వర్మ న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌పై పోటీలో ఉన్న సంగతి తెలిసిందే. బిజెపి కార్యకర్త ఒకరు మాజీ సీఎం కారును ఢీకొట్టారన్న ఆరోపణలు కూడా వెలువడ్డాయి. ఓటమి భయం బిజెపిని పట్టుకుని పీడిస్తోందని అందుకే తమ అధినేతపై ఇలా దాడులు చేస్తోందంటూ ఆప్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఢిల్లీ మాజీ సీఎం సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడయిన పర్వేశ్‌వర్మ మద్దతుదారులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని, ప్రచారంనుంచి తమ నాయకుడిని తప్పించే లక్ష్యంతోనే ఈ కుట్రలు చేస్తున్నారని, ఢిల్లీప్రజలు తగిన గుణపాఠం చెపుతారని అన్నారు. బిజెపి అభ్యర్థి గూండాలే ఈపనులకు పాల్పడ్డారని ఆరోపించారు. కేజ్రీవాల్ కారుపై దాడి జరిగిన ఘటనను మాజీ డిప్యూటి సిఎం మనిశ్‌సిసోడియా తీవ్రంగా ఖండించారు. కేజ్రీవాల్‌చేసిన కృషికి ధీటుగా పోటీచేసే ధైర్యం లేకనే ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో ఓటర్లు సరైన గుణపాఠం చెపుతారన్నారు. ఒక నల్లటి ఎస్‌యువి కారుకు ఓపక్క సెక్యూరిటీ ఉంటే మరోవైపు కొందరు నిరసనకారులు వెంటపడుతున్నట్లు విడియోలు వైరల్ అయ్యాయి. ఒక పెద్దరాయి కారు రూఫ్‌ను తాకడం కూడా కనిపించింది. అయితే బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మ కేజ్రీవాల్ తెంపరితనంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కారు దూసుకుని పోవడంతో మా బిజెపి కార్యకర్త కాలు దెబ్బతిన్నదని ఆతని ఆరోగ్యం క్షీణిస్తోందని చికిత్స పొందుతునన లేడీ హార్డింగ్ వైద్యకళాశాల ఆసుపత్రికి ఇపుడు వెళుతున్నానని, కేజ్రీవాల్ చర్యలు సిగ్గుచేటని వర్మ ప్రత్యారోపణలుచేసారు. అంతకుముందురోజే అరవింద్ కేజ్రీవాల్‌పై ఖలిస్తానీ సానుకూల వాదులు దాడులకు కుట్రలు చేస్తున్నారని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ హెచ్చరికలపై కేజ్రీవాల్ స్పందిస్తూ ఆదేవుడే తనను కాపాడతాడని అన్నారు. దేవుడు శాసించినంతకాలం తాను జీవించే ఉంటానన్నారు.



## ఒలింపిక్ బంగారు పతకం వేలంలో రూ.4.72 కోట్లు!

**వాషింగ్టన్, జనవరి 18:** అమెరికా గడ్డపై తొలిసారిగా సెయింట్ లూయి నగరంలో 1904లో జరిగిన ఒలింపిక్స్ క్రీడల బంగారుపతకం తాజా వేలంలో రూ.4.72 కోట్లు పలికినట్లు సంబంధిత కంపెనీ వెల్లడించింది. ఈ పతకానికి ఓ వైపున ఒలింపియాడ్, 1904 అనే అక్షరాలతో పాటు విజేతగా నిలిచిన అథ్లెట్ పూలదండ పట్టుకొన్న బొమ్మ ఉంది. మరోవైపు పురాతన గ్రీకు పురాణాల్లోని విజయదేవత నైక్‌తో పాటు దేవతల రాజు అయిన జ్యూస్ బొమ్మను చిత్రించారు. 110 మీటర్ల హార్డిల్స్ పోటీల విజేత అయిన అమెరికన్ క్రీడాకారుడు ఫ్రెడ్ షుల్‌కు ఈ స్వర్ణపతకాన్ని ప్రదానం చేశారు. దీంతో పాటు ఇచ్చిన రిబ్బను, లెదర్ బాక్సు కూడా అలాగే ఉన్నాయి. వీటితోపాటు మరికొన్ని స్మారక వస్తువులను వేలం వేశారు. సెయింట్ లూయి ఒలింపిక్స్‌లోనే విజేతలకు తొలిసారిగా అచ్చమైన బంగారు పతకాలు ఇచ్చారు. నాటి క్రీడల్లో మొతనతం 96 బంగారు పతకాల్లో 78 మెడల్స్ అమెరికన్లే గెలుచుకున్నారు. 1932 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్, 1964 టోక్యో, 1998 నగానో, 2012 లండన్ ఒలింపిక్స్‌లలో గెలిచిన స్వర్ణరజత పతకానికి వేలంలో రూ.4.2 కోట్లు ధర పలికింది.

## తాము మళ్లీ అధికారంలోకి వస్తే అద్దె ఇళ్లలో ఉండేవారికి ఉచిత విద్యుత్, నీరు: కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, జనవరి 18:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార ఆమ్ ఆద్మీ ఢిల్లీ ప్రజలకు వరుస సంక్షేమ పథకాలను ప్రకటిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ తాజాగా మరో హామీని ప్రకటించారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజధానిలోని అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వాంచల్‌కు చెందిన అనేక మంది కౌలుదారులకు సైతం ఉచిత విద్యుత్, నీటి సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తాము ఉచిత పాఠశాలలు, ఆసుపత్రుల నుంచి ప్రయోజనం పొందుతున్నామని, కానీ ఉచిత విద్యుత్, నీరు వంటి పథకాలకు దూరంగా ఉంటున్నామని అద్దె ఇళ్లల్లో నివసించేవారు పేర్కొంటున్నారని కేజ్రీవాల్ అన్నారు. అందుకే వారి సమస్యను పరిష్కరించి వారికి ప్రయోజనం కలిగించేలా చర్యలు తీసుకోవడానికి తమ పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. ఉచితాలకు దూరంగా ఉండే బిజెపి సైతం సంకల్ప పత్రా పార్ట్ 1 పేరుతో విడుదల చేసిన పార్టీ మేనిఫెస్టో గర్భిణులకు రూ.21వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై రూ.500లకే ఎల్పీజి సిలిండర్లు, మహిళా సమృద్ధి యోజన కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థికసాయం వంటి హామీలను ప్రకటించింది. నేడు ఢిల్లీలో విలేకరులతో జరిగిన సమావేశంలో అన్‌బ్రేకబుల్ అనే డాక్యుమెంటరీని ఆప్ ప్రదర్శించడంపై వివాదం చెలరేగింది. ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించడానికి ఆప్ నేతలు తమ అనుమతి తీసుకోలేదని పేర్కొంటూ పోలీసులు ప్రసారాన్ని నిలిపివేశారు. దీనిపై కేజ్రీవాల్ స్పందిస్తూ ఎన్నికలను ఉద్దేశించి ఈ డాక్యుమెంటరీ ప్రసారం చేయలేదని స్క్రీనింగ్ ప్రదేశంలో ఎన్నికల జెండా, ప్రచారం వంటివేమీ నిర్వహించలేద న్నారు. బిజెపి చేస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవ్యతిరేక చర్యలను బహిర్గతం చేస్తున్నామనే భయంతో ఆ పార్టీ ఈ విధమైన చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.

## ఫ్యాన్‌కు ఉరివేసుకుని మరో విద్యార్థి ఆత్మహత్య

### నాలుగురోజుల్లో జెఇఇ పరీక్ష

**జైపూర్, జనవరి 18:** జెఇఇ పరీక్షలకు శిక్షణ పొందుతున్న రాజస్థాన్‌లోని బుంది ప్రాంత విద్యార్థి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ధృవీకరించారు. జవహర్‌నగర్‌పోలీస్ స్టేషన్‌పరిధిలోని కోటా ప్రాంతంలో తన తాత ఇంట్లోనే ఈ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరోవైపు జెఇఇ పరీక్షలకు కేవలం నాలుగు రోజులే ఉంది. మృతుడిని మనన్‌శర్మగా గుర్తించారు. 12వ తరగతి చదువుతూనే జెఇఇకి శిక్షణ కోసం కోటకు వచ్చి తన తాతగారింట్లో ఉంటున్నాడు. ఉదయంపూట మనన్‌కు ఫోన్‌చేస్తే స్పందించలేదని, ఆ తర్వాత ఆతడి సోదరుడు పక్కనే గదిలో నిద్రిస్తుండగా ఆతడికి ఫోన్‌చేసారు. ఆతడు లేచి మనన్ ఉంటున్న గదిలోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉరివేసుకుని వేలాడుతున్న మనన్‌ను చూసినట్లు పోలీసులు తెలిపారు. ఎఎస్‌ఐ జవహర్‌సింగ్ మాట్లాడుతూ 17 ఏళ్ల ఇంటర్‌విద్యార్థి బుండిజిల్లాలోని ఇందర్ ఘర్ ప్రాంతానికి చెందినవాడన్నారు. మనన్ కుటుంబం ఆతడికి పోస్టుమార్టం చేయడానికి నిరాకరించారు. అయితే ఆతని మేనమామ మహావీర్‌జైన్ మాత్రం తల్లితండ్రుల అంగీకారంతో కళ్లను దానం చేసారు. మూడేళ్లనుంచి కోటలోనే చదువుతున్నాడని, అత్యంత తెలివైన వాడని మేనమామ జైన్ చెప్పారు. తల్లితండ్రులకు మనన్ ఒక్కడే కుమారుడని, మనన్ తండ్రి మనిష్‌జైన్ వ్యాపారి అని పోలీసులు తెలిపారు. మనన్ ఆత్మహత్యకు గలకారణాలు మాత్రం తెలియరాలేదు. ఈనెలలోనే రాజస్థాన్‌లోని కోటకు సంబంధించినంతవరకూ నాలుగో ఆత్మహత్యగా పోలీసులు చెపుతున్నారు. ఈనెల 8వతేదీ విజ్ఞాన్‌నగర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో 19ఏళ్ల అభిషేక్‌లోధా మధ్యప్రదేశ్‌లోని గుణనుంచి వచ్చి కోచింగ్‌కు వెళుతున్నాడు. ఫ్యాన్‌కు ఉరివేసుకని చనిపోయాడు. ఈనెల ఏడో తేదీ నీరజ్‌జాట్ అనే విద్యార్థి హర్యానాలోని మహేందర్‌ఘర్ నుంచి వచ్చి చదువుకుంటున్నాడు. ఆతడు కూడా హాస్టల్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకని చనిపోయాడు. రెండేళ్లుగా ఆతడు కోటలోనే ఉంటూ చదువుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆర్జీకర్ కేసులో సంజయ్‌రాయ్ దోషి

### మీకు శిక్ష పడాల్సిందే: న్యాయమూర్తి

### సోమవారం శిక్షలు నిర్ధారిస్తాం

### కన్నీటిపర్యంతం అయిన బాధితురాలి తండ్రి



**కోల్‌కత్తా, జనవరి 18:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీకర్ ఆసుపత్రి వైద్యురాలి హత్యాచారంకేసులో తీర్పు వెలువడింది. కేసులో మొత్తం 160 పేజీలతో కూడిన తీర్పుకాపీని కూడా న్యాయమూర్తి రూపొందించారు. జడ్జి తీర్పు చదువుతుంటే దోషి సంజయ్ మరోవైపు బాధితురాలి తండ్రి,బంధువుల కన్నీటి రోదనలతో కోర్టుహాలు మారుమోగింది. నిందితుడు సివిక్ పోలీస్ వలంటీర్ సంజయ్‌రాయ్‌ను దోషిగా న్యాయమూర్తి నిర్ధారించారు. ఆయన సీటులో ఆసీనులవుతూనే సంజయ్‌వైపు చూసి మీకు శిక్ష పడాల్సిందేనని వ్యాఖ్యలుచేసారు. అయితే తాను ఈపనిచేయలేదని, ఈ కేసులో నన్ను ఇరికించారని, తప్పుచేసినవాళ్లను ఎందుకు వదిలేస్తున్నారని, ఏతప్పుచేయని నన్ను ఎందుకు శిక్షిస్తున్నారని గట్టిగా రోదించాడు. ఆ సమయంలోనే జడ్జి అనిర్‌బన్ దాస్ జోక్యం చేసుకుని నువ్వేమైనా మాట్లాడదలుచుకుంటే సోమ వారం శిక్ష ఖరారుచేసే సమయంలో అవకాశం ఇస్తామని అన్నారు. దీనితోసంజయ్ మౌనం వహించాడు. కోల్‌కత్తాలోని రాధా గోవింద్‌కర్ ఆసుపత్రిలోని సెమినార్ హాలులో గత ఏడాది ఆగస్టు ఏడోతేదీ ఒక పిజి వైద్యవిద్యార్థిని అర్ధనగ్నంగా విగతజీవిగా కనిపించింది. వైద్యసిబ్బంది దేశవ్యాప్తనిరసనలకు దారితీసింది. మూడురోజుల తర్వాత సంజయ్ రాయ్ అనే సివిక్ పోలీస్ వాలంటీర్‌ను పోలీసులు అరెస్టుచేసారు. తర్వాత ఈకేసు సిబిఐకి బదలాయించడంతో సిబిఐ సంజయ్‌రాయ్ మాత్రమే దోషి అని తేల్చి అభియోగపత్రాన్ని దాఖలుచేసింది. అయితే సాక్ష్యాలు తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న అభియోగాలు కళాశాలప్రిన్సిపల్ సందీప్‌ఘోష్, కళాశాల ఆవరణలోని తాలా పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ అభిజిత్ మోండల్‌ను కూడా సిబిఐ అరెస్టు చేసింది. అయితేవారికి తర్వాత న్యాయస్థానంలో బెయిల్ లభించింది. బిఎన్‌ఎస్ సెక్షన్ 64,66,103(1) కింద అత్యాచారం హత్య నేరాలకింద సంజయ్ రాయ్‌ను దోషిగా ప్రకటించింది. దీనితో మరణశిక్ష లేదా జీవితఖైదుకానీ పడే అవకాశాలున్నాయి.

## మోహన్ భగవత్ వ్యాఖ్యలను ఖండించిన రాహుల్ గాంధీ



**పాట్నా, జనవరి 18:** దేశ స్వాతంత్ర్యం విషయంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహు ల్‌గాంధీ విరుచుకుపడ్డారు. ఆయన రాజ్యాంగ విరుద్ధంగా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన సంవిధాన్ సురక్ష సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అణగారిన వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. మైనారిటీ, దళితులు రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ, వారికి ఎలాంటి అధికారాలు ఉండటం లేదు. ఆర్‌ఎస్‌ఎస్ సహా మరికొన్ని సంస్థలే దేశాన్ని నడుపుతున్నాయి. దేశ సంపద కొందరు పారి శ్రామికవేత్తల చేతుల్లోనే ఉంది. భారత రాజ్యాంగం ఒక పుస్తకం మాత్రమే కాదని దళితులు ఎదుర్కొన్న అన్యాయాల గురించి అది మాట్లా డుతుంది అని రాహుల్ పేర్కొన్నారు. దేశవ్యా ప్తంగా కులగణన ఖచ్చితంగా అవసరమని, ఇది అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తుందని రాహుల్ అన్నారు. కాగా ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మో హన్ భగవత్ స్వాతంత్ర్యం విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో రామమందిర ప్రతిష్టాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందన్నారు. శత్రువులతో భారత్ ఎన్నో శతాబ్దాల పాటు పోరాడిందని, అయితే రామమందిర ఉద్యమం ఎవరినీ వ్యతిరేకించ డానికి ప్రారంభించింది కాదన్నారు. దేశం తనను మేలుకొల్పుకోవడానికి చేసింది మాత్రమేనని అన్నారు. భారత్ తన కాళ్లపై నిలిచి ప్రపంచానికి మార్గం చూపుతుందని, రామమందిర ప్రతిష్టాపన సందర్భంగా దేశంలో ఎలాంటి అసమ్మతి చోటు చేసుకోలేదన్నారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మోహన్ భగవత్ రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడారని విమర్శించారు.

## అమెరికన్లకు 'ట్రంప్ సుంకాలు, పన్నుల దెబ్బ' అనివార్యం

### కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ



**ఒట్టావా, జనవరి 18:** భరించలేని స్థాయిలో టారిఫ్‌లు విధిస్తానని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదరిస్తున్న నేపథ్యంలో కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ స్పందించారు. ట్రంప్ సుంకాలు పెంచితే అమెరికన్లకు కూడా 'ట్రంప్ సుంకాలు, పన్నుల దెబ్బ' తప్పదంటూ హెచ్చరించారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో ఆమె వ్యాఖ్యానించారు. అమెరికా, కెనడాల మధ్య దశాబ్దాల కాలంలో ఇదే అతిపెద్ద వాణిజ్య యుద్ధమని మెలానీ పేర్కొన్నారు. ఏ వాణిజ్యంలోనైనా కఠినమైన ప్రతిస్పందన తప్పకుండా ఉంటుందని ఆమె ప్రతిజ్ఞ చేశారు. ట్రంప్ తన హెచ్చరికలు అమలుచేస్తే ఎదుర్కొనేందుకు కెనడా సిద్ధంగా ఉందన్నారు. ఆ చర్య తమ వినియోగదారులు, కెనడా ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఇటీవల కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకం విధించనున్నట్లు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. వలసలు, డ్రగ్స్ అక్రమరవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయలేకపోతే అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు చురకలంటించారు. ట్రంప్ హెచ్చరికలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కెనడా ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు ట్రూడో తన ప్రధాని పదవితోపాటు లిబరల్ పార్టీ నాయకత్వం బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు ఇటీవల ప్రకటించారు. తన వారసుడిని పార్టీ ఎంపిక చేసే వరకు ప్రధాని పదవిలో కొనసాగుతానని స్పష్టీకరించారు.

## ఒహాయో నుంచి గవర్నర్ రేసులో వివేక్ రామస్వామి!



**వాషింగ్టన్, జనవరి 18:** భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి తన సొంత రాష్ట్రం ఒహాయో నుంచి గవర్నర్ ఎన్నికల్లో పోటీ చేస్తారని అమెరికాకు చెందిన పలు వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఈ పోటీ గురించి రామస్వామి త్వరలో ప్రకటన విడుదల చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం డొనాల్డ్ ట్రంప్ రూపొందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డిఒజిఇ)కు వివేక్, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ సంయుక్త సారథులుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. వృథా ఖర్చులను తగ్గించడం, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా డోజ్ పని చేస్తోంది. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొనే 2026 జూలై 4వ తేదీలోపు డోజ్ లక్ష్యాన్ని పూర్తి చేసి, గవర్నర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి వివేక్ సమాయత్తమవుతున్నట్లు సమాచారం. ఒహైయో గవర్నర్ ఎన్నికలు నవంబరు 2026లో జరగనున్నాయి. ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం కోసం రామస్వామి తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యారు. తర్వాత రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం కోసం తీవ్రంగా శ్రమించారు. 38 యేళ్ల ఈ బయోటెక్ పారిశ్రామికవేత్త నిస్సంకోచంగా మాట్లాడతారనే పేరుంది. ట్రంప్ తరఫున ఇంటర్వ్యూల్లో వాదనలు వినిపించారు. రామస్వామి పనితీరును గమనించి డొనాల్డ్.. పెన్సిల్వేనియాలో జరిగిన సభలో ఆయనను తన కార్యవర్గంలోకి తీసుకొంటానని ప్రకటించారు. మొదట ఆయనకు విదేశాంగశాఖ బాధ్యతలు అప్పగించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ట్రంప్ ప్రచార బృందంలో కీలక భూమిక వహించిన మార్కో రూబియోకు ఆశాఖ దక్కే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

వివేక్ రామస్వామి ఒహారియోలో 1985 ఆగస్టు 9న జన్మించారు. ఆయన వయస్సు 37 సంవత్సరాలు. కేరళకు చెందిన ఆయన తల్లిదండ్రులు అమెరికాకు వలస వచ్చారు. ఆయన సోషల్ మీడియాలో తనను తాను క్యాపిటలిస్ట్, సిటిజెన్‌గా అభివర్ణించుకుంటారు. హార్వర్డ్ నుంచి బయోలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. యేల్ లా స్కూల్‌లో ఉన్నతవిద్యను పూర్తి చేశారు. విద్యాభ్యాసం తర్వాత సొంతంగా బయోటెక్ సంస్థ(రాయివంట్ సైన్సెస్)ను స్థాపించారు.

# మృత్యువు నుంచి త్రుటిలో తప్పించుకున్నాం

## బంగ్లాదేశ్ మాజీ పిఎం షేక్ హసీనా



**ఢాకా, జనవరి 18:** అనూహ్యంగా పదవిని కోల్పోయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో షేక్ హసీనా కీలక విషయాలు వెల్లడించారు. అధికారంలో ఉన్నప్పుడు తనపై జరిగిన హత్యాయత్నాల గురించి ఆమె తెలిపారు. గతేడాది ఆగస్టులో అవామీ లీగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మంగా మారడంతో దాదాపు 600 మందికిపైగా మరణించారు. దాంతో ప్రధానిగా ఉన్న షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే తనపై హత్యాయత్నం జరిగిందని హసీనా పేర్కొన్నారు. ఆ సమయంలో తాను, తన సోదరి రెహానా 20-25 నిమిషాల వ్యవధిలో చావు నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత భారత్‌కు చేరుకున్నామన్నారు. అవామీ లీగ్ పార్టీ ఫేస్‌బుక్ ఖాతాలో ఆడియో సందేశంలో ఆమె ఈ మేరకు వ్యాఖ్యానించారు.

గతంలోనూ పలుసార్లు తనపై జరిగిన హత్యాయత్నాల గురించి హసీనా వెల్లడించారు. '2000 యేడాదిలో కోటలీపర బాంబు దాడి నుంచి బయటపడ్డాను. 2004 ఆగస్టులోనూ ప్రాణాపాయస్థితిలోంచి బయటపడ్డా. మరోసారి 2024 ఆగస్టు 5న చావు నుంచి తప్పించుకోగలిగాను. లేకపోతే ఈపాటికే ప్రాణాలు కోల్పోయిఉండేదాన్ని'అని హసీనా పేర్కొ న్నారు. 'నేను ప్రాణాలతో ఉన్నప్పటికీ.. నా దేశంలో, నా ఇంట్లో ఉండే అవకాశం లేకుండా పోయింది' అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు.

2000 యేడాదిలో గోపాల్‌గంజ్ జిల్లాలోని కోటలీపరలో ఎన్నికల ర్యాలీకి వెళ్లిన హసీనాపై ఉగ్రవాదులు దాడికి యత్నించారు. 'హర్కతుల్ జీహాద్ బంగ్లాదేశ్‌కు చెందిన ఉగ్రవాదులు బాంబులు పెట్టి ఆమెను హతమార్చాలని చూశారు. పక్కా సమాచారంతో బాంబు నిర్వీర్య బృందాలు వాటిని తొలగించడంతో దాడి నుంచి హసీనా బయటపడ్డారు. 2004 ఆగస్టులో ఉగ్రవాద వ్యతిరేక ర్యాలీలో దాడి జరిగింది. ఇందులో 24 మంది మృతి చెందగా, 500 మంది గాయపడ్డారు. ఈదాడిలో హసీనాకు సైతం గాయాలయ్యాయి.

పదహారేళ్లుగా కొనసాగుతున్న షేక్ హసీనా ప్రభుత్వం గతేడాది ఆగస్టులో జరిగిన ఉద్యమం కారణంగా పడిపోయింది. దీంతో పదవీచ్యుతురాలైన ఆమె స్వదేశాన్ని వీడి భారత్‌కు వచ్చి ఓ రహస్య ప్రాంతంలో నివసిస్తున్నారు. ఆ తర్వాత స్వదేశంలో ఆమెపై అనేక కేసులు నమోదయ్యాయి. అరెస్టు వారెంట్లు కూడా జారీ అయ్యాయి. ఈ క్రమంలోనే హసీనాను తమకు అప్పగించాలంటూ గత డిసెంబరులో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం భారత ప్రభుత్వానికి ఒక దౌత్య సందేశం పంపింది. అయితే, 'ఈ వ్యవహారంపై తాము వ్యాఖ్యానించాల్సిందేమీ లేదు' అని భారత విదేశీ వ్యవహారాలశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అప్పట్లో ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆమె పాస్‌పోర్టును బంగ్లా ప్రభుత్వం రద్దు చేసింది.

# ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి

## - పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్



**సూళ్లూరుపేట, జనవరి 18 ప్రభాతవార్త** రాష్ట్రంలో ప్రైవేటు భాగస్వామ్యంతో టూరిజాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం ఆయన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరుల సూచనల మేరకు రాష్ట్రంలో టూరిజంను అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముగ్గురు మంత్రులతో కేబినెట్ కమిటీని వేయడం జరిగిందని తెలిపారు. టూరిజంతోనే రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందన్నది సీఎం అభిమతమని దుర్గేష్ చెప్పారు. పర్యావరణంతో పాటు మానవుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని పులికాట్ తీరప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు ఉపయోగపడేలా వన్య ప్రాణి విభాగంలోని కొన్ని నిబంధనలు సులభతరం చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఒక రాజకీయ నిర్ణయం అవసరమని, ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపడుతుందని తెలిపారు. పులికాట్ పరిధిలోని బివిపాలెం రిసార్ట్ వద్ద కొన్ని శిథిలావస్థలో ఉన్నాయని, తడ, దొరవారిసత్రంలోని పున్నమి రెస్టారెంట్లు కొంత దెబ్బతిని ఉండటాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వీటన్నింటిని ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తామని చెప్పారు. రాష్ట్రంలో టూరిజంను పరిశ్రమలా గుర్తించామని, దీనిద్వారా ఆదాయ వనరులు ఎక్కువగా ఉంటాయని దుర్గేష్ తెలిపారు. ఇప్పటికే పారిశ్రామికవేత్తలతో విజయవాడ, వైజాగ్‌లలో చర్చలు జరిపామన్నారు. విశాఖ ఉత్సవం, తిరుపతి, కాకినాడ ప్రాంతాల్లో ఫ్లెమింగో ఫెస్టివల్ తరహాలో ఉత్సవాలు నిర్వహించి పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. నేలపట్టు, పులికాట్, బివిపాలెం, ఇతర ప్రాంతాలను కలుపుకొని టూరిజం హబ్‌గా చేసుకొని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా వన్యప్రాణి విభాగం వారు రూపొందించిన పులికాట్, నేలపట్టు పక్షుల అట్లాస్, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు విద్యార్థులు ఫ్లెమింగో నృత్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం తదితరులు పులికాట్ విశిష్టతను గురించి ప్రసంగించారు.

# కన్నుల పండువగా హరిహరుని ఆలయ కుంభాభిషేకం

## రూ.40లక్షలతో కొత్త ఆలయం - మహా శివరాత్రికి ముస్తాబు

**శ్రీకాళహస్తి,జనవరి 18 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఆలయాల జీర్ణోద్ధారణ జరుపుకున్న ఆలయాల కుంబాభిషేకం సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఇఓ టి.బాపిరెడ్డి శనివారం తెలిపారు. రూ.40లక్షలతో శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని రాజీవ్‌నగర్ వద్ద ఉన్న కైలాసగిరి పనస కోనలో వెలసిన అన్నపూర్ణేశ్వరి సమేత హర హరుని ఆలయం కుంబాభిషేకం సంబరాలు ప్రారంభమయ్యాయన్నారు. శ్రీకాళహస్తి దివ్యక్షేత్రం శైవాలయాలకు నిలయంగా ఉందన్నారు. శ్రీకాళహస్తి చుట్టూ ఉన్న పురాతన ఆలయాలకు మహర్దశ కల్పించబడుతుందన్నారు. పురాతన కాలం నాటి శిథిలావస్థకు చేరుకున్న ఆలయాలను జీర్ణోద్ధారణ గావించి కొత్తగా రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో పర్యటక కేంద్రంగా ఉన్న హరహర తీర్థంలో వెలసిన స్వామి అమ్మవార్ల ఆలయాలను కొత్తగా నిర్మించామన్నారు. జలపాతాలు కొండ కొనల్లో వెలసిన స్వామి అమ్మవార్లకు నిర్మించిన కొత్త ఆలయాల కుంబాభిషేకం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. శ్రీకాళహస్తిలో దర్శనీయ స్థానాల్లో పనస కోన ఓ దివ్యానుభూతికి అందిస్తుం దన్నారు. ఇక్కడ చక్కగా పరమేశ్వరునితో పాటు యోగ చేసుకోవటానికి ఎంతో అనుకూలంగా ఉంటుం దన్నారు. రాజీవ్‌నగర్, కైలాసగిరి కాలనీ, రామచం ద్రాపురం, చుట్టుపక్కల గ్రామాల వారికి ఓ అందమైన భక్తిభావంతో కూడిన శివాలయం వచ్చిందన్నారు. కాగా రూ.25లక్షలతో కుమారస్వామి కొండ దిగువ భాగాన వినాయకునికి కొత్త మండపంను నిర్మించామని, భిక్షాల గాలిగోపురం పక్కన ఎంతో కాలంగా పూర్తి కాని రూ.1.25కోట్లతోనిర్మించిన వాహనాల మండపం పనులు పూర్తి చేసామని వాటి కుంబాభిషేకం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నూతనంగా నిర్మించిన హరహరుని ఆలయం కుంభాభిషేకం కార్యక్రమాలను అంకుర్పారణతో శ్రీకారం చుట్టారు. ఆలయంలో



అభిషేక దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయంలోని గర్భాలయం ఎదురుగా హోమాలను ఏర్పాటు చేసారు. ఆలయ పౌరోహితులు వేదపండితుడు అర్ధగిరి స్వామి మంత్రాలను పఠిస్తుండగా స్వామినాధన్ పూజలు నిర్వహించారు.

మూడు రోజుల పూజలకు కలశ స్థాపన గావించారు. ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి హాజరై అర్చకులకు కొత్త బట్టలను అందించారు. ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చక దక్షిణామూర్తి, సుబ్రమణ్యం శర్మ తదితరులు హాజరయ్యారు.

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు, అజ్ఞాతంలోకి డాక్టర్ పద్మావతి!



**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామరాజు ఎంపీగా ఉన్న సమయంలో కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు జీజేహెచ్ మాజీ సూపరింటెండెంట్ అధికారి డాక్టర్ పద్మావతి అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు సమాచారం. ఆమెని అరెస్ట్ చేసేందుకు విచారణ అధికారి, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. అయితే, ఆమె పోలీసుల కల్లుగప్పి విచారణకు హాజరు కాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పద్మావతి ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేసేందుకు నాలుగు పోలీసు బృందాలు రంగంలోకిదిగి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విచారణకు హాజరుకావాలని నాలుగు సార్లు ఆమె ఇంటికివెళ్లి పోలీసులు నోటీసులు అందించిన విషయం తెలిసిందే. అయినా పోలీసు విచారణకు పద్మావతి హాజరుకాలేదు. పద్మావతి అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఆమె నివాసానికి పోలీసులు నోటీసులు అంటించారు. ఇటీవల ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ పద్మావతి హైకోర్టును ఆశ్రయించగా.. ఈనెల 10న పిటిషన్ ను కోర్టు తిరస్కరించింది. దీంతో ఆమె విదేశాలకు వెళ్లకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. రఘు రామరాజు కస్టోడియల్ సమయంలో ఆయనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే అభియోగంలో శరీరంపై ఎటువంటి గాయాలు లేవని డాక్టర్ పద్మావతి తప్పుడు నివేదిక ఇచ్చారని ఆభియోగాలున్నాయి. రఘు రామరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఇప్పటికే సీఐడీ విభాగపు మాజీ ఏఎస్పీ విజయ్ పాల్, కొడాలి నాని మంత్రిగా ఉన్న సమయంలో ఆయన అనుచరుడిగా కొనసాగిన తులసి బాబు అరెస్ట్ అయ్యారు. వారిద్దరూ రిమాండ్ లో ఉన్నారు. తులసిబాబు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నాడు.

# తెలంగాణలో టిడిపిని పునర్నిర్మిస్తాం

## ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ తీరుపై ఏపి మంత్రి నారా లోకేశ్ అసహనం

## తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీఆర్: నందమూరి బాలకృష్ణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** తెలుగుదేశం వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్థంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శనివారం ఏపి విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించి తర్వాత మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్ ఉందన్నారు. అందుకోసం ఏపి సిఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నారని చెప్పారు. ఈనెలాఖరు నుంచి రాజధాని అమరావతి పనులు ఊపందుకుంటాయన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పునర్నిర్మాణం చేస్తామని ఉద్ఘాటించారు. రెండు రాష్ట్రాల సీనియర్ నేతల సూచనలతో పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. ఎన్టీఆర్ కేవలం మూడు అక్షరాలు కాదు.. అదొక ప్రభంజనమని అన్నారు. రాజకీయాల్లో కూడా ఎన్టీఆర్ ఎన్నో సేవలు చేశారని గుర్తుచేశారు. రూ.2లకే కిలో బియ్యం అందించారని తెలిపారు. మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. ఏదైనా తప్పు జరిగితే.. దానిని సరిదిద్దడానికి పార్టీలో పెద్దలు ఉన్నారని అన్నారు. తన చిన్నతనంలో తాతయ్య ఆబిడ్స్‌లో ఉండేవారని గుర్తు చేసుకున్నారు. మనుమళ్లు, మనమరాళ్లను కారులో తీసుకుని స్వయంగా ఆయనే డ్రైవ్ చేస్తూ గండిపేట్ తీసుకెళ్లేవారని అన్నారు. అది తనకు ఎప్పుడూ గుర్తుండిపోయే జ్ఞాపకమని చెప్పారు. తెలంగాణలోనూ టీడీపీపై ప్రజలకు ఎంతో ప్రేమ ఉందన్నారు. అందుకు ఉదాహరణ స్వచ్ఛందంగా లక్షా 60వేల సభ్యత్వాలు ప్రజలు తీసుకోవడమని గుర్తుచేశారు.

ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ తీరుపై లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ 29వ వర్థంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద లోకేశ్ నివాళులు అర్పించారు. అయితే ఘాట్ నిర్వహణను చూసి ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్‌ఎండీఏ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతు పనులు తన సొంత నిధులతో వెంటనే చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఘాట్ నిర్వహణ తమకు అప్పగించాలని గతంలో పలుమార్లు తెలంగాణ ప్రభుత్వానికి ఎన్టీఆర్ ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. తాజాగా ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను చూసి ఎంతో బాధపడిన మంత్రి లోకేశ్.. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా మరమ్మతు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

కాగా, అంతకుముందు ఎన్టీఆర్‌ఘాట్ వద్దకు నందమూరి, నారా కుటుంబ సభ్యులు, బంధు వులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. జూ.ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, లక్ష్మీ పార్వతి, ఏపీ అసెం బ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు ప్ర ముఖులు వచ్చి ఎన్టీ ఆర్‌కు నివాళులు అర్పించారు.



శనివారం ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నందమూరి బాలకృష్ణ, ఎపి మంత్రి నారా లోకేష్, ఎపి సిఎం సతీమణి నారా భువనేశ్వరి తదితరులు

ఎన్టీఆర్ కుమారులు బాలకృష్ణ, రామకృష్ణ, మనవరాలు నందమూరి సుహాసిని తదితర కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ నటుడిగా, నాయకుడిగా ఎన్టీఆర్ తనకుతానే సాటి అని చెప్పారు. ఎన్టీఆర్‌తోనే తెలుగువారిలో రాజకీయ చైతన్యం వచ్చిందని అన్నారు. ఎన్టీఆర్ ముందు.. ఆ తర్వాత అనే విధంగా తెలుగు రాజకీయాలు ఉన్నాయని నందమూరి బాలకృష్ణ అన్నారు. ప్రజల వద్దకు పాలన తీసుకు రావటానికి ఎన్టీఆర్ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. ఇప్పటికీ ఎన్టీఆర్ పథకాలనే ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ఎన్టీఆర్ అంటే ఒక వర్సిటీ.. తెలుగుజాతికి మార్గదర్శకమని అని చెప్పారు. ఎన్టీఆర్ అంటే నటనకు నిర్వచనం.. నవరసాలకు అలంకారమని తెలిపారు. పేదలకు ఉపయోగపడే పథకాలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టారని ఉద్ఘాటించారు. కష్టజీవుల కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి టీడీపీ పుట్టిందని బాలకృష్ణ ఉద్ఘాటించారు. వివిధ వర్గాల వారికి ఎన్టీఆర్ దైవసమానమని అన్నారు. కార్యకర్తలను నాయకులుగా తయారుచేసింది ఎన్టీఆర్ మాత్రమే అని చెప్పారు. మద్రాసు నగరానికి మంచి నీళ్లు ఇచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని నందమూరి బాలకృష్ణ కొనియాడారు.

# వారాంతం.. వైకుంఠద్వారం చివరి ఘడియలు

## - అమాంతం పెరిగిన భక్తులు



**తిరుమల,జనవరి 18 ప్రభాతవార్తప్రతినిధి:** దర్శన టిక్కెట్లు, టోకెన్లుఉంటేనే ఆలయంలోనికి అనుమతించి వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తున్నా వారాంతం శనివారం అమాంతంగా తిరుమలలో భక్తులు పోటెత్తారు. గత వారంలో వరుసగా నాలుగురోజులు పండుగ సెలవులొచ్చినా కనిపించని భక్తులు వైకుంఠద్వార ఘడియలు చివరిరోజు విపరీతంగా భక్తులరద్దీ ఉంది. శనివారం తిరుమలకొండ భక్తులతో కిటకిటలాడుతోంది. సోమవారం నుండి సాధారణ సర్వదర్శనంలో భక్తులను అనుమతిస్తామని టిటిడి అధికారులు ముందుగానే ప్రకటించినా ఇవేమీ ఖాతరుచేయని భక్తులు దేవుని ఆలయం ఎదుట మొక్కులు చెల్లించుకునేందుకు రావడం విశేషం. వైకుంఠద్వార దర్శనాలు ఆదివారం రాత్రి వరకు కొనసాగుతుండటంతోబాటు పైగా 50వేల టోకెన్లు జారీచేయడంతో సామాన్యభక్తులు తిరుమలలో ఉన్నారు. ఇష్టదైవమ్ దర్శించుకునేందుకు భక్తులు భారీగా చేరారు. ఎక్కడా క్యూలైన్లలోనికి భక్తులను అనుమతించడంలేదు. కొండపైకి చేరుకున్న భక్తులకు నిరంతరాయంగా శ్రీవారిసేవకులుఅన్నప్రసాదాలు, టీ, పాలు, కాఫీ పంపిణీచేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత భక్తులను వైకుంఠమ్ 2లోనికి అనుమతించేలా చూడనున్నారు.

# కోటిన్నర సభ్యత్వాలతో ఎన్టీఆర్‌కు లోకేష్ నివాళి

## - స్టీల్ ప్లాంట్‌కు నిధులు తీసుకువచ్చిన దమ్మున్న నాయకుడు చంద్రబాబు : టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

**అనకాపల్లి, జనవరి 18, ప్రభాతవార్త** తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావుకు మంత్రి నారా లోకేష్ కోటిన్నర సభ్యత్వాలతో ఘన నివాళులు అర్పించారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు దేశంలో మరే ప్రాంతీయ పార్టీకి కనీసం కోటి సభ్యత్వాలు లేవని కోటిన్నర సభ్యత్వాలు చేయించి తన తాత ఎన్టీఆర్‌కు లోకేష్ నిజమైన నివాళులు అర్పించారని అన్నారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య నానాటికి పెరిగిపోతుందని దీనిపై లోకేష్ దృష్టి సారించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి జాబ్ మేళ కార్యక్రమాలు ఊపందుకున్నాయని అన్నారు. పెద్ద పెద్ద కంపెనీలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని ఈ ఘనత ఐటీ శాఖ మంత్రి లోకేష్ దేనని అన్నారు. మన జిల్లాలో పరిశ్రమలు మొదలుకానున్నాయని త్వరలో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. ఆంధ్రులకు ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్ ప్లాంట్ కు నిధులు రప్పించి దమ్మున్న నాయకుడు చంద్రబాబు అని మరోసారి నిరూపించుకున్నారని విజయ్ అన్నారు. ఎన్నికల ముందు తర్వాత కూడా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని చంద్ర బాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని అన్నారు. గత వైసీపీ పాలకులు తమ కేసులను కాపాడుకోవడానికి కేంద్ర నాయకుల చుట్టూ ఢిల్లీలో చక్కెర్లు కొట్టారని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారంకు 11,440కోట్ల రూపాయలు నిధులు తీసుకురావడమే కాకుండా అచ్చుతాపురం, నక్కపల్లి వద్ద లక్షా 85వేల కోట్ల రూపాయలతో భారీ పరిశ్రమలు రానున్నాయని అన్నారు. అలాగే రాంబిల్లి వద్ద రిలయన్ సంస్థ సోలార్ పవర్ ప్యానల్ భారీ పరిశ్రమల రానుందని భూ కేటాయింపు కూడా జరిగిందని అన్నారు. గత ప్రభుత్వంలో రాని భారీ పరిశ్రమలు ఇప్పుడెందుకు వస్తున్నాయని చంద్రబాబు నాయ కత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు తరలి వస్తున్నారని అన్నారు.

# గ్రంధాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సంస్మరణార్థం ఠాగూర్ లైబ్రరీకి పుస్తకాల వితరణ


**విజయవాడ, జనవరి18,ప్రభాత వార్తప్రతినిధి:** తెలుగు భాష, పుస్తకాలయాలపై ప్రత్యేకమైన శ్రద్ధ కలిగిన గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య నేటి తరానికి స్ఫూర్తి దాయకుడని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు, అయ్యంకి వారసుడు. సరస్వతి సామ్రాజ్య ట్రస్ట్ అధ్యక్షులుఅయ్యంకి మురళీకృష్ణ తమ తాతగారి సంస్మరణార్ధం విజయవాడ లోని ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి విలువైన పుస్తకాలను వితరణగా అందజేసారు. విద్యార్థిని విద్యార్థులు. పాఠకుల కోరిక మేరకు విజయవాడ పుస్తక మహోత్సవంలో విద్యార్థులకు నీతి కథలకు సంబంధించిన పుస్తకాలను వ్యకిత్త వికాస పుస్తరాలు నవలలను సుమారు 8 వేల రూపాయల విలువ కలిగిన పుస్తకాలను బహూకరించారు. ఈ పుస్తకాలను బహూకరించినందుకు గ్రంథాలయ అధికారిని రమాదేవి. సిబ్బంది అయ్యంకి మురళీకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పుస్తకాలను ప్రత్యేకంగా లైబ్రరీలో ప్రదర్శించారు.



అయ్యంకి వెంకటరమణయ్య సంస్మరణార్ధం ఠాగూర్ లైబ్రరీకి వితరణగా ఇచ్చిన పుస్తకాల ప్రదర్శన

# జాతీయ రహదారిపై ఆర్టీసి బస్సు దగ్ధం

## - 19 మంది ప్రయాణికులు సురక్షితం



**కందుకూరు, జనవరి 18, ప్రభాతవార్త** జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు దగ్ధమైన సంఘటన శుక్రవారం వేకువజామున 3గంటల ప్రాంతంలో జరిగింది. తిరుపతి నుంచి ఎన్టీఆర్ జిల్లా తిరువూరు వెళ్తున్న ఏపీ 39 యూవై 8484 ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు 19 మంది ప్రయాణికులతో శుక్రవారం రాత్రి తిరుపతిలో బయలుదేరింది. ఉలవపాడు మండలం మన్నేటి కోట అడ్డరోడ్డు వద్ద టీ తాగేందుకు డ్రైవర్ బస్సును నిలిపారు. బస్సులో నుంచి ఒక మహిళ బస్సు దిగి వెనుకకు వచ్చింది. బస్సు వెనుక భాగంలో పొగలు రావడం గమనించి బస్సులోని ప్రయాణికులను పెద్దగా కేకలు వేస్తూ హెచ్చరించింది. బస్సు డ్రైవర్తో పాటు ప్రయాణికులు అలర్ట్ చెందేలోపు చూస్తు ఉండగానే కళ్లముందు ఉన్న పలంగా మంటలు బస్సుని కమ్మేశాయి. బస్సుల్లో నలుగురు వృద్దులు కూడా ఉన్నారు. బస్సులోని ప్రయాణికులు అందిన వరకు వారి వస్తువులను తీసుకొని కిందకు దిగారు. బస్సు వెనుక, పక్కలన ఉన్న డిక్కిల్లోని వస్తువులను తీసుకుని అవకాశం లేకుండా మంటలు అలుముకున్నాయి. చూస్తుండగానే బస్సు మొత్తం మంటలు ఆక్రమించుకుని ఎగిసిపడ్డాయి. విషయం తెలియడంతో ఉలవపాడు ఎస్సై అంకమ్మ సిబ్బందితో సంఘటనా స్థలంకు చేరుకుని అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించారు. హుటాహుటీన వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. పూర్తిగా తలబడిన బస్సు అవశేషంగా మిగిలిపోయింది. సంఘటనలో చిక్కుకున్న ప్రయాణికులను మరో బస్సులో వారి గమ్యస్థానాలకు చేర్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం విజయవాడ, నెల్లూరు, కావలిఆర్టీసీ అధికారులు సంఘటనా స్థలంకు చేరుకుని పరిశీలించారు.

# గ్రామవార్డు సచివాలయ సిబ్బందికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి

**విజయవాడ, జనవరి 18, ప్రభాతవార్త :** గ్రామ వార్డు సచివాలయాలలో రేషనలైజేషన్‌పై శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయంతో ఎటువంటి ప్రయోజనం వుండదని, వారికి కూటమి ప్రభుత్వం సత్వర న్యాయం చేయాలని ఏపి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు కోరారు. గత ప్రభుత్వం ఏ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ లో పనిచేసే వారికి ఎటువంటి జాబ్‌కార్డు ప్రమోషన్ చానల్ లేదని, రెండు సంవత్సరాలవరకు రు.15వేలతో పనిచేసి నష్టపోయారన్నారు. వారికి కూటమి ప్రభుత్వం వస్తే న్యాయం జరుగుతుందని ప్రమోషన్లు ఇస్తారని ఆశపడినప్పటికి వారికి న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం 2019లో సచివాలయ వ్యవస్థ ప్రారంభించినప్పుడు విఆర్‌ఓలను లైన్ డిపార్ట్‌మెంట్లో వుండేలా నిర్ణయం తీసుకోవాలని కోరామన్నారు. అప్పట్లో గ్రేడ్1 విఆర్‌ఓలకు మాత్రమే డిడిఓగా తహసీల్దారు వుండేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఒకే జాబ్‌కార్డుతో పనిచేస్తున్న గ్రేడ్2 విఆర్‌ఓలకు కూడా తహసీల్దార్లు డిడిఓగా వుండేలా చర్యలు తీసుకోవాలని కోరామని కానీ

ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదన్నారు. మరల ఇప్పుడు 3 కేటగిరిలుగా సచివాలయ సిబ్బందిని విభజించి వారికి పంచాయితీ సెక్రటరి, వార్డు ఎడ్మిన్ వారిని హెడ్‌గా పెడుతూ విధివిధానాలు ఖరారు చేయడం గురించి రెవెన్యూ మంత్రిని చైర్మన్‌గా నియమించారన్నారు. ఒకపక్క విఆర్‌వోలు లైన్ డిపార్ట్‌మెంట్ పనులు చేస్తుండగా ఇతర పనులు కూడా అప్పగించడంతో పనిఒత్తిడి పెరిగిపోయిందని, దీన్ని దృష్టిలో వుంచుకుని సచివాలయ రేషనలైజేషన్ కన్నా ఎవరి లైన్ డిపార్ట్‌మెంట్ ద్వారా వారు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా వున్న పోస్టులను సచివాలయ సిబ్బందితో భర్తిచేస్తే అందరికి న్యాయం జరుతుందన్నారు.

# పట్టణాలు, గ్రామాల పరిశుభ్రతే స్వచ్ఛ ఆంధ్ర ఉద్దేశం

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

**విజయవాడ,జనవరి 18, ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అన్నారు. శనివారం ఆయన విజయవాడ నగర సమీపంలోని కాటూరు గ్రామంలో పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాగంగా గ్రామంలో రహదారులను, డ్రైనేజ్, పరిసరాలను పరిశుభ్రం చేసి గ్రామస్తులకు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమ ప్రాముఖ్యతను, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. తడి పొడి చెత్తను వేరు చేసే డస్ట్ బిన్ లను గ్రామస్తులకు పంపిణీ చేశారు. అనంతరం నేను, నా పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తానని, నా వంతు కృషిగా స్వచ్ఛత కార్యక్రమాల కోసం శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటానని, ఈ రోజు పరిశుభ్రత గురించి నేను వేసే ఈ ముందడుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శుభ్రపరచడంలో సహాయం చేస్తుందని నమ్ము తూ... ఈరోజు నుండి నా తోటి వారికి కూడా స్వచ్ఛతపై అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తానని మన ఆంధ్రప్రదేశ్ ను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేటట్లు నా వంతు కృషి చేస్తానని సిఎస్ అధికారులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణాలు, గ్రామా లను పరిశుభ్రంగా ఉంచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంతో ప్రజలకు పిలుపునిచ్చారన్నారు. ఇది ఒకరోజు కార్యక్రమం కాదని నిరంతర ప్రక్రియ అని చెబుతూ, ప్రతి నెలలో మూడో శనివారం నాడు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలందరూ భాగస్వామ్యం అయ్యి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసుకుని ఆదర్శంగా ఉంటూ ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛ్ ఆంధ్ర లక్ష్యానికి కృషి చేయాలన్నారు. అలాగే చెత్త నుండి సంపద సృష్టిలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేపట్టడంతో పాటు వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టడానికి పది రకాల కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వ హించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.



కాటూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఎంఎల్ఏ బోడే ప్రసాద్

## తిరుపతిలో తొక్కిసలాట ఘటనతో

# గవర్నర్, సిఎంకు ఏం సంబంధం?

## పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

**విజయవాడ.జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రం వద్ద చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనతో గవర్నర్, ముఖ్యమంత్రికి ఏం సంబంధమని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పిల్‌లో వారిని ప్రతివాదులుగా చేర్చడంపై అభ్యం తరం తెలిపింది. ప్రభుత్వం తరఫున ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు ప్రతివాదులుగా ఉన్నారు కదా అని గుర్తు చేసింది. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలకు కట్టుబడి సీఎం, గవర్నర్ కార్యదర్శులను ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాలని పిటిషనర్‌కు తేల్చి చెప్పింది. పిల్‌పై విచారణను బుధవారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. సురేష్‌రెడ్డి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. తిరుపతిలో చోటు చేసుకున్న తొక్కిసలాట, భక్తుల మృతి వ్యవ హారంపై హైకోర్టు సిటింగ్ లేదా హైకోర్టు విశ్రాంత జడ్జితో జ్యుడిషియల్ విచారణ జరిపించాలని కోరుతూ కర్నూలు జిల్లాకు చెందిన రైతు జి. ప్రభాకరరెడ్డి పిల్ వేసిన విషయం తెలిసిందే. దానికి నంబరు కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ నిరాకరించింది. సీఎం, గవర్నర్ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చడంపై అభ్యం తరం తెలిపింది. పిల్‌కు నంబరు కేటాయించే అంశంపై హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. రిజిస్ట్రీ నిర్ణయాన్ని సమర్థించింది.

## నాగోబా జాతర కోసం మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరకు, నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో చేపట్టనున్న వసంత పంచమి ఉత్సవాలకు రావాలని కోరుతూ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖమంత్రి కొండా సురేఖను దేవాదాయ శాఖ ఆహ్వానించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, బాసర ఆలయ ఇంఛార్జి కార్య నిర్వహణాధికారి ఎన్.నవీన్ కుమార్, సహాయ కార్యనిర్వ హణాధి కారి ఆర్.సుదర్శన్, వేదపండితులు మంత్రి సురేఖను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నాగోబా జాతర, వసంత పంచమి ఉత్సవ ఆ హ్వానపత్రికను మంత్రికి అందించి, వేడుకలకు ఆహ్వానించారు. 28 నుంచి 31 వరకు నాగోబా జాతరను, ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు వసంత పంచమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ మంత్రి సురేఖకి తెలిపారు.

# సినిమా వేషం ముసుగులో మహిళపై లైంగిక దాడి

### బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

**హైదరాబాద్ (పంజగుట్ట), జనవరి 18, ప్రభాతవార్త:** సినిమా ఛాన్స్ ఇప్పిస్తానని నమ్మించి ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రకు చెందిన ఓ మహిళ భర్తతో విడిపోయి మణికొండలో పని కోసం వచ్చింది. 15 రోజుల క్రితం అమీర్‌పేటలోని ఓ హాస్టల్‌లో చేరింది. సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా ప్రయత్నించేందుకు కృష్ణానగర్‌లో తెలిసిన వారితో వాకబు చేసింది. ఈ క్రమంలో డైరెక్షన్ విభాగంలో పనిచేస్తున్న కాటే కొండ రాజుతో పరిచయం ఏర్పడింది. మూడురోజుల క్రితం ఆడిషన్స్ ఉన్నాయంటూ కృష్ణానగర్‌లోని ఓ హోటల్‌కు ఆమెను రాజు పిలిపించాడు. మొదటగా ఫొటో షూట్‌చేసి మరుసటిరోజు రావాలని చెప్పాడు. మరుసటి రోజు వెళ్లగా మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. వెంటనే బాధిత మహిళ జూబ్లీహిల్స్ పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## మండలి ఎన్నికల్లో అన్ని పార్టీలు బిసిలకు టికెట్లు ఇవ్వాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

**హైదరాబాద్, జనవరి 18,ప్రభాతవార్త:** మార్చ్‌లో జరగబోయే శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా దామాషా ప్రకారం టికెట్లు ఇవ్వాల్సిందేనని, టిక్కెట్లు ఇవ్వకపోతే ఆ రాజకీయ పార్టీలకు పతనం తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇతర బీసీ సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. అధికారం లేనప్పుడు అధికారంలోకి రావడానికి గెలుపు గుర్రాల పేరుతో అగ్రకులాలకే టికెట్ లు ఇచ్చిన రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు కూడా అగ్రకులాలకి టికెట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్నది రాహుల్ కాంగ్రెస్? రెడ్డి కాంగ్రెసా అనేది తెలియడం లేదని రాహుల్ కాంగ్రెస్ అయితే బీసీలకు టికెట్ ఇవ్వాలని, రెడ్డి కాంగ్రెస్ అయితే రెడ్లకే టికెట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూదాని సదానందం, ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కడారి వెంకటేష్ గౌడ్, బీసీ మహిళా సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు సిద్ధాంతం శ్యామల, బీసీ నాయకులు గుంటి మహేష్, ఇంద్రం రజక తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు షాక్ ఇచ్చి అన్నను చంపిన తమ్ముడు

**శివ్వంపేట, జనవరి 18, ప్రభాతవార్త:** సొంత అన్నకు తమ్ముడు కరెంట్ షాక్‌పెట్టి ప్రాణాలు తీసిన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తూప్రాన్ సిఐ రంగకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నను తండాకు చెందిన తేజావత్ చందర్‌కు శంకర్ (28), గోపాల్ (22) కుమారులు. చిన్నకొడుకు గోపాల్ ఇటీవలే ఓ దొంగతనం కేసులో జైలు కెళ్లి వచ్చాడు. అన్నదమ్ముల మధ్య గతంలో జరిగిన గొడవలను మనసులో పెట్టుకొని తమ్ముడు గోపాల్ అన్న శంకర్‌ను చంపాలని ప్లాన్ వేసుకున్నాడని అన్నారు. శనివారం రాత్రి ఇంటిలో అన్నదమ్ములు ఒకే గదిలో పడుకున్నారు. అర్థరాత్రి 12 గంటలకు తమ్ముడు గోపాల్ లేచి అన్న శంకర్ కాలికి, చేతులకు



శంకర్ (ఫైల్)

విద్యుత్ వైర్లుకట్టి స్విచ్ బోర్డులో పెట్టడంతో షాక్ తగిలి నిద్రలోనే శంకర్ మృతి చెందాడు. అయితే శంకర్ వేసిన అరుపులు కేకలకు పక్కగదిలో ఉన్న తండ్రి చందర్ వచ్చేసరికి గది తలుపులు పెట్టి ఉన్నాయి. తండ్రి పిలవగానే తలుపులు తీసిన గోపాల్ తండ్రిని నెట్టేసి పరారయ్యారు. తూప్రాన్ సిఐ రంగాకృష్ణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ సిఐ రంగకృష్ణ తెలిపారు.

# వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

## : సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** 'వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఈ అంశంపై ఆయన "ఎక్స్" వేదికగా చేసిన ట్వీట్‌లో తమ ప్రభుత్వం వ్యవసాయరంగానికి పూర్తి ప్రయోజనాన్ని అందిస్తుందన్నారు. రాష్ట్రానికి భారీ ఆర్థిక వ్యవస్థగా ఉన్న వ్యవసాయాన్ని ప్రభుత్వం మరింతగా పటిష్టం చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును అందిస్తామన్నారు. రైతులకు 9 గంటల విద్యుత్ ను కుదించటం గానీ తగ్గించటం గానీ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా పొగ మంచు కారణంగా సౌర విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం కారణంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సమయం రీషెడ్యూల్ మాత్రమే అయ్యిందన్నారు. వ్యవసాయానికి ఇకపై 9 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇవ్వటానికి నిర్ణయించామన్నారు. తాను వివరించిన సాంకేతిక కారణాల రీత్యా ప్రస్తుతమిస్తున్న 7 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను 9 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గమనించాలన్నారు. ఇవి తక్షణం అమలులోకి వస్తాయన్నారు. దీని వలన దాదాపు 18 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంలో నిరంతరాయంగా వ్యవసాయానికి 9 గంటల పాటు విద్యుత్ సరఫరా జరుగుతోందని ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలు స్పష్టం చేశాయన్నారు. వైఎస్సార్సీపీకి ఇంకా బుద్ధి రాలేదన్నారు. అందుకే రాష్ట్రంలో వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాపై వైఎస్సార్సీపీ దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకు వైఎస్సార్సీపీని ప్రజలు పరిమితం చేసినా వారి తప్పిదిద్దుకోలేదని, ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం మారలేదన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నామని చేసిన విష ప్రచారం బెడిసి కొట్టిందన్నారు. ఇప్పుడు 9 గంటల ఉచిత విద్యుత్ ఎత్తివేస్తున్నామని మరో అసత్య ప్రచారానికి వైఎస్సార్సీపీ నేతలు తెరలేపారని ఆరోపించారు. గత ప్రభుత్వ అనుచిత విధానాల కారణంగా ప్రజలపై భారీగా విద్యుత్తు రంగం ఆర్థిక సంక్షోభాన్ని చవి చూసే పరిస్థితి వచ్చిందన్నారు. దీని ప్రభావంగా చార్జీలు పడే పరిస్థితి వచ్చినప్పటికి తమ ప్రభుత్వం ఆ దిశలో ఆలోచన చేయలేదన్నారు. సంబంధిత ఆర్థిక భారాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సేంద్రియసాగుకు ఏపీ ఎంతో అనుకూలమని అందరూ సేంద్రియసాగు ఉత్పత్తులు వినియోగించాలని సూచించారు. జపాన్‌ను చూసి మనం ఎన్నో విషయాలు నేర్చుకోవాలని వెల్లడించారు. మనం చేయాల్సింది హార్డ్ వర్క్ కాదని స్మార్ట్ వర్క్ అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చిరుధాన్యాల పంటసాగు పెరుగుతోందని చంద్రబాబు తెలిపారు. డ్రోన్ల ద్వారా చీడపీడలను గుర్తించే సాంకేతికత వచ్చిందన్నారు. ప్రతికుటుంబంలోను పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తామని చెప్పారు. అందరూ హార్టికల్చర్ కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పాడిపరిశ్రమకు షెడ్లు నిర్మిస్తామని అన్నారు. నూతన పారిశ్రామికీకరణ సంస్కరణలను వ్యవసాయ,ఆ రంగ ఆధారిత పరిశ్రమ వ్యవస్థలో చేస్తామని వివరించారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయరంగానికి మరింత ప్రయోజనం కలిగించే దిశలోనే తమ ఆలోచన ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎలాంటి మార్పులు లేవని విద్యుత్ పంపిణీ సంస్థ స్పష్టం చేసింది. సీపీడీసీఎల్ పరిధిలో 7 గంటలు మాత్రమే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం కాదని తెలిపింది. రాష్ట్రంలో వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాపై వైఎస్సార్సీపీ దుష్ప్రచారం చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైతం "ఎక్స్" వేదికగా ఆరోపించారు. గతంలో వైకాంగ్రెస్ పార్టీ వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నామని తప్పుడు ప్రచారం చేసిందన్నారు.. ఇప్పుడు 9 గంటల ఉచిత విద్యుత్ ఎత్తివేస్తున్నామని మరో అసత్య ప్రచారానికి వైఎస్సార్సీపీ నేతలు తెరలేపారని ఆరోపించారు.

# ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

### ఉద్యోగ సంఘాలతో కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు టిఎన్‌జిఒ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాలతో కేబినెట్ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని టీఎన్ టీజీవో డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కను టీఎన్‌జీవో కేంద్రం సంఘం అధ్యక్షులు మారం జగదేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ శనివారం సచివా లయంలో కలిసి వినతిపత్రం సమ ర్పించారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్‌జీవో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నగర శాఖ అధ్యక్షులు కట్కూరి శ్రీకాంత్, కార్యదర్శి పంతులు హరికృష్ణ, తెలంగాణ నాల్గో తరగతి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే కేబినెట్ సభ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగ సంఘాల నేతలతో పూర్తిస్థాయిలో చర్చించి ఆర్థిక ఆర్థికేతర సమస్యలన్నింటినీ కూడా ప్రాధాన్యతా క్రమంలో వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఒక్కటొక్కటిగా మంజూరు చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ సమస్యలను ఫిబ్రవరి మొదటి వారంలో కేబినెట్ సబ్ కమిటి సమావేశం ఏర్పాటు చేసుకుని పరిష్కరిస్తామన్నారు. ఉద్యోగులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇస్తున్నట్టు తెలియజేశారని టీఎన్‌జీవో నాయకులు తెలిపారు.



## టోలిచౌక్‌లో మలబార్ గోల్డ్ డైమండ్స్ కొత్త షోరూమ్ ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 18:** బాధ్యతాయుతమైన ఆభరణాల వ్యాపార సంస్థగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ డైమండ్స్, హైదరాబాద్, టోలిచౌకి ప్రాంతంలో కొత్త షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా మలబార్ బ్రాండ్ విస్తరణ కొనసాగింపులో భాగంగా, హైదరాబాద్ నగరంలో ఇది 15వ షోరూమ్. 10,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆకర్షణీయంగా ముస్తాబు అయింది. ఈ కొత్త షోరూమ్, హైదరాబాద్, టోలిచౌకి ప్రజలకు అసమానమైన ఆభరణాల షాపింగ్ అనుభూతిని అందిస్తుంది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, షేక్ పేట్ కార్పొరేటర్ మొహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఇతర పుర ప్రముఖులు, కస్టమర్లు, శ్రేయోభిలాషులు.. మలబార్ మేనేజ్‌మెంట్ బృందం సమక్షంలో, ఈ కొత్త షోరూము రిబ్బన్ కటింగ్ వేడుక శనివారం జరిగింది. కొత్త షోరూమ్ ప్రారంభం సందర్భంగా, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహ్మద్ తమ ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తూ 'హైదరాబాద్‌లో మా 15వ షోరూమ్‌ను ప్రారంభించడం పట్ల మేము ఎంతో సంతోషిస్తున్నాము, టోలిచౌకి ప్రాంతంలోని కస్టమర్లకు అద్భుతమైన మా సేకరణలను సందర్శించే అవకాశాన్ని అందిస్తున్నాము. ఈ కొత్త షోరూమ్ ప్రారంభంతో, మా కస్టమర్లకు సాంప్రదాయ ఆభరణాల నుండి సమకాలీన శైలి ఆభరణాల వరకు, అత్యుత్తమ నైపుణ్యంతో కూడిన డిజైన్లను విస్తృత శ్రేణిలో అందిస్తున్నందుకు మేము గర్విస్తున్నాము' అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, 2025 జనవరి 18 నుండి జనవరి 31 వరకు, మలబార్ గోల్డ్ డైమండ్స్ ప్రత్యేక వెండి ఆఫర్‌ను అందిస్తోంది. ప్రతి కొనుగోలుతో పాటు, కస్టమర్లు ఒక వెండి నాణెం ఉచితంగా పొందవచ్చు. మలబార్‌కు చెందిన ప్రత్యేక బ్రాండ్‌లు 'మైన్' డైమండ్ జ్యువెలరీ, 'ఎరా' అన్‌కట్ డైమండ్ జ్యువెలరీ, 'డివైన్' హెరిటేజ్ జ్యువెలరీ, 'ఎథ్నిక్స్' హ్యాండ్‌క్రాఫ్టెడ్ జ్యువెలరీ, 'ప్రీసియా' విలువైన రత్నాభరణాలు'విరాజ్' రాయల్ పోల్కీ జ్యువెలరీ మొదలగునవి టోలిచౌకి షోరూమ్‌లో లభిస్తాయి. బంగారం, వజ్రాలు, పోల్కీ, విలువైన రత్నాలు, వెండి, ప్లాటినం ఆభరణాలు, విభిన్న అభిరుచులు కలవారికి వివిధ సందర్భాలకు సరిపోయే ఆభరణాలు ఈ షోరూమ్ సేకరణల్లో ఉన్నాయి.

# అభివృద్ధి చూసి ఓర్వలేక కెటిఆర్ ఆరోపణలు

### మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణను సంక్షేమం అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరుగులెత్తిస్తున్నారని, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నా ఓర్వలేక షాబాద్‌లో కెటిఆర్ ఆరోపణలు చేస్తున్నారని శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి మనోహర్‌రెడ్డిలు విమ ర్శించారు. శనివారం గాంధీభవనలో విలేఖరులతో పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడతూ ఏడాది కాలంలో ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తుండు26 జనవరి తరవాత మిగిలిన హామీలు నెరవేరతవి అని ధీమా వ్యక్తంచేశారు. జానమ్మ అనే మహిళ రుణమాఫీకి అర్హురాలు కాదు అందుకే ఆమెకు చేయలేదు. భర్త జోజి రెడ్డికి ఋణమాఫీ అయింది. ఆమె కొడుకుల పేరు మీద భూమి ఉందివాళ్ళకు ఋణమాపి అయింది. షాబాద్‌లో రైతులకు అన్యాయం చేసింది మీరు అని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు అన్ని జిల్లాలలో రివ్యూ మీటింగ్ పెట్టి లబ్దిదారుల ఎంపిక జరుగుతుంది అని ఆయన తెలిపారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పరిగిలో జరిగిన అభివృద్ధికికేటీఆర్ చర్చకు వస్తారా అని సవాల్‌వేశారు. పరిగిగిలో ఏ మండలానికి ఎన్నికోట్లు ఇచ్చామో గ్రామలవారిగా చర్చకు సిద్ధమా అని ఆయన అన్నారు. 21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసింది నిజం కాదా?పరిగి నియోజకవర్గానికి 294 కోట్ల రైతు రుణమాఫీ అయింది వాస్తవం కాదా?అని ఆయన ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాను సర్వనాశనం చేసింది మీరు కదా కేటిఆర్ నిలదీశారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ మాట్లాడుతూ షాబాద్ లో కేటిఆర్ మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు.

## ఎవరెన్ని కుట్రలు చేసినా ఢిల్లీ పీఠం బిజెపిదే

### కాంగ్రెస్‌కు మళ్లీ గుణపాఠం ఖాయం : ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** ఎవరెన్ని కుట్రలు చేసినా ఢిల్లీ పీఠం మాదేనని, కాంగ్రెస్‌కు మరోసారి గుణపాఠం ఖాయం అని బిజెపి ఎంపి డికె అరుణ అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో డికె అరుణ మాట్లాడారు. ఆప్ అట్టర్ ఫ్లాప్ ఢిల్లీలో పరిపాలన గాడి తప్పిందన్నారు. ప్రజల అవసరాలు తీర్చడం, నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో ఆప్ ఫెయిల్ అయ్యిందని అన్నా రు. అందుకే అక్కడి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసిన ఢిల్లీలో బిజెపి విజయం ఖాయం అన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. అవినీతి ఆరోపణలతో అరవింద్ కేజ్రీవాల్ జైలుకు వెళ్లారని, అలాంటి వాళ్లను ప్రజలు విశ్వసించని అన్నారు. తెలంగాణలో పథకాలు అమలుపై సిఎం రేవంత్ మళ్ళీ పాత పాటే పడుతు న్నారని అన్నారు. ముంబై, హర్యానాలో చెప్పినట్లే ఇక్కడ అవే అబద్దాలు ఆడుతున్నాడని, ఢిల్లీ ప్రజలు రేవంత్ అబద్ధాలను విశ్వసించడం లేదని అన్నారు.

# వాగ్దానాలకు కట్టుబడిన ప్రజాప్రభుత్వం

### పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



స్టేషన్ ధారూర్‌లో సిసి రోడ్డు ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ధారూరు, జనవరి 18, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కుక్కిందా, ధారూర్ వ్యవసాయ మార్కెట్, స్టేషన్ ధారూర్, దోర్నాల, నాగారం, తరిగోపుల గ్రామాలలో నూతనంగా వేసిన సీసీ రోడ్డులను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. డిఎంఎఫ్.టి.లు సంయుక్తంగా 25.50రూ. లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (పల్లె దవాఖాన) భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు రెండు లక్షల రుణమాఫీని చేశామని, కొందరు రైతులకు సాంకేతిక లోపం వల్ల ఇతర కారణాలవల్ల కాలేదని, రుణమాఫీ కానీ వారికి రుణమాఫీని వర్తింప చేస్తామని ఆయన తెలిపారు. ఈనెల 26 నుండి రైతు భరోసా పథకం కింద 12 వేల రూపాయలను రైతు ఖాతాల్లో జమ చేస్తామని ఆయన చెప్పారు. భూమిలేని నిరుపేదలకు ఏడాదికి 12,000 చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని అన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 12,000 ఇండ్లు మంజూరయ్యాయని, ఇండ్లు లేని వారికి అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోట్పల్లి ప్రాజెక్టుకు 120 కోట్లు మంజూరు అయ్యాయని, ఈ నిధులు ద్వారా చెరువు, కాలువలు, చెక్ డ్యాములు మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో ధరణి వల్ల రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కోవడం జరిగిందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూమాత ద్వారా అన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కు లను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 36 మంది లబ్దిదారులకు, 36 లక్షల 4 వేల 176 రూపాయల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను విజయవంతం చేయాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు ప్రతిష్టాత్మక పథకాలను ప్రభుత్వం ప్రారంభించబోతుందని, సొంత భూమిలేని ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 12 వేల ఆర్థిక చేయుత అందించబోతున్నాం అని మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో డిఆర్‌డిఓలతో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుపై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేష్ కుమార్, డైరెక్టర్ సృజన, అన్ని జిల్లాల డిఆర్‌డివోలు పాల్గొన్నారు. ఉపాది హామీ కూలీలకు యేటా రూ.12వేలు ఇచ్చే కార్యక్రమంలో దేశంలో ఎక్కడ లేదన్నారు. కూలీల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేస్తున్నాం అన్నారు. కుటుంబంలో ఉండే ఉపాధి హామీ మహిళాకూలీ బ్యాంకు ఖాతాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని జమచేస్తామని మంత్రి అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను విజయవంతం చేయాలన్నారు. మానవీయ దృక్పథంతో, సామాజిక స్పృహతో అధికారులు వ్యవహరించాలన్నారు.

**మాజీమంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలకు ఖండన**

ఉద్యోగుల వేతనాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నానని పంచాయితీ రాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో పంచాయితీ కార్మికులు, ఉద్యోగులు వేతనాలు అందక రోడ్లు ఎక్కుతున్న దుస్థితి ఏర్పడిందని బిఆర్ఎస్ నేత హరీష్ రావు ట్వీట్ చేశారు. దీనిపై సీతక్క స్పందించారు.

# బీదర్, అఫ్జల్‌గంజ్ ఘటనల్లో నిందితుని గుర్తింపు

### ఆటోడ్రైవర్ ద్వారా కీలక సమాచారం సేకరించిన పోలీసులు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** కర్ణాటకలోని బీదర్‌లో ఎటిఎంలో నగదు నింపే ఉద్యోగిని కాల్చి చంపి 93 లక్షల నగదు దోపిడితో పాటు నగరంలోని అఫ్జ ల్‌గంజ్‌లో ట్రావెల్స్ ఉద్యోగిపై కాల్పులకు పాల్పడి రెప్పపాటులో పారిపోయిన ఇద్దరు నేరగాళ్ల విషయంలో పోలీసులు పురోగతి సాధించారు మోటార్ సైకిల్‌పై బీదర్‌లో దోపిడికి పాల్పడి అక్కడి నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు బైక్‌పై వచ్చిన వీరు అనంతరం బస్సులో హైదరాబాద్‌కు రావడం తెలిసిందే. దీని తరువాత అఫ్జల్‌గంజ్‌లో రోషన్ ట్రావెల్స్ బస్సులో ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్ వెళ్లే క్రమంలో బస్సులో ప్రయాణిస్తూ లగేజి తనిఖీ చేసిన ఉద్యోగి జహంగీర్‌పై కాల్పులు జరిపి రెప్పపాటు లో పారిపోవడం విదితమే. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్‌లోని అల్ఫా హోటల్ వరకు ప్రయాణించిన నిందితులు అక్కడి నుంచి రైలులో బిహార్ లేదా ఛత్తీ స్ఘడ్‌కు పారిపోయి వుంటారని పోలీసులు భావిస్తున్నారు. కాగా బీదర్‌లో దోపిడి, అఫ్జల్‌గంజ్‌లో కాల్పులకు పాల్పడింది ఒకే ముఠాగా గుర్తించిన పోలీసులు ఇందులో ఒకడి పేరును మనీష్‌గా నిర్ధారణకు వచ్చారు. ఈ రెండు ఘటనలకు ముందు ఇదే ముఠా ఛత్తీస్‌ఘడ్‌లోనూ ఎటిఎంలో నగదు నింపే ఉద్యోగులను బెదిరించి 70 లక్ష ల రూపాయలను దోచుకున్నట్లు తేలింది. బీదర్, అఫ్జల్‌గంజ్ ఘటనల్లో ఒకడిని కరుడుగట్టిన నేరగాడు మనీష్‌గా గుర్తించారు. ఇతను బిహార్‌లోని కరుడుగట్టిన దొంగల ముఠా అమిత్ కుమార్ బ్యాచ్‌లో సభ్యుడుగా భావిస్తున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి వుంది. కాగా మనీష్‌పైనా బిహార్‌తో పాటు ఛత్తీస్‌ఘడ్‌లో అనేక కేసులున్న ట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. దోపిడిలు, దొంగతనా లు, కిడ్నాపులతో పాటు నేరాలకు పాల్పడే సమయంలో అడ్డువచ్చిన వారిని కాల్చి చంపేసే మనస్తత్వం కలిగిన వ్యక్తిగా మనీష్‌కు పేరుంది. కాగా మనీష్‌తో పాటు అతని సహచరుడు అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్‌కు ఆటోలో వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇతనికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. సికింద్రాబాద్‌లోని అల్ఫా హోటల్ వద్ద ఆటో నుంచి దిగిపోయిన వీరు అక్కడి నుంచి రైలులో బిహార్ లేదా రాయ్‌పూ ర్‌కు పారిపోయి వుంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు నేరగాళ్ల ప్రయాణించిన ఆటో డ్రైవర్‌ను గుర్తించిన పోలీసులు అతడిని విచారించి కొంత స మాచారం రాబట్టారు. ఆటోలో ప్రయాణించిన సమయంలో ఇద్దరు దొంగలు ఓమైనా మాట్లాడుకున్నారా...? అని ఆరా తీశారు. అయితే ఆటో డ్రైవర్ వెల్లడించిన సమా చారాన్ని పోలీసులు రహస్యంగా వుంచుతున్నారు. కాగా బీదర్, అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపి ఒక చోట దోపిడికి పాల్పడ్డ ఇద్దరు నిందితుల కోసం తెలంగాణతో పాటు కర్నాటక, బిహార్, ఛత్తీస్‌ఘడ్‌ల లో పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. వీరి కోసం తెలంగాణ నుంచి పది బృందాలు, కర్నాటక నుంచి మరో పది బృందా లు, ఛత్తీస్‌ఘడ్ నుంచి ఇంకో పది బృందాలు గాలిస్తున్నాయి. ఈ బృందాలకు బిహార్ పోలీసులు సహకరిస్తున్నారు.

## నకిలీ కరెన్సీ ఆశ చూపి ప్రజలను మోసగిస్తున్న విదేశీయుడి అరెస్టు

**హైదరాబాద్ (హాయత్‌నగర్), జనవరి 18, ప్రభాతవార్త:** అసలు కరెన్సీ ఇస్తే అంతకు రెండితలు నకిలీ కరెన్సీ ఇస్తానంటూ ప్రజలను మోసం చేయడానికి యత్నిస్తున్న విదేశీయుడిని హయత్‌నగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... కామెరున్ దేశానికి చెందిన జాక్వెస్ డివాలోయిస్ కిట్ (42) జులై 2017లో రెండునెలల టూరిస్ట్ వీసా మీద ఇండియాకు వచ్చాడు. అతను స్వదేశానికి వెళ్లకుండా స్నేహితుడి పాస్‌పోర్టుతో బెంగుళూరులో ఉంటున్నాడు. జీవనం కోసం నకిలీ కరెన్సీ వ్యాపారం చేయసాగాడు. ఒరిజినల్ కరెన్సీని నకిలీదిగా చూపుతూ తనకు ఒరిజినల్ కరెన్సీ ఇస్తే అంతకు రెండింతలు నకిలీ కరెన్సీ ఇస్తానంటూ చెప్పి వారు ఒరిజినల్ కరెన్సీ ఇవ్వగానే అవితీసుకుని అక్కడి నుంచి పరారయ్యేవాడు. మరో వ్యక్తితో కలిసి హయత్‌నగర్‌లోని చిత్ర ఓయో లాడ్జిలో దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు అతన్ని లాడ్జిలో పట్టుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. నిందితుడి నుంచి పాస్‌పోర్టును, మొబైల్‌ఫోన్, ఒరిజినల్ నోట్లను స్వాధీనం చేసుకునా ్నరు.



పోలీసులు అరెస్టు చేసిన జాక్వెస్ దేవాలోయిస్‌కిట్

19-01pg10exHMNWJQE.qxd:19-01pg10exHMNWJQE.qxd 01/01/01 6:59 AM Page 1



## ఛాంపియన్స్ ట్రోఫీ, వన్డేలకు

# భారత్ జట్టు ఖరారు



## సిరాజ్, శాంసన్ ఔట్

## శుభ్‌మన్‌కు వైస్ కెప్టెన్

**న్యూఢిల్లీ:** వచ్చే నెలలో జరిగే ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ-2025తో పాటు, త్వరలో ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు వన్డేలకు భారత్ జట్టు ఖరారైంది. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో కెప్టెన్‌గా రోహిత్ శర్మ నేతృత్వం వహించనున్నాడు. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) తమ జట్టును ప్రకటించింది. ఈ మెగా టోర్నీలో భాగమయ్యే ఆటగాళ్ల పేర్లను శనివారం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ జట్టు వివరాలను మీడియాకు తెలిపాడు. వన్డేలకు శుభమన్ గిల్ వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఈ 15 మంది బృందంలో మహ్మద్ సిరాజ్, సంజూ శాంసన్‌లకు చోటు దక్క లేదు. ఛాంపియన్స్ ట్రోఫీ టీమ్‌లో స్థానం కల్పించిన బుమ్రా, ఇంగ్లండ్‌తో జరిగే వన్డేలకు మాత్రం ఆడటం లేదు. ఫిబ్రవరిలో అతని ఫిట్‌నెస్‌ను అంచనా వేయనున్నారు. ఒక వేళ బుమ్రా ఫిట్ అయితే ఆ టోర్నీలో అతడు ఆడతాడు. ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్ కోసం బుమ్రా స్థానంలో హర్షిత్ రాణాకు చోటు కల్పించారు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో పాల్గొనబోయే భారత జట్టులో రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్మన్ గిల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా (ఫిట్నెస్ ఆధారంగా) మహ్మద్ షమీ, అర్ష్దీప్ సింగ్ ఉన్నారు. కాగా ఫిబ్రవబ్రరి 19 నుంచి పాకిస్తాన్ వేదికగా చాంపియన్స్ ట్రో ఫీ ఆరంభం కానుంది. అయితే, భద్రతా ద్ర కారణాల దృష్ట్యా టీమిండియా అక్కడికి వెళ్లకుండా తటస్థ వేదికైన దుబాయ్‌లో తమ మ్యాచ్‌లను ఆడుతుంది. ఇక ఆతిథ్య జట్టు హోదాలో పాకిస్తాన్ ఈ ఐసిసి ఈవెంటుకు నేరుగా అర్హత సాధించగా, భారత్‌తో జరిగిన వన్డే ప్రపంచ కప్-2023లో అదరగొట్టిన ఏడు జట్లు తమ ప్రదర్శన ఆధారంగా చోటు దక్కించుకున్నాయి. వరల్డ్ కప్ ఛాంపియన్ ఆస్ట్రేలియా, రన్నరప్ టీమిండియాలతో పాటు, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, ఇంగ్లండ్ ఈ మెగా టోర్నీకి క్వాలిఫై అయ్యాయి. వన్డే ఫార్మాట్లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో ఈ 8 జట్లను 2 గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఎ లో భారత్, న్యూజిలాండ్, పాకిస్థాన్, సౌతాఫ్రికా, గ్రూప్‌బి లో ఆస్ట్రేలియా, అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, ఇంగ్లండ ఉన్నాయి. ఈ టోర్నమెంట్లో భారత్ తమ తొలి మ్యాచ్ బంగ్లాదేశ్‌తో తలపడనుంది. దుబాయ్ వేదికగా ఫిబ్రవరి 20న ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇక చిరకాల ప్రత్యర్థులైన టీమిండియా, పాకిస్థాన్ మ్యాచ్ ఫిబ్రవరి 23న జరుగనుంది. కాగా చాంపియన్స్ ట్రో ఫీ కంటే ముందు టీమిండియా స్వదేశంలో ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్ ఆడనుంది. ఈ నెల 22 నుంచి ఇరు జట్ల మధ్య తొలి టీ20తో మెగా సమరం మొదలు కానుంది.





### ఖో ఖో ప్రపంచ కప్‌లో..

## సెమీస్‌లో భారత్ జట్లు

### దూసుకెళుతున్న మహిళ, పురుష టీమ్‌లు

**న్యూఢిల్లీ:** స్వదేశంలో జరుగుతున్న తొలి ఖో ఖో ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత మహిళల, పురుషుల జట్లు అద్భుత ప్రదర్శన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. దేశీయ క్రీడలో దుమ్మురేపుతున్న భారత్ జట్లు క్వార్టర్స్‌లో అదే ఆధిపత్యం కనబర్చాయి. ఖో ఖో ప్రపంచ కప్ టోర్నీలో జరుగుతున్న ఆటల్లో భాగంగా జరిగిన మహిళల క్వార్టర్ ఫైనల్లో భారత్ జట్టు 109-16 పాయింట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టి కరిపించింది. వరుసగా ఐదో మ్యాచ్‌లో 100 పాయింట్లకు పైగా స్కోరు చేసిన భారత్ అమ్మాయిలు ఆట ఆరంభం నుంచే చెలరేగిపోయారు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుస పాయింట్లతో ఉక్కిరి బిక్కిరి చేశారు. కెప్టెన్ ప్రియాంక ఇంగ్లె, నస్రిన్ షేక్, ప్రియాంక, రేష్మ రాథోడ్‌లు తమ సత్తా చాటారు. ఇతర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఉగాండా 71-26 పాయింట్ల తేడాతో న్యూజిలాండ్‌పై, దక్షిణాఫ్రికా 51-46 పాయింట్ల తేడాతో కెన్యాపై, నేపాల్ 103-8 పాయింట్ల తేడాతో ఇరాన్‌పై గెలిచి సెమీస్‌లోకి అడుగుపెట్టాయి. ఇక పురుషుల క్వార్టర్ ఫైనల్లో భారత్ 100-40 పాయింట్ల తేడాతో శ్రీలంకను చిత్తుచేసింది. రామ్‌జీ కశ్యప్, ప్రతీక్, ఆదిత్య విజృంభించ డంతో తొలి రౌండ్లోనే 58 పాయింట్లు సాధించిన భారత్ చివరి వరకు అదేజోరు కొనసాగించింది. రెండో రౌండ్‌లో తీవ్రంగా పోరాడిన శ్రీలంక ఓటమి అంతరాన్ని తగ్గించగలిగింది. ఇతర మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా 58-38తో ఇంగ్లండ్‌పైన, నేపాల్ 67-18తో కెన్యాపై గెలిచి సెమీస్‌కు చేరుకున్నాయి.

### వరల్డ్ టూర్ బ్యాడ్మింటన్ టోర్నీలో..

## ఇంటిదారి పట్టిన సింధు, కిరణ్

### సెమీస్‌కు సాత్విక్, చిరాగ్ జోడీ



**న్యూఢిల్లీ:** స్వదేశంలో జరుగుతున్న ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్ విభాగాల్లో భారత ఆశలు మోస్తున్న పివి సింధు, కిరణ్ జార్జి పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో పివి సింధు నిష్క్రమించగా, పురుషుల డబుల్స్‌లో రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ ఇండియా ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 750 ఈవెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకుని త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్‌చిరాగ్ ద్వయం తమజోరును కొనసాగిస్తూ సెమీస్‌కు దూసుకెళ్లగా సింధు, జార్జి ఓటములు పాలై నిరాశపరిచారు. ఏకంగా 21 మందితో ఈ టోర్నీ బరిలోకి దిగిన భారత్ తరఫున ఇక మిగిలింది సాత్విక్ జోడీనే కావడం గమనార్హం. ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్ పోరులో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-10, 21-17తో జిన్ యంగ్‌కంగ్ మిన్ హ్యుక్ (దక్షిణ కొరియా) జంటను చిత్తుచేసింది. ఇక సింధు 9-21, 21-19, 17-21తో జార్జియానా మరిస్క (ఇండోనేషియా) చేతిలో పోరాడిఓడింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి 13-21, 19-21తో వెంగ్ హాంగ్ యంగ్ (చైనా)కు తలవంచాడు. సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి గత ఏడాది కొరియాకు చెందిన యోంగ్ జిన్ మరియు కాంగ్ మిన్ హ్యూక్‌లపై సమగ్ర 21-10, 21-17 తేడాతో విజయం సాధించి, రన్నరప్‌గా నిలిచారు. తదుపరి ఏడో సీడ్‌లు తమ వరుసగా రెండో ఫైనల్‌లో స్థానం కోసం ఇండోనేషియాకు చెందిన స్జెఫీ గో మరియు నూర్ ఇజ్జుద్దీన్‌లతో తలపడతారు.

### ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్‌లో..

## బాలాజీ జోడీ ఓటమి

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో ఎన్ శ్రీరాం బాలాజీ, మిగుల్ ఏంజెల్ రియాస్ వరేలా జోడి.. రెండో రౌండ్‌లో ఓడిపోయింది. భారత ఆటగాడు బాలాజీ, మెక్సికో ప్లేయర్ వరేలా.. ఇద్దరూ గట్టి పోటీ ఇచ్చినా.. 67 (7), 64, 36 స్కోరుతో పోర్చుగీస్ జోడి నునో బోర్జెస్, ఫ్రాన్సిస్కో కాబ్రల్ చేతిలో పరాజయం చవిచూశారు. సుమారు రెండు గంటల 9 నిమిషాల పాటు మ్యాచ్ రసవత్తరంగా సాగింది. తొలి సెట్ 56 నిమిషాలపాటు హోరాహోరీగా సాగింది. ట్రైబేకర్‌లో బోర్జెస్, కాబ్రల్ జోడి వత్తిడిలో పైచేయిసాధించింది. ఆ తర్వాత రెండో సెట్‌లో ఇండో మెక్సిన్ జోడి తీవ్రంగా పోరాడింది. కీలకమై మూడవ సెట్‌లో బోర్జెస్‌కాబ్రల్ జోడి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. అంతకు ముందు జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత ఆటగాడు ఎన్ శ్రీరామ్ బాలాజీ మరియు అతని మెక్సికన్ భాగస్వామి మిగ్యుల్ ఏంజెల్ రెయెస్‌వరేలా రాబిన్ హాస్ మరియు అలెగ్జాండర్ నెడోవిసోవ్‌లపై వరుస సెట్లలో విజయం సాధించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. బాలాజీ మరియు రెయెస్ వరేలా తమ ప్రత్యర్థుల 16తో పోలిస్తే 23 మంది విజేతలను అధిగమించి అత్యుత్తమ నిలకడ ప్రదర్శించారు.

## దేశవాళీ క్రికెట్‌కై స్టార్ ఆటగాళ్ల క్యూ



**న్యూఢిల్లీ:** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్ పేలవ ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. తొలి మ్యాచ్‌లో గెలిచినప్పటికీ ఆ తర్వాత వరుసగా మ్యాచ్‌లు ఓడిపోయి సిరీస్‌ను 31తో కోల్పోయింది. దీంతో ఈ సిరీస్ తర్వాత భారత జట్టును ప్రక్షాళన చేస్తారనే వార్తలువచ్చాయి. ఇందులో భాగంగా ఇటీవల కాలంలో భారత జట్టు టెస్టుల్లో పేలవ ప్రదర్శన చేస్తున్న నేపథ్యంలో బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలకు ఉద్వాసన తప్పదని ప్రచారం జరిగింది. అయితే ఈ సిరీస్‌పై బిసిసిఐ సమీక్ష సమావేశం నిర్వహించింది.

ఇందులో ఆటగాళ్లపై చర్యలు తీసుకోనప్ప టికీ డొమెస్టిక్ క్రికెట్‌లో ఆడాలని సూచించింది. జాతీయ జట్టు ఎంపికకు పరిగణలోకి తీసుకోవాలంటే ఇకపై ఆటగాళ్లు దేశవాలీ క్రికెట్‌లో తప్పనిసరిగా ఆడాలి. ఆటగాళ్లు బిసిసిఐ సెంట్రల్ కాంట్రాక్ట్ పొందాలంటే కూడా దేశవాళీ క్రికెట్‌లో తప్పనిసరిగా ఆడాలి. కాగా ప్రపంచ కప్ 2024 తర్వాత విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఆ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశారు. ఇక త్వరలో ఇంగ్లాండ్‌తో జరగనున్న టి20 సిరీస్‌కు రిషభ్ పంత్‌ను ఎంపిక చేయలేదు. అతడికి విశ్రాంతి ఇచ్చారు. దీంతో ఈ ముగ్గురు రంజీ ట్రోఫీలో ఆడాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.


# వాణిజ్యం

## ప్రపంచంలో తొలి 'సిఎన్‌జి' స్కూటర్

**ముంబై, జనవరి 19:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ ప్రపంచంలోనే తొలి సిఎన్‌జి స్కూటర్‌ను తీసుకురానుంది. దీని కోసం సన్నాహాలు మొదలు పెట్టింది. భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో టీవీఎస్ తన ఫస్ట్ సిఎన్‌జి స్కూటర్‌ను ఆవి ష్కరించింది. జుపిటర్ 125 సిఎన్‌జి పేరుతో దీన్ని పరిచయం చేసింది. సందర్శన సందర్భంగా స్కూటర్‌లోని కొన్ని ఫీచర్లను రివీల్ చేసింది. టీవీఎస్ జుపిటర్ 125 సిఎన్‌జిలో 124.8సీసీ, సింగిల్ సిలిండర్, ఎయిర్‌కూల్డ్ బై ఫ్యూయల్ ఇంజిన్ ఉంటుంది. ఇది 7.2 హార్స్, ఉత్పత్తి చేస్తుంది. సీవీటీ ఆటోమేటెడ్ గేర్బాక్స్ ఈ స్కూటర్ను తీసుకురానుంది. టాప్‌స్పీడ్ గంటకు 80.5కి రెండు ఇంధన కిలోల సరఫరాతో ఈ స్కూటర్2 లీటర్ల పెట్రోల్ ట్యాంక్, 1.4ల సామర్థ్యం గల సీఎన్‌జీ సిలిండర్ ఉంటాయి. స్కూటర్ ముందు భాగంలో ఫ్యూయల్ ఫిల్లర్ క్యాప్ ఉంటుంది. ఇక సిఎన్‌జి నాజిల్ సీటు వద్ద ఉంటుంది. సిఎన్‌జి పెట్రోల్ కంబైండ్ రేంజ్ 226 కిటకిట ఇస్తుందని టీవీఎస్ గుర్తిం చింది. ఇంటికి మాక్స్ బాడీతో జూపిటర్ 125 సిఎన్‌జిని తీసుకురానున్నారు. ఎస్ఈడీ హెడ్‌లైట్, మొబైల్ ఛార్జింగ్ పోర్ట్, ఆల్ఇన్‌వన్ లాక్, సైడ్ స్టాండ్ ఇండికేటర్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఎకోథ్రస్ట్ ఫ్యూయల్ ఇంజెక్షన్, ఇంటెలిగో టెక్నాలజీతో వస్తోంది. టీవీఎస్ జూపిటర్‌తో పాటు ఇథనాల్లో నడిచే రైడర్ 125ను ఆవి ష్కరించింది.

## టెల్కోలకు రూ.లక్ష కోట్ల ఊరట!

**ముంబై, జనవరి 19:** టెలికాం కంపెనీలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఏజీఆర్ (స్థూల సర్దుబాటు ఆదాయం) బకాయిల్లో పెద్ద మొత్తంలో మాఫీ చేయాలని చూస్తోంది. టెలికాం కంపెనీలకు దాదాపు రూ.లక్ష కోట్ల మేరఊరట లభించే అవకాశం ఉంది. గతంలో దక్కించుకున్న స్పెక్ట్రమ్‌కుగానూ బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించాలన్న నిబంధనను ఇటీవల తొల గించిన ప్రభుత్వం, మరోవిడత ఊరటకు సిద్ధమైనట్లు కథనాలు వెలువడ్డాయి. తాజా నిర్ణయంతో ముఖ్యంగా వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ వంటి సంస్థలకు మేలు చేకూర్చే అవకాశం ఉందని విశ్లేష కులు నిర్ధారించారు. ఏజీఆర్ విషయంలో ప్రభుత్వ నిర్వహణను సుప్రీంకోర్టు సమర్థిస్తూ తీర్పు వెలువరించడంతో ఆయా కంపెనీలపై దాదాపు రూ.1.47కోట్ల మేర భారం పడిపోయింది. ఇందులో దాదాపు 75 శాతం మేర వడ్డీ, పెనాల్టీ, పెనాల్టీ మీద వడ్డీని పొందుతున్నారు. వొడాఫోన్ ఐడియానే అత్యధికంగా చెల్లించాల్సి ఉండగా.. ఎయిర్‌టెల్, టాటా టెలీ సర్వీసెస్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. 2025 మార్చి నాటికి వొడాఫోన్ ఐడియా బకాయిలు రూ.80వేల కోట్లకు, ఎయిర్‌టెల్ బకాయిలు రూ.42వేల కోట్లకు పెరిగే అవకాశం ఉందని టెలికాం వర్గాలు చెబుతున్నాయి. టెలికాం కంపెనీల ప్రతినిధులతో టెలికాం విభాగం పలుమార్లు సమావేశమైంది. ఈసందర్భంగా ఆర్థికంగా తాము ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఆయా కంపెనీలు ప్రభుత్వం దృష్టికి తెచ్చాయి. ఈ నేపథ్యంలో వడ్డీపై 50శాతం, పెనాల్టీలు, పెనాల్టీలపై విధించిన వడ్డీని 100 శాతం మేర మాఫీకి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపాయి. ఈ ప్రతిపాదన యధాతథంగా కార్యరూపం దాల్చితే దాదాపు రూ.లక్ష కోట్ల మేర టెలికాం కంపెనీలకు ఊరట లభించనుంది. ముఖ్యంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియాకు భారీఊరట లభించనుంది. ఈ నిర్ణయం వల్ల ఆ కంపెనీ బకాయిలు దాదాపు రూ.52 వేల కోట్ల మేర తగ్గనున్నాయి. ఎయిర్‌టెల్‌కు రూ.38వేల కోట్లు, టాటా టెలీసర్వీసెస్‌కు రూ.14 వేలకోట్ల మేర ఊరట లభించనుంది.




## క్రిప్టోకు కలిసొచ్చే కాలం

**వాషింగ్టన్, జనవరి 19:** గత నెలలో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగిన సంగతి మీకు తెలిసే ఉంటుంది. అయితే జనవరి 20న అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ తరుణంలో అమెరికా క్రిప్టోకరెన్సీకి జాతీయ ప్రాధాన్య త ఇచ్చే ఆర్డర్‌ను జారీ చేయాలని యోచిస్తున్నట్లు బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. ఈ చర్య పాలసీ మార్పును సూచిస్తుందని అలాగే ప్రభుత్వ నిర్ణయాలను రూపొందించడంలో క్రిప్టో పరిశ్రమకు మరింత ప్రముఖ పాత్రను అందించాలని భావిస్తున్నారు. నివేదికలో పేర్కొన్న సమాచారం ప్రకారం, ఈ ఆర్డర్ క్రిప్టోకరెన్సీకి జాతీయ హోదా సూచిస్తుంది, పరిశ్రమతో సహకరించడానికి ప్రభుత్వ ఏజెన్సీలను ప్రోత్సహిస్తుం ది. దీనికితోడు క్రిప్టోకరెన్సీ సలహా మండలిని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. బిట్‌కాయిన్ 101,021.39 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాప్‌తో 2 లక్షల కోట్ల వద్ద ట్రేడవు తోంది. డోనాల్డ్ ట్రంప్ ఇనాగురాల్ కమిటీకి కాయిన్‌బేస్, రిపుల్ వంటి ప్రముఖ సంస్థల నుండి విరాళాలతో సహా క్రిప్టోకరెన్సీ పరిశ్రమ నుండి గొప్ప సపోర్ట్ అందుకున్నారు. అతని రెండవ పదవీకాలం ప్రారంభానికి కొద్ది రోజుల ముందు వైట్ హౌస్‌లో పరిశ్రమ అడ్మినిస్ట్రేషన్‌తో సంబం ధాలను జరుపుకుంటూ వాషింగ్టన్‌లో క్రిప్టో బాల్ ప్రారంభం చేసుకునేందుకు సిద్ధమైంది.

మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పరి పాలనలో ఎన్నో నియంత్రణ సవాళ్లను ఎదుర్కొన్న క్రిప్టో రంగానికి ఈ చొరవ భారీ మార్పును సూచిస్తుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌తో సహా ఫెడరల్ ఏజెన్సీలు ఇటీవలి సంవత్సరాలలో క్రిప్టో కంపెనీలకు వ్యతిరేకంగా 100 కంటే పైగా అమలు చర్యలను ప్రారంభించాయి. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు డిజిటల్ ఆస్తులపై వాటి విధానాలను సమీక్షి ంచాల్సి న ఆదేశాలు ఉండవచ్చు. క్రిప్టోకరెన్సీ సంస్థలకు సంబంధించిన వాజ్యం గురించి కూడా చర్చ జరుగుతోంది అని సంబంధిత వర్గాలు బ్లూమ్‌బెర్గ్‌కి తెలిపాయి. అయితే బినాన్స్ హోల్డింగ్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలను నిలిపివేయవచ్చు, ఈ చర్యను పరిశ్రమ అత్యంత ప్రాధాన్యతగా పరిగణించింది. పరిశీలనలో ఉన్న మరో కీలక అంశం జాతీయ బిట్‌కాయిన్ స్టాక్‌పైల్‌ను సృష్టించడం అని నివేదిక పేర్కొంది.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps